
భాగవతము

# భాగవత కథాసుధ



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని స్క్రిబ్డ్ వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. దీనిద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) స్క్రిబ్డ్ వారి వెబ్ సైట్: https://www.scribd.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో స్క్రిబ్డ్ వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org    Mobile App: Free Gurukul    email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul    Helpline: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

స్క్రిబ్డ్ వారి వెబ్ సైట్:

**http://www.scribd.com**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద



"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# భాగవత కథాసుధ


రచన: డాక్టర్ మోపిదేవి కృష్ణస్వామి

(M. A., Ph.D.)


కథాలహరి శీర్షికన ఆకాశవాణి విజయవాడ కేంద్రంనుండి

ధారావాహికగా ప్రసారమైనసారథి రచన


ప్రచురణ:

ది యూనివర్సల్ హ్యూమానిటేరియన్ ఎడ్యుకేషన్ ట్రస్టు

విశాఖపట్టణం — 17

1. వ్యాసుడు — నారదుడు 1
2. కర్దముడు — దేవహూతి 11
3. ధ్రువుని తపస్సు 22
4. ప్రహ్లాదుని పరమ ప్రేమ 35
5. గజేంద్రుని మొర 47
6. బలిదానం — వామన విలాసం 59
7. శ్రీకృష్ణ జననం 75
8. రాక్షస సంహారం 89
9. చిలిపి చేష్టలు 105
10. వనభోజన వైభవం 118

నారాయణ సమారంభాం

శంకరాచార్య మధ్యమాం ।

కృష్ణమాచార్య పర్యంతాం

వన్దెగురు పరంపరాం॥

భాగవతము తెలిసి పలుకుట చిత్రము

శూలికైన దమ్మి చూలికైన

విబుధవరుల వలన విన్నంత కన్నంత

తెలియ వచ్చినంత తేటబరుతు.

# ఆకాశవాణి విజయవాడవారి సౌజన్యం

# సహృదయ సమర్పణము



లింగా నారప్ప లింగా చాయమ్మ

ఆత్మీయులు శ్రీ ఎల్. చౌడప్ప సహృదయులు మన ఉద్యమ భాగస్వాములు. వారి తల్లి తండ్రుల జ్ఞాపకార్థం ఈ గ్రంథ ముద్రణ యజ్ఞమునందు ప్రముఖముగా పాలుపంచుకొన్నారు.

ఇట్టి ధన్యజీవిని కన్న ఆ తల్లి తండ్రులు చరితార్థులు.

ఆత్మస్వరూపులైన వారు దివ్యపథములను అందుకొనెదరుగాక.

చౌడప్పగారి కుటుంబము మాష్టరుగారి నిర్దేశము ప్రకారము వర్థిల్లుదుగాక.

# వ్యాసుడు — నారదుడు

అలసులు మందబుద్ధి యుతులల్పతరాయువులుగ్రరోగ సంకలితులు మందబాగ్యులు సుకర్మము లెవ్వియు చేయజాలరీ కలియుగ మందు మానవులు —

కలియుగంలో మానవులు సోమరులవుతారు. ఒళ్లు వంచి పనిచేయడానికి ఇష్టపడరు. వారికి బుద్ధి మందగిస్తుంది. కనుక ముందుచూపు కరువవుతుంది, ఆయుః పరిమాణం తగ్గిపోతుంది. దానితో పాత్రపోషణకు కావలసినంత సమయం లబించదు. ఈ చాలీ చాలని సమయం కూడా సరిగా సాగదు. ఉగ్రరోగ స్థితులకు ఆలవాలమై, మూలుగులతో నిట్టూర్పులతో నిండిపోతుంది. అదృష్టం కలసిరాదు. తనకు తానే కలసి రాలేకపోతున్న మనిషికి ఇక అదృష్టమేం కలిసివస్తుంది? దురదృష్టం వెన్నాడుతుంది. వీడని నీడలా వెన్నాడుతుంది. కలికాలంలో మానవ జీవితానికి ఇలా కళ తప్పిపోయే ప్రామాదం ఒకటి ఉంది.

కాలం తాను మలుపు తిరుగుతూ తనతోబాటుగా తీసికొని వస్తున్న పరిణామాలివన్నీ! ఈ పరిణామాలకు అతీతంగా మానవ జాతిని నిలిపి నడపడం ఎలాగ? అని మధన పడుతున్నాడు సరస్వతీ నదీతీరాన ఆసీనుడైన వ్యాసభగవానుడు.

ఇప్పటికే ఆయన చాలా చేశాడు. వేదాలను విభాగించాడు. వేదార్థాన్ని ప్రపంచించాడు. పురాణాలను ప్రవచించాడు. మహాభారతాన్ని మహేతిహాసంగా అనితర సాధ్యమైన రీతిలో నిర్మాణంచేసి అందించాడు. అయినా అతడికి బెంగ తీరడం లేదు. ఇవన్నీ కలసికూడా కలికి బదులు చెప్పగలవని అతనికి అనిపించడంలేదు.

కారణం ఏమిటి? వీటన్నింటిలోనూ ధర్మమయమైన స్థితి నిండుగా ఉపదేశింపబడింది. వీటి దగ్గరకు మానవుడు చేరాలేగాని, అతడు తప్పక ధన్యుడవుతాడు. కాని అతడు దగ్గర కావాలికదా!

మానవుడున్నాడు. వివరింపబడిన ధర్మమున్నది. కాని మానవుణ్ణి ధర్మానికి ధగ్గరజేయగలిగిన సాధనమొకటి కావాలి. లేకపోతే ఈ చెప్పవడిన ధర్మం ఇలాగే ఉంటుంది. రాసులకొద్దీ ఉంటుంది. వ్రాసినకొద్దీ ఉంటుంది. మానవులు మాత్రం అల్లంతదూరాన అలాగే ఉంటారు. కాల ప్రభావంలో మునిగి తేలుతుంటారు. మాటి మాటికి నిరాశకు గురి అవుతూ, రోజురోజుకూ నిర్వీర్యులైపోతుంటారు.

వ్యాసుడికి అనిపించిందికదా — జరగవలసినదేదో ఇంకా మిగిలి ఉన్నట్లుగా ఉంది. అందుకేకాబోలు నాలో హృదయస్థుడై ఉన్న దైవం ఇంకా తృప్తిని ప్రకటించడంలేదు.

చూడగా, భాగవత మార్గాన రచన జరగకపోవడమే జరిగిన తప్పిదమని తెలియవస్తూ ఉన్నది. నా నుండి ఇంతవరతూ జరగనిది అదొక్కటే కనబడుతున్నది. అదొక్కటీ జరిగితే ఇంతవరకూ జరిగింది కూడా పనికివస్తుంది. అదొక్కటీ జరగకపోతే ఇంతవరకూ జరిగిందంతా కూడా ఏమీ చేయలేని స్థితిలో నిలబడిపోతుంది.

వ్యాసునికి కొంచెం కొంచెంగా స్తాయి చిక్కుతూ ఉన్నట్లుగా ఉన్నది. కలియుగానికి తగిన ప్రణాళిక ఒకటి దొరుకుతూ ఉన్నది అని అనిపిస్తున్నది.

ఆయుష్షు తగ్గి, ఆయుష్షుతోపాటు ఓపికతగ్గి, ఓపికతోపాటు ధైర్యాన్ని కూడా కోల్పోయి, ఏమి చేతగాని స్థితిలో పడిపోతున్న మానవ జాతికి చేయూతనిచ్చి, నిలబెట్టగలిగిన రచనా విధానమొకటి దైవానుగ్రహ విశేషాన పొడగడుతూ ఉన్నదిగదా! అని అనిపిస్తూ ఉన్నది.

అతనికి క్రమక్రమంగా ధైర్యం అందివస్తున్నట్లుగా ఉన్నది. హృదయస్థుడైన దైవానికి అంజలి ఘటించాడతను. కన్నులు తెరచి ఈవలకు చూచాడు. ఎదురుగా నారద మహర్షి గోచరించాడు. 'హృదయస్థుడైన దైవమే రూపుధరించి తనకొరకు ఇలా నిలిచాడు' అని అనిపించింది వ్యాసమర్షికి.

మునీంద్రా! నా పరిస్థితిని గమనించుకొన్నావు కదా! అన్నట్లుగా చూచాడు వ్యాసమహర్షి నమస్కరిస్తూనే!

చిరునవ్వు నవ్వుతున్నాడు నారద మునీంద్రుడు. గమనించుకొన్నాను అన్నట్లుగా ఆతిధ్యమందుకొంటూనే! చూపులతోనే సేదతీరుస్తూ నారదమునీంద్రుడు ఇలా అన్నాడు.

అంచితమైన ధర్మచయ మంతయు జెప్పితి, వందులోన నిం
చుంచుకగాని విష్ణుకథలేర్పడ జెప్పవు. ధర్మముల్ ప్రపం
చించిన మెచ్చునే గుణవిశేషము లెన్నినం గాక. నీకు నీ
కొంచెము వచ్చుటెల్ల హరింగోరి నుతింపమి నార్యపూజితా!

వ్యాసమహర్షీ! నీవు చెప్పని ధర్మమున్నదా? కాని లోకానికి అదొక్కటే చాలదు సుమా!

సృష్టిగతమైన ధర్మాలే మహనీయుల జీవితాల నుండి గుణగణాలుగా వ్యక్తమవుతుంటాయి.

కనుక మహనీయుల జీవితాలను విష్ణుదేవుని దివ్యగాథలుగా గొంతెత్తిగానం చేయడం అంతయినా అవసరం!

ఆ అవసరాన్ని ఇంతవరకు నీవు పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు నీకీ అసంతృప్తి అందుకే కలుగుతున్నది. గమనించుకొన్నావుకదా! ఇక భాగవత మార్గాన రచనకు ఉపక్రమించు!

మహర్షీ! ఇక్కడ కొన్ని సూక్ష్మాలు మనం చెప్పుకొందాం.

మానవుడు జ్ఞాని కావాలంటున్నాం మనం! భాగవత మార్గాన సాగినప్పుడే కర్మయొక్క ముందు వెనుకలు అతడు సూటిగా గమనించగలడు. అప్పుడు మాత్రమే కర్మను భగవదర్పితంగా నిర్వహించడమన్నది అతనికి సాధ్యమవుతుంది.

మనిషిని యోగిగా రూపొందమని ప్రోత్సహిస్తున్నాం మనం! భాగవత మార్గాన సాగినప్పుడు మాత్రమే యోగస్థితి అన్నది అతనికి సులువుగా అంది వస్తుంది.

కనుక ఏ విధంగా చూచినా భాగవత మార్గాన సాగినప్పుడే మానవుడు పరి పూర్ణుడు కాగలుగుతున్నాడు.

మహర్షీ! ఇక భాగవత మార్గాన రచనను సాగించు! మహనీయుల భవ్యజీవితాలను విష్ణుదేవుని దివ్యగాథలుగా గానం చేయి! మానవులు అప్పుడు ఆ గానానికి ఆకర్షితులవుతారు. ఆ గాథలకు దగ్గరవుతారు. ఆ మహనీయులతో కోరి చెలిమి కడతారు. దివ్యమయిన సత్సాంగత్యాన్ని అమితంగా పొందుతారు.

ఇకనేముంది! వారికి తెలియకుండానే వారు దారికి వస్తారు. నడకను సాగిస్తారు. చేరవలసిన చోటుకు చేరుకుంటారు.

మహర్షీ! భాగవత మార్గాన సత్సాంగత్యానికి నోచుకొన్నవాడు ఎంతలో ఎంతగా ఉద్ధరింపబడతాడు అన్నదానికి ఈ నేనే నీకొక ఉదాహరణ! నా యొక్క పూర్వజన్మ గాథయే ఈ మార్గాన నీకొక నిదర్శనం!

వ్యాసమహర్షీ! ఒక్కసారి మనం ఇంతకు ముందటి కల్పంలోనికి వెళదాం. అప్పుడు నేను క్రిందటి జన్మలో ఉన్నాను. మా అమ్మ వేదవాదుల ఇంటిలో దాసిగా పనిచేసేది. ఆమె ఆ ఇంట పనిచేయడమే నా అదృష్టమని చెప్పవచ్చు ! వేదనాదాలతో ఆ ఇల్లు మారుమ్రోగేది. దివ్యగానాలతో ఆ ఇంటి వాతావరణం పులకలెత్తేది. అమ్మతో బాటుగా ఆ వాతావరణంలో తిరుగుతూ ఉండేవాడిని. అలా తిరుగుతూనే ఎదుగుతూ ఉండేవాడిని.

ఇలా ఉండగా ఆ ఇంటికి యోగిజనులెందరో ఒక్కసారిగా నడచి వచ్చారు. నాలుగు నెలలపాటు అక్కడే నిలచి ఉన్నారు. చాతుర్మాస్య వ్రతదీక్షను స్వీకరించారు. వర్షాకాల శరత్కాలాలలో విష్ణుదేవుని గూర్చి హర్షాతిరేకంతో గానాలు చేశారు.

విశేషమేమంటే ఆ యోగిజనులకు పరిచారకునిగా నన్ను నియమించారు. ఆ తల్లి కొడుకుగా నాకు అందివచ్చిన అదృష్టమది!

అప్పటికి నాకు సరిగ్గా అయిదేళ్ళు! అయినప్పటికీ వారిని సేవించడం నాకు చేతనయ్యేది. అదంతా మా అమ్మ చలువ!

భయభక్తులతో మెలిగేవాడిని. వినయ విధేయతలతో మెలిగేవాడిని. నా వయస్సు బాలబాలికలు అలా అల్లంతదూరాన ఆడుతూ ఉండేవారు. అయినా అటు పోయేవాడినికాదు. అలా పోవాలని అనిపించేదికాదు. వారి సేవలో అంతటి హాయి లభించేది! ఆటపాటలకు మించిన హాయి అది! అలుపు సొలుపులకు తావులేనిది!

వారు భోంచేయగా మిగిలిన భక్ష్యాలను ఒకింత భుజించేవాడిని. అలా భుజిస్తుంటే వారి వెలుగు అలా అలా నాలో ప్రవేశిస్తున్నట్లుండేది!

చిత్రం! ఎండనిపించేదికాదు. వాననిపించేదికాదు. అలా వారి యెదుట నిలబడి ఉండాలనిపించేది. ఎక్కడికక్కడ ఎప్పటికప్పుడు వారికేమి కావాలో గమనించుకోవాలనిపించేది!

వారు నన్ను, తమకన్న వేరుగా చూడలేదు. తమలో ఒకనిగా, తమలోని వానిగా చూచుకొన్నారు. క్రమంగా వారికి ఆత్మీయుడనయ్యాను వారికి మరింత చేరువగా మసలగలిగాను. వారి ధ్యానంలో ధ్యానమై, గానంలో గానమై, వారితో ఏకమై, వారిలో లీనమై వారిదే లోకమై పరవశించిపోయేవాడిని. ఆ పరవశం నుండి పనులు పాటలుగా సాగేవి. పని పాటలు అన్నపదం అప్పుడు నాపట్ల నిజమయింది. పని పాటలు పరవశత్వం యొక్క వ్యక్తరూపాలు! పని పాటలు పెద్దల యెడల అర్చనా విశేషాలు! పని పాటలు మరింతగా పరవశించడానికి మార్గాలు!

మహర్షీ! ఏమని చెప్పనూ, ఎంతని చెప్పను! ఆ అవకాశాన్ని గూర్చి, ఆ అనుభూతిని గూర్చి, అయిదేళ్ళ వయస్సున అందివచ్చిన ఆ అదృష్టాన్ని గూర్చి! ఏమని చెప్పను!

ఇదంతా మహనీయుల సాంగత్యఫలం! ఇదంతా మహనీయుల సాంగత్య బలం! అంతరవకూ విశ్వంగా కనబడుతున్నది, అప్పుడిక విష్ణువుగా కనబడుతున్నది. అంతవరకూ మానవుడని అనిపిస్తున్నది అప్పుడిక బ్రహ్మమునని తెలియవస్తున్నది! అంతవరకూ శరీరమునందు నేనున్నట్లుగా అనిపించేది, అప్పటినుండీ నానుండి శరీరం వ్యక్తమవుతున్నది అన్న దర్శనమిస్తున్నది. అంతవకూ త్రిగుణాలకు వశుడనై వర్తించేవాడిని, అప్పటి నుండీ త్రిగుణాలకు అతీతుడనై వర్ధిల్లడం జరుగుతున్నది.

ఇంతలో వారి దీక్ష పూర్తయింది. వెళ్ళేముందు వారు నన్నుచూచి ముచ్చట పడ్డారు. చేరదీసి వెన్ను నిమిరారు. అవధులెరుగని ప్రేమతో, అనితరసాధ్యమయిన కరుణతో వారు నన్ను ఆశీర్వదించారు.

దివ్యమైన ఆ అనుభవం మరింతగా అందివచ్చేలాగున, మరింతగా అంతు పట్టేలాగున ఉపదేశమిచ్చారు. తమ దివ్యస్పర్శనే ఆ ఉపదేశంగా అందించారు.

మహర్షీ! ఏమని చెప్పను వారు చూపిన ప్రేమనుగూర్చి, వారు కురిపించిన కరుణను గూర్చి, వారు చేరదీసిన వైనాన్ని గూర్చి, వారు నన్ను లేవనెత్తిన వైభవాన్ని గూర్చి ఏమి చెప్పను! వారు నా వయస్సును చూడలేదు. నా పుట్టుక చూడలేదు, కార్యాచరణంలో నా స్థాయిని చూడలేదు, నన్ను నన్నుగా చూశారు, నాలో తమను చూసుకొన్నారు. తమలో నన్ను నిలుపుకున్నారు.

విష్ణునిలోనికి అలా ప్రవేశించాను. విష్ణునిలోన అలా విహరిస్తున్నాను. అప్పటినుండి అలా విహరిస్తూనే ఉన్నాను.

ఆ మహనీయులతో నాకబ్బిన ఆ కొద్దిపాటి సాహచర్యం, ఆ సాంగత్య వారి సేవాఫలం నన్ను ఎంతలో ఎంతగా నిలబెట్టిందో గమనించావా మహర్షీ! ఏమని చెప్పను సత్సాంగత్య ఫలాన్ని గూర్చి! ఏమని చెప్పనూ, ఎంతని చెప్పనూ!

కథను వింటున్న వ్యాసమహర్షి ఇలా అన్నాడు: భాగవత మార్గాన సాగిన నీ పూర్వజన్మ గాథ అమృతప్రాయంగా ఉంది. సత్సాంగత్యంలోని మహిమను అది చాటి చెబుతూ ఉంది. భాగవతాన్ని రచించడం ఎంతటి అవసరమో నాకు భోదపడింది.

మహర్షీ! నీ గాథను మరింత వివరింగా వినాలని ఉంది. యోగిజనులు ఉపదేశించిన వేళ అయిదేళ్ళ బాలుడవు నీవు. ఒక చిన్న బొమ్మవు నీవు. ఆ చిన్న బొమ్మలో ఉంటూనే అవధులెరుగని బ్రహ్మాన్ని నీవెలా అనుభవించావన్నది తెలుసుకోవాలని ఉన్నది మునీంద్రా!

నారదుడు చిరునవ్వు నవ్వాడు: మహర్షీ! ఆ లోతుపాతులు కూడా మనము చెప్పుకోవడం అవసరమే! సందర్భమొచ్చింది కదా, స్మరించుకొందాం!

ముందుగా మా అమ్మను గూర్చి చెప్పాలి. ఆమె సాధుశీల. నిరంతర క్రియాశీలి. ఆ వేదవాదుల ఇంటిలో తానూ ఒకతెగా ఉండి వారిని అర్చించుకొనడం తప్ప, వారికన్నా తాను భిన్నమని ఆమె ఎన్నడూ అనుకోలేదు. వారు ఆమెనలా అనుకోనీయలేదు.

ఒకవంక పనిచేస్తూనే మరొక వంక నన్ను గమనిస్తూ ఉండేది. నిజం చెప్పాలంటే ఆమె చూపులన్నీ నావైపే ఉండేవి. అవకాశం వచ్చినప్పుడల్లా నన్ను అందిపుచ్చుకొనేది. అక్కున జేర్చుకొనేది. ఒడలు నిమిరేది. జుట్టు దువ్వేది. నా చిన్ని గడ్డాన్ని పట్టుకొని ఎన్నెన్ని ముద్దులోపెట్టేది. అమ్మది పిచ్చి ప్రేమ! అమ్మదొక వెర్రి వ్యామోహం! ఆమెకు నేనే సర్వస్వం. ఆమెకు నేనే సర్వ విశ్వం!

అందువల్ల నేను ఉపదేశానంతరం కూడా ఇంటిలోనే ఉన్నాను. అమ్మతోనే ఉన్నాను. ఎప్పటిలాగానే ఉన్నాను. అమ్మ ముద్దుకు నేనడ్డు చెప్పలేదు. నా సాధనకు అమ్మ ముద్దు అడ్డురాలేదు.

నిజానికి నేను సాధన చేస్తున్నట్లు అమ్మకు తెలియదు. తెలియవలసిన పని లేదు. అమ్మ నాలో బిడ్డను చూస్తున్నది. మురిసిపోతున్నది. నేను అమ్మలో విష్ణువును చూస్తున్నాను. పరవశిస్తున్నాను.

సాధన ఇలా సాగాలి! బంధుమిత్రులకు దూరం కావలసిన పనిలేదు. బంధు మిత్రులలో కూడా ఆ దైవాన్నే చూడగలగాలి! బంధుమిత్రులను వదిలిపెట్టమంటే అర్థమేమిటి? "వారిని కేవలం బంధుమిత్రులుగా చూడటం విరమించండి!" అని అర్థం.

అప్పుడు బంధుమిత్రులుండటం దైవాన్ని అర్చించుకోవడానికి ఒక అవకాశమవుతుంది తప్ప అడ్డుకాదు.

మళ్ళీ ఇక్కడొక సూక్ష్మముంది. మనం వారిలో దైవాన్ని చూడాలి. మనలో దైవాన్ని చూడమని మాత్రం వారిని బలవంతపెట్టకూడదు. సాధనలో ఉన్నది మనం! మనలాగే వారు కూడా సాధనలోకి వస్తారు. రానీయండి. ఈ లోపల ఇబ్బంది పెట్టకండి!

అమ్మ నాలో బిడ్డను చూస్తున్నది. నేను అమ్మలో విష్ణువును చూస్తున్నాను. కొంతసేపు అమ్మ, కొంతసేపు విష్ణువు, కొన్నిపాళ్ళు అమ్మ, కొన్నిపాళ్ళు విష్ణువు! క్రమంగా అమ్మగా కనబడుతున్న క్షణాలు తగ్గిపోయాయి. విష్ణువుగా లభిస్తున్న దర్శనం స్థిరపడసాగింది. అమ్మ నా సాధనకు ఇలా పనికి వచ్చింది. బంధుమిత్రాదులందరూ ఇలా మనకు సాధనకు పనికి వచ్చేటందుకే ఉన్నారు.

అంతలో ఒకనాటి రాత్రి పాలు పిదికేటందుకై అమ్మ బయటకు వచ్చింది. కాలసర్పమొకటి అమ్మను కాటువేసింది. కాలసర్పం కాటువేసిందా, లేక కాలమే సర్పమై కాటువేసిందా? అని అనిపించింది నాకు. శరీరాన్ని విడిచిన అమ్మకు చేతులెత్తి నమస్కరించాను. ఉత్తమగతులు కలగాలని కోరుకున్నాను. కృతజ్ఞతలు చెబుతూ ఆమెకు వీడ్కోలు చెప్పాను.

అంతే! ఇక ఇంటిని విడిచాను. ఉత్తరాభిముఖంగా సాగాను. పట్టణాలు, గ్రామాలు, జనపదాలు దాటుకొంటూ అడవులలోనికి ప్రవేశించాను. క్రమంగా కాకులు దూరని కారడవులలోనికి, చీమలు దూరని చిట్టడవులలోనికి పోతున్నాను.

వెళ్ళి వెళ్ళి ఒకచోట నిలబడిపోయాను. ఎదురుగా వెదురు పొదలు. పొదలు మన ఎదలను తలపిస్తున్నాయి. మన గుండె గుహలుగా గోచరిస్తున్నాయి. అక్కడ ఒక సమతల ప్రదేశం కనిపించింది. కూర్చుండిపోయాను. ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనించసాగింది. ఉచ్ఛ్వాస నిశ్వాసల మీదుగా గుహను సమీపించసాగింది. గుండె గొంతులో పలికింది. ప్రణవం గొంతులో ఎగసింది.

ఇంతలో ఒక మహా దర్శనం! భగవానుని విశ్వరూప సందర్శనం! పరమాత్ముని నిజస్వరూప ప్రకటనం! అరుదయిన సందర్శనమది! అనుభవైకమయినది!

ఆ దివ్య దర్శనం అలా అలా అందివస్తూ ఉన్నది. అప్రయత్నంగా ఒకానొక అనుగ్రహ విశేషంగా అనుభవానికి వస్తూ ఉన్నది.

ఇంతలో కూడని పని ఒకటి జరిగింది. మనస్సు కొంచెం కుదుట పడింది. అతనిలోనికి కరిగిపోతూ ఉన్నది. అతడయిపోతున్నది. అలా అవనీయవచ్చునుకదా, అలా సాగిపోనివ్వవచ్చును కదా!

ఒక వంక అలా కరిగిపోతూనే మరొక వంక అతడిని ఆ దివ్యరూపాన్ని చూడాలని కోరుకొన్నది. ఆ కోరికతో కొంచెంగానయినా అది మిగిలిపోయే పరిస్తితి ఏర్పడింది.

అలా మనస్సు తాను మిగిలేందుకు ప్రయత్నించడంతో ఇక అతడు తప్పుకొన్నాడు. ఒక్క ఉదుటున మాయమయ్యాడు.

మనస్సు తాను మిగల గలిగిందిగాని, తనకు మిగిలిందంటూ మనస్సుకు లేకపోయింది. ఇదంతా కుతూహల మహిమ! సాధకుడయినవాడు కుతూహలమునకు అతీతుడుగా ఉండటం అవసరం!

కన్నులవెంట నీరు ధారాపాతంగా కారుతొంది. మొదట్లో అది పారవశ్యం అటుపైన అది దుఃఖం!

ఇక నా దుఃఖానికి అవధులు లేవు. పిచ్చివానిలా అటునుండిటు, ఇటునుండి ఎటో పరుగులెత్తాను. క్రిందబడి పొర్లి పొర్లి ఏడ్చాను. అతడు తానుగా గోచరిస్తున్న వేళ, తగుదునమ్మా అని తప్పటడుగులు వేసిన వెర్రిబాగుల వాడినని వెక్కివెక్కి ఏడ్చాను.

దేవదేవుడు దయామయుడు. అతడు నా రోదనలు వినిపించుకొన్నాడు. నా వేదనను గమనించుకొన్నాడు. కనబడలేదు గాని వినబడ్డాడు. ఆకశవాణిగా నాతో పలికాడు. నేను చేసిన తప్పును తెలయజేశాడు. సాధనలో ముందుకు సాగమని ఆశీర్వదించాడు.

ఇంకొక మాట చెప్పాడు! నీవు నా కొరకని బయలుదేరావు. నన్నే కోరుకొంటూ, సకలమునందూ నన్నే గమనించుకొంటూ ఇలా నడుచుకొంటూ వస్తున్నావు. నీ సాధనయొక్క వేగాన్ని పెంచడం కోసం ఇలా ఒకసారి నీకు కనిపించాను.

నన్ను రుచి చూశావు కదా! ఇప్పటికిది చాలు! ఈ అనుభూతితో ఇక ముందుకు సాగు! అడుగడుగునా, అణువణువునా అంతర్యామిగా నన్నే గమనించుకొంటూ, ఈ నీ జీవితాన్ని సార్ధకం చేసుకో!

ఈ శరీరం పడిపోయిన తరువాత నీకు భాగవత శరీరం వస్తుంది. ఈ కల్పాంతంలో నీవు బ్రహ్మతో పాటుగా నాలో ప్రవేశిస్తావు. వచ్చే కల్పంలో నా అనుగ్రహ విశేషాన బ్రహ్మ మానస పుత్రునిగా రూపొందుతావు. నారదుడవై నారాయణ స్థితిని ఎల్లరకు అందించగలిగిన వాడివి అవుతావు. బాలకా! చాలునా!

వ్యాసుని కన్నుల వెంట బాష్పాలు రాలుతున్నాయి. నారదుని చేతివేళ్ళు మహతిని మీటుతున్నాయి. మహతి మీటులు భాగవత ఘట్టాలుగా రూపొందబోతున్నాయి.

'ఇలా' అనిచెబుతున్నాడు శుకయోగి పరీక్షిత్తుకు.

అలనా! అన్నట్లుగా వింటూ ఎదో అనుభూతిలో సొక్కుతున్నాడు, పరీక్షిత్తు శుకయోగికి మొక్కుతున్నాడు.

# కర్దముడు — దేవహూతి

అప్పటికి ఈ సృష్టి కల్పింపడలేదు. ఈ సృష్టికల్పం ఇంకా ప్రారంభం కాలేదు. ఉన్నట్లుండి బ్రహ్మకు తాను ఉన్నట్లుగా తెలిసింది. అలాంటి మేలుకొలుపు ఒకటి కలిగింది. ముందు వెనుకలకు చూచుకొన్నాడు. తానొక పద్మంలో ఉన్నట్లు గమనించుకున్నాడు.

బాగున్నది. కొంతసేపు అలా గడిచింది. అంతలో అలోచన ఒకటి కలిగింది. నేనున్నాను. పద్మంలో ఉన్నాను. మరి ఈ పద్మానికి మూలమేమిటి ? దీనికి మొదలెక్కడ?

ఈ అలోచనతో అతడు పద్మంనుండి క్రిందకు దిగి జలాలలో ప్రవేశించాడు. పద్మానికి క్రిందుగా జేరి, అలా తూడువెంట, ఆ తూడే తోడుగా పయనించసాగాడు. పైనుంచి దిగువకు పయనించసాగాడు. చిత్రం! ఆ పయనానికి దరీ, అంతూలేవు ఎంత వెళ్ళినా వెళుతూ ఉండటమే అలా! ఇంతకూ మొదలెక్కడ? అంతుబట్టడం లేదు. మొదలెక్కడా అని అరాటపడటంకన్నా మొదట ఎక్కడనుండి బయలుదేరామో అక్కడికే చేరుకోవడం మంచిది అనిపించిందతనికి.

మళ్ళీ పద్మాన్ని చేరి "అమ్మయ్య" అనుకొన్నాడు. బుద్ధిగా ఎప్పటివలె పద్మంలో కూర్చొన్నాడు.

సృష్టి జరుగవలసి ఉంది. తన ద్వారా జరుగవలని ఉంది. అంతవరకూ తెలియవస్తున్నది. మరి జరిగే విధానమేమిటి? అదే ఇంకా అందిరావడం లేదు. చుట్టు కలియజూచాడు. జలాలు కనిపించాయి. ఆ జలాన్ని శ్రద్ధగా గమనించసాగాడు.

జలాలు అలా అలా కదులుతున్నాయి. అలలు అలలుగా కదులుతున్నాయి అలా అలా అలలుగా కదులుతున్నాయి. అలా అలా అలలుగా ఇలా ఇలా అంటున్నాయి. ఏమని అంటున్నాయి. ఏమంటున్నాయి? తప, తప, తప---- అంటున్నాయి. అలా అనమంటున్నాయి. బ్రహ్మదేవునికి బోధపడింది, ఇక తాను తపించాలని! సృష్టికొరకు తపస్సు చేయాలని అతనికి అలా తెలిసి వచ్చింది.

బుద్ధిగా ఉన్న చోటనే ఉండి తపస్సు ప్రారంభించాడు అతను. శ్రద్ధగా సాగుతోంది తపస్సు. సావధానంగానూ సాగుతోంది.

అలా సాగుతున్న అతని తపస్సు జ్వలించింది. వైకుంఠమతనికి దర్శనమిచ్చింది. రా, రమ్మని లోనికి అహ్వానించింది. ఆ ఆహ్వానాన్ని అందుకొని సాగుతున్నాడతను. ఇంతలో నారాయణుడతనికి చేరువయ్యాడు. చేరువవుతూనే ముచ్చటపడ్డాడు. బ్రహ్మదేవుడు పరవశించాడు. శిరస్సు వంచి నమస్కరించాడు.

ఆశీర్వదిస్తూ నారాయణుడిలా అన్నాడు. కుమారా! నీ తపస్సు నాకు నచ్చింది. ఎందువలన నచ్చిందీ అన్నది నీకుకూడా తెలియాలి. చెబుతాను విను. నీవు నీ కొరకని తపస్సు చేయలేదు. సృష్టికొరకని తపస్సు చేశావు. నా అజ్ఞను శిరసా వహించి. సృష్టి కథను నిర్వహించలన్న ధ్యేయంతో తపస్సు చేశావు. అందుకని నీవు నాకు నచ్చావు. నీ తపస్సు నాకు నచ్చింది.

ఇన్నిసార్లు సృష్టి వస్తున్నది. మళ్ళీ నాలోనికి ప్రవేశిస్తున్నది. నడుస్తున్న సృష్టి కథలలో తమ కొరకని తపస్సు చేస్తున్నవారే ఎక్కువమంది కనబడుతున్నారు. ఇలా, నీలా సృష్టి అంతటి కొరకూ తపస్సు చేస్తున్నవారు అరుదు. ఒక్కమాట చెబుతాను. తమ కొరకని తపస్సు చేస్తున్నవారిని నేను అంతగా మెచ్చలేను. నీలా సృష్టి కొరకని తపస్సు చేస్తున్నవారిని నేనెన్నటికీ మరువలేను.

కుమారా! నీ సృష్టిలోని మానవులకు కూడా ఈ నీ దృష్టి అలవడితే బాగుంటుంది. వారుకూడ నీలాగ సృష్టి అంతటికొరకు తపిస్తే బాగుంటుంది. సృష్టికొరకని తపస్సు చేస్తున్నవారు తమ కొరకని ఇక వేరుగా అలోచించుకోనక్కరలేదు కదా! ఈ సూక్ష్మం వారికి తెలియాలి. వారికి తెలిసేట్లుగా నీవు చేయాలి!

ఒక్కమాట చెబుతాను. నీ తపస్సు ఫలించి నేను నీకు సాక్షాత్కరించానని నీవు అనుకోవద్దు. నీ తపస్సుకు ముచ్చటపడి నేను నీకు సాక్షాత్కరించాను. ఆ ముచ్చటపడటం "ఎంత

తపస్సు చేస్తున్నారు" అన్నదానిమీద ఆధారపడి ఉండదు, ఎందుకు తపస్సు చేస్తున్నారు, ఎలాంటి భావంతో తపస్సు చేస్తున్నారు. అన్న దాని మీద ఆధారపడి ఉంటుంది.

నేను ముచ్చటపడుతున్న ఈ సందర్భంలో ఏదయినా ఒక కోరిక నీవు కోరుకుంటే బాగుంటుంది. నేనే కోరమంటున్నాను కనుక వెనుకాడనక్కరలేదు.

ఆ ప్రేమకు బ్రహ్మదేవుడు పులకించిపోయాడు, "తండ్రీ! తప్పక కోరుకుంటాను". ఆ కోరిక కూడ నీ కొరకే కోరతాను. నేను నిన్ను మరచిపోకుండా ఉండటం అనే కోరిక కోరతాను అన్నట్లుగా చూస్తూ ఇలా అన్నాడు బ్రహ్మదేవుడు, తండ్రీ! నా ద్వార సృష్టి కార్యం నడుస్తూ ఉంటుంది. అలాంటప్పుడు ఏమాత్రం ఏమరపాటు కలుగినా, సృష్టి నా నుండి జరుగుతున్నది అన్నభావం తప్పుకొని, నా వలన జరుగుతున్నది అన్న భావన నాలో కలగడానికి అవకాశమున్నది. కూడని ఈ స్థితి దాపురించకుండా నన్ను రక్షించు.

నేను నీ కన్న భిన్నుడను కాను అన్న మెలుకువ నాలో ఎప్పుడూ ఉండాలి. ఆ మెలుకువకు మెలిక పడకుండా చూడు. నేను నీవాడినిగా ఉంటూ నీకొఱకు, నీ కోరికగా పనిచేతున్న తృప్తిని నాకు నిరంతరం కలుగనీ!

ఇంతవరకూ నేను కోరింది నా కోరికలో మొదటిభాగం. అదేమిటి అంటే ఎల్లవేళలా నీ నుండి విడివడకుండా, నీ వాడినిగా ఉండటం! ఇక రెండవభాగం ఏమంటే, నా నుండి వెలువడుతున్న సృష్టిని నీ స్వరూపంగా చూడగలగడం! అది నీకన్నా వేరుకాదని తెలియగలగడం! ఆ తెలివిగలగడం! ఎందువల్లనంటే సృష్టి అన్న తరువాత అందులో వైవిధ్యముంటుంది. నామరూపాలు అనేకంగా ఉంటాయి. అసలు వస్తువును తెలుసుకొని ధ్యానించుకోవడానికి ప్రత్యకమైన శ్రద్ధా, అభ్యాసమూ అవసరమవుతాయి. అందువలన అడుగుతున్నాను. వెలువడుతున్న సృష్టిని నీ స్వరూపంగా దర్శిస్తూ, ఆ నీ దివ్య రూపానికి నిరంతరం ప్రణమిల్లే అవకాశాన్ని, స్వభావాన్ని అనుగ్రహించు తదనుగుణమైన శక్తిని నాకు అందించు! అప్పుడు ఇటూ నీతో ఉంటాను. అటూ నీతో ఉండాను. ఎటు చూసినా నీతో ఉంటాను.

చేస్తున్నది నేను అనిపించకూడదు. అది నీవు అని తెలుయాలి. చేయబడుతున్నది నా కార్యము అని అనిపించకూడదు. ఆ కార్య రూపాన్ని ధరిస్తున్న నీవు ఎప్పటికప్పుడు నా మనస్సులో పొడగడుతూ ఉండాలి. తండ్రీ! అలాంటి వివేకాన్ని నాలో కలిగించు. అలంటి వివేకాన్ని నాలో వెలిగించు అంటూ శిరస్సు వంచి అంజలి ఘటిస్తున్నాడు బ్రహ్మదేవుడు.

కుమారా! ఇప్పుడు నీవన్న మాటలు నీకేకాదు, ఇవి ఈ సృష్టికతాకంతటికీ వర్తిస్తాయి. సృష్టిలోని నరులందరూ పొందవలసింది. ఇప్పుడు నీవందుకొంటున్న ఈ దివ్యదర్శనాన్నే! ఈ నీ కోరికను మన్నించడానికి నేను ముచ్చటపడుతున్నాను. నిన్ను నాలో నిలుపుకోవడమన్నది ఒక ఆనందప్రదమైన బాధ్యతగా నేను గమనించుకొంటున్నాను.

ఇక సృష్టి ముందుకు సాగుతున్నది. కర్దమ ప్రజాపతి వరకు సాగివచ్చింది. కర్దముడు భౌతికమైన సృష్టికి నాంది పలుకవలసినవాడు. తండ్రి అయిన బ్రహ్మదేవుడికి నమస్కరించి సరస్వతీ నదీ తీరానికి చేరుకొన్నాడు. చేరుకొని తపస్సు చేయసాగాడు. బ్రహ్మదేవుడు సంతోషించాడు. కర్దముడి ద్వారా తన సృష్టికొక రూపం రాబోతూ ఉన్నదికదా అని ఆనందించాడు.

దీక్షగా సాగుతున్న కర్దముడి తపస్సుకు నారాయణుడు మెచ్చాడు. మెచ్చి గరుడునిపై దిగివచ్చాడు. కర్దముడు నమస్కరించి నిలిచాడు.

"నాయనా, కర్దమా! నీవు తపస్సు చేస్తున్న పద్ధతి నాకు నచ్చింది. బ్రహ్మదేవుని వలెనే నీవుకూడ సృష్టికొరకు బాధ్యతపడి కృషిచేస్తున్నావు. ఈ నీ ప్రయత్నం వెంట, నా అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది!"

కర్దముడు వినమ్రుడయి నారాయణునితో ఇలా అన్నాడు. దేవదేవా! ఈ సృష్టికథ కొనసాగడంకోసం ఒక సద్గుణవతి అయిన కన్యను నాకు జతకూర్చవలసిందిగా కోరుతున్నాను. అనుకూలవతి అయిన భార్యనూ, అన్యోన్యత కలిగిన దాంపత్యాన్నీ అనుగ్రహించి, నన్నొక దివ్యమైన గృహస్థునిగా నిలబెట్టవలసిందిగా కోరుతున్నాను. గృహస్థునైన నా ద్వారా ఈ సృష్టికథను ముందుకు నడపవలసిందిగా వేడుతున్నాను.

కర్దముడి వైఖరికి దేవదేవుడు మరింతగా ముచ్చటపడి ఇలా అన్నాడు. కర్దమా! జరిగే కథ చెబుతాను విను!. స్వాయంభువమనువు ఉన్నాడు. అతని భార్య శతరూప. వారిరువురకూ ఒక కుమార్తె ఉన్నది. ఆమె పేరు దేవహూతి! ఆమె నీకు అన్నివిధాలా తగినది! నీ పనిలో నీవుండు! మనువూ, శతరూపా వారి కుమార్తెను వెంటబెట్టుకొని, వారుగా తీసికొని వచ్చి, ఆమెను నీకు కట్టబెట్టి మరీ వెళ్ళగలరు.

ఇలా నీవొక ఇంటివాడవు కాగలవు! దేవహూతి నీకు అన్నివిధాలా కలసిరాగా, ఇక సృష్టికథను నీవు ముందుకు నడపగలవు!

మీకు తొమ్మిదిమంది పుత్రికలు కలుగుతారు. వారిని మునిశ్రేష్ఠులకిచ్చి మీరు వివాసం చేస్తారు. మునిశ్రేష్ఠుల ద్వారా వారు దివ్యమైన సంతతిని పొందుతారు. అలా అలా సృష్టి అల్లుకుపోతుంది ఇక!

ఇది ఇలా ఉండగా, మీ దంపతులకు నేనొక కానుకను ఈయదలిచాను. ఆ కానుక ఏమిటో చెప్పనా, అది నేనే! నేను మీ కడుపున మగబిడ్డగా పుడతాను!

నా సృష్టి సంకల్పాన్ని బ్రహ్మదేవుని ద్వారా గమనించుకొని, ఆ సంకల్పానికి ఆరాధనా భావంతో అందివస్తున్న దంపతులు మీరు, అందువలన మీ కడుపున పుట్టాలని సంకల్పించుకొన్నాను.

"మిమ్మలను చూచి ఇప్పుడే ముచ్చటపడుతున్నాను. మీ కడుపున పుట్టి, మీకు కుమారుడనయి, మీ ముద్దు ముచ్చటలను కొల్లగా అందుకొంటూ ఇంకా ఇంకా ముచ్చటపడతాను. ఈ సృష్టికి ఆదిదంపతులు మీరు. భూమిపైన తొలిదంపతులు మీరు. దాంపత్యానికే ఒక ఒరవడిని దిద్దగలరు! ఆ ఒరవడిని అందుకొని, భూమిపైన ప్రతి దంపతులూ మీలా ప్రవర్తించిన రోజున ఈ భూమి ఆ వైకుంఠాన్ని మరిపించగలదు! దిగివస్తున్న ఈ సృష్టికి దివ్యమయిన పరిపూర్ణత లభించగలదు! ఈ శుభవేళ మీ దంపతులకు ఇవే నా శుభాశీస్సులు"

కర్దముని కనులవెంట ఆనందబాష్పాలు జాలువారుతున్నాయి. దేవదేవుడు గరుడునిపైన అలా అలా ముందుకు సాగుతున్నాడు. నూతన సృష్టికి ఊపిరిలూదబడుతున్న ప్రాణపదమైన సమయమది! కర్దముడొక కార్యకర్తగా నిలబడ్డాడు. సృష్టి కార్యమంతా తనమీదుగా దిగివచ్చేటందుకు వీలుగా ఒదిగి వర్తిస్తున్నాడు. అలా ఒదిగి వర్తించడం చేతకావడానికే ఇలా తపస్సు చేయడమని తెలిసినవాడై తపస్సును కొనసాగిస్తున్నాడు.

కాలం కొద్దిగా గడిచింది. కర్దమునికి దగ్గరలో రథమొకటి ఆగింది. స్వాయంభువమనువు, శతరూపను ప్రక్కనిడుకొని, దేవహూతితో కలసి రథం దిగుతున్నాడు. నారాయణుడే వారిని అలా నడిపించుకొని వచ్చాడని కర్దముడికి అర్దమైంది. ఎదురేగి వారిని అహ్వానించాడు. విశ్రమింపజేసి వారికి ఆతిధ్యమిచ్చాడు.

మనువు కర్దమునికి నమస్కరించాడు. నిండుమనస్సుతో కుశల ప్రశ్నలేశాడు. శతరూపనూ, దేవహూతినీ కర్దముడికి పరిచయం చేశాడు. దేవహూతిని భిక్షగా స్వీకరించి, గృహస్థునిగా రూపొంది, తమకూ, సృష్టికీకూడా ధన్యతను అందించవలసిందిగా కోరాడు.

కర్దముడు వివాహానికి సమ్మతించాడు. అయితే సంతతి కలిగేటంతవరకేకదా గృహస్థాశ్రమం ఏమంటారు? అన్నట్లుగా చూశాడు.

మనువు శతరూపతోనూ, దేవహూతితోనూ సంప్రదించాడు. కర్దముని అలోచనకు అందరూ అంగీకరించినట్లు చెప్పాడు. మను దంపతులు కర్దమ, దేవహూతులకు కళ్యాణాన్ని జరిపించారు. ఈ భూమిపైన జరిగిన తొలి కళ్యాణమది! వారికి కానుకలందించారు. మురిసిపోయారు.

ఇంతలో వారిని విడిచి తాము బయలుదేరవలసిన సమయం ఆసన్నమైంది. మను దంపతులు ఒక పట్టాన కదలలేకపోయారు. అప్పగింతలవేళ అది! ఆర్ధ్రమైన వేళ అది! కదలలేదు, నిలువలేదు, కదలి కదలి, నిలచి నిలచి, సాగి సాగి, తిరిగి తిరిగి చూస్తున్నారు. కన్నవారి ప్రేమ ఇది! కన్నవారికే తెలిసేది! మనువు శతరూపను అనునయిస్తున్నాడు. రథంపైకి ఎక్కిస్తున్నాడు. "కనిపెంచిన తల్లి కనిపించదా మళ్లీ" అన్నట్లు చూస్తున్నది దేవహూతి. కర్దమ దేవహూతులు వారి

రథం కనబడుతున్నంత వరకూ అలా చూస్తూనే ఉన్నారు. మను దంపతులు పుణ్యక్షేత్రాలవెంట సాగిపోతున్నారు.

కర్దమ దేవహూతుల సహజీవన యాత్ర ప్రారంభమైంది. దేవహూతి కర్దముని కనిపెట్టుకొని చూచుకొంటున్నది. పనిగట్టుకొని సేవిస్తున్నది. భర్తపై తనకు గల ప్రేమను శ్రద్ధగా, భక్తిగా, అర్చనగా, ఆరాధనగా రూపొందిస్తున్నది.

అంతచేస్తూ కూడ ఆమె ఎన్నడూ ఏమాత్రం మలిన స్థితిలో గోచరించడం లేదు. మల్లెపూవులా గుభాళిస్తున్నది. కాకపోతే కొంచెం చిక్కినట్లుగా కనబడుతున్నది.

కర్ధముడామెను గమనించాడు. ఆమె సేవకు మెచ్చుకున్నాడు. ఆమె అలా చిక్కినందుకు నొచ్చుకొన్నాడు. "దేవీ, నీవు సదాచార పరాయణవు, ధర్మమయ మూర్తివి! మహా పతివ్రతవు! నీవు పొందలేని సుఖముండదు కదా; కనుక నీవు సుఖపడు. సర్వసుఖాలనూ నిండుగా అనుభవించు" అన్నాడు.

దేవహూతి ఇలా అన్నది. మీ చెంతకు చేరినప్పుడే నా జీవితం ధన్యమైంది. మీ సేవలో నేను పొందుతున్న తృప్తి ఉన్నదే, అది ఈ సుఖాలన్నింటికన్నా మించినది. అయితే ఈ చిక్కడానికి కారణమొకటి ఉన్నది. దేవదేవుని సృష్టి సంకల్పానికి అనుగుణంగా సంతతిని పొందడంకోసం దంపతులమయ్యాం. సంతతికొరకే కదా, మీరు నన్ను స్వీకరించారు. కనుక ఆ విషయమై శ్రద్ధ పెట్టవలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాను.

సంతతికి తగిన సమయం ఆసన్నమైనదని కర్దముడు గమనించుకొన్నాడు. ఆమెను చూస్తూ ఒక చిరునవ్వు నవ్వాడు. ఆమె కూడా చిన్నగా నవ్వింది. కర్దముడు ఒకసారి చుట్టూ చూశాడు అంతే! ఉధ్యానవనాలు వ్యక్తమయినాయి. మహా భవనాలు నిలచి ఉన్నాయి. పరిచారకులెంధరో బారులు తీర్చారు. ఉపచారాలకు కావలసిన ఏర్పాట్లు దండిగా జరిగాయి. కర్దముడు ఆనందంగా ఆశ్చర్యంగా చూచాడు. అతడి యోగమాయ వైభవాలవి! దేవహూతిపై అతనికి గల ప్రేమకు సంకేతాలివి!

అన్నింటిని దేవహూతికి చూపాడు. ఆమె తల ఊపలేదు, ఓహో అనలేదు, సంబరపడలేదు. ఆమెకు భర్త ముఖ్యంగాని అతని సిరిసంపదలు ముఖ్యంకాదు. భర్తకన్నా, భర్త పెట్టిపోతలకే విలువ నీయగల అవివేకి కాదామె! అన్నింటిలో నుండి ఆమె అతడివైపే చూస్తున్నది. అతడి మీదుగా వ్యక్తంకాగల సృష్టికార్యం వైపు చూస్తున్నది.

కర్దముడికి ఆశ్చర్యం, ఆనందం! ఆమె ఏకాగ్రతకూ, ఆమె నిశ్చల స్థితికీ అతడు అబ్బురపడ్డాడు. మురిసిపోయాడు. మురిసిపోతూ ఆమెకు దగ్గరయ్యాడు. క్షణాలలో వారిరువురూ ఏకమయ్యారు. రసమయ లోకాలలో విహరించసాగారు.

వారి దాంపత్యం ఫలించింది. వారికి వరుసగా తొమ్మిదిమంది కుమార్తెలు కలిగారు. దంపతులు తల్లిదండ్రులయ్యారు. అలా అవ్వడంలో విశేషమైన అనుభవాన్ని రుచిచూచారు. సంభరపడ్డారు.

ఉన్నట్టుండి ఒకనాడు కర్దముడు అన్నాడు. నేనిక నిష్క్రమించవచ్చునా? అని.

దేవహూతి అతడిలోనికి చూస్తూ ఇలా అన్నది: "సంతతి కలిగేంతవరకు మాత్రమే గృహస్థుగా ఉంటాను." అన్న మీమాట నాకు గుర్తున్నది. కాని, ఒక్క మాట అడుగుతాను. కనడంవరకేనా, పెరగడంలో మీ ప్రమేయం లేదా? వీరిని పెంచి పెద్దచేసి, మునిశ్రేష్ఠులకిచ్చి వివాహాలు జరిపించినప్పుడు కదా, కథ ఒక కొలిక్కి వచ్చేది. మరి అప్పుడే వెళ్ళిపోతానంటారేమిటి? ఆ తొందర ఏమి?

ఇంకొకమాట చెబుతాను ఆలకించండి! సంతతి నిచ్చారు బాగున్నది. మరి నన్ను ఉద్ధరించవద్దా? నాకు తరుణోపాయాన్ని ఉపదేశించవద్దా? తత్వదర్శనానికి కావలసిన దోహదాన్ని మీరు నాకు అందించవద్దా? సంతతి పొందడం ఎంత అవసరమో, మనం ధన్యత చెందడం కూడ అంత అవసరం కదా! సంతతిలో పాలు పంచుకొన్నారు. ధన్యతలో పాలుపంచుకోవద్దా? ఒకరికొకరు తోడుగా దంపతులు ధన్యత చెందాలి! అప్పుడే వారికి పరిపూర్ణత!

మీరొక పనిచేయండి. నాకు కొంచెం కలిసిరండి! ఈ పిల్లలను పెద్దచేద్దాం! రావలసిన సృష్టికి కావలసినవారుగా వీరిని తీర్చిదిద్దుదాం! ఈ లోపున మీరుగా నాకు చేయూతనిచ్చి, ఆత్మపథం వెంట నన్ను నడిపించినాసరే, లేదా అలా నన్ను ఉద్ధరించి నడపగలిగిన కుమారుణ్ణి నాకనుగ్రహించినాసరే!

కర్దమునికి దేవహూతిలో వెలుగయిన స్థితి ఒకటి కనబడింది. వెంటానే అతడికి వివాహానికి ముందు నారాయణుడిచ్చిన మాట గుర్తుకు వచ్చింది. దేవహూతి ద్వారా దారిచూపుతున్నది నారాయణుడేనని అతనికి తెలిసింది.

అతడిలా అన్నాడు: దేవీ! నీవు మకుపుత్రికవు. మనస్సును పరమార్థంవెంట నడుపగలిగిన దానవు. నీవు చెప్పినట్లుగానే చేద్దాం! నారాయణుని కొరకు ఇరువురం తపిద్దాం! అతడు మన కడుపున బిడ్డగా దిగి రాబోతున్నాడు. అతడి కొరకొక ఆహ్వానంగా ఈ మన దాంపత్య యజ్ఞాన్ని నిర్వహిద్దాం.

దేవహూతి సంతోషించింది. కర్దమునికి చేరువైంది. నారాయణుడు కర్దముని తేజస్సును వరించాడు. దేవహూతి గర్భాన ప్రవేశించాడు. అప్పటినుండీ అన్నీ శుభ శకునాలే! అన్నీ మంగళకరమైన సన్నివేశాలే!

ఒక శుభముహూర్తాన నారాయణుడు వారి బిడ్డగా అవతరించాడు. కపిలునిగా పిలువబడ్డాడు. సకల లోకాలూ సంబరపడ్డాయి. దేవతలనూ, ఋషులనూ వెంటబెట్టుకొని బ్రహ్మదేవుడు ఆ బాలుని దగ్గరకు వచ్చాడు. వచ్చి, ఆ బాలునికి నమస్కరించాడు. కర్దమ-దేవహూతులను అభినందించాడు. దేవుని సృష్టికొరకు జీవించిన దంపతులు మీరు! ఆ దేవదేవుణ్ణే ఇలా సృష్టిలోనికి తీసికొని రాగలరు! మీరు ధన్యులయినారు! మీవల్ల సృష్టి ధన్యమయింది!

మీ కుమార్తెలకు వరులు సిద్ధంగా ఉన్నారు. వారి వివాహాలు జరిపించండి. వారి ద్వారా క్రొత్తతరాలు దిగివస్తాయి! సృష్టికి నిండుదనం వస్తుంది. అని చెప్పి బ్రహ్మదేవుడు నిష్క్రమించాడు. కర్దమ, దేవహూతులు కుమార్తెలకు వివాహాలు చేశారు.

దినదిన ప్రవర్థమానమవుతున్నాడు కపిలుడు. ఒక దినాన అతణ్ణి అల్లంత దూరానికి తీసుకొని వెళ్ళి అతని పాదాలకు నమస్కరించాడు కర్దముడు. ప్రభూ! నాకిక శెలవా! అని అడిగాడు. కపిలుడు అనుమతించాడు. సాగనంపుతూ ఇలా చెప్పాడు: నేను ఒక ముని రూపంలో వచ్చానిప్పుడు! ఆవశ్యకత ఏర్పడినప్పుడు దేవుడే గురువుగా దిగివస్తాడని సకల జనులకు తెలియజెప్పడానికి ఇలా వచ్చాను! అమ్మకు కావలసినది నేనందించగలను! ఆ దివ్యబోధను అమ్మమీదుగా అందరికీ అందించగలను!

కర్దముడు అలా సాగిపోయాడు. ఎనలేని తృప్తితో సాగిపోయాడు.

దేవహూతి కపిలుడికి చేరువయింది. తత్వజ్ఞాన్ని అందించమని అతడిని శరణువేడింది. తల్లికి కుమారుడు భోదిస్తున్నాడు. కుమారుని బోధకు తల్లి పరవశిస్తున్నది. ఈ భూమిపైన మొదటి తత్వబోధ ఇదే!

కర్మ, జ్ఞానాల మీదుగా భక్తి చెంతకు నడిపించాడు కపిలుడామెను. ఆమెకు అంతర్యామి దర్శనం అందివస్తున్నది.

అంతే! కపిలుడు అంతర్థానమయ్యాడు. ఆమె నివ్వెరపోయింది. 'కపిలా, కపిలా!' అంటూ ముందుకు సాగింది. చెట్టులో, పుట్టలో అతనికొరకే వెతకసాగింది. అణువునుండి బ్రహ్మాండం వరకూ అతడినే దర్శించసాగింది. కపిలుడు ఆమె పాలిట అంతర్యామి అయ్యాడు. ఆమెకు అందివస్తున్న అంతర్యామి అనుభవానికి ఇలా తాను అంతర్థానం కావడం ద్వారా పరిపూర్ణతను అందించాడు. దేవహూతి ఆ దర్శనంలో సాగుతున్నది. ఆ దేవదేవునిలో కరిగిపోతున్నది.



# ధ్రువుని తపస్సు

స్వాయంభువమనువు కుమారుడు ఉత్తానపాదుడు. ఉత్తానపాదుడి భార్యలు సునీతి, సురుచి. సృష్టినంతటినీ సమదృష్టితో పాలించిన ఉత్తానపాదుడు భార్యలను మాత్రం సమదృష్టితో చూడలేకపోయాడు. చిన్నభార్య అయిన సురుచి యెడల మోహితుడయి, పెద్దభార్య అయిన సునీతను నిర్లక్ష్యం చేశాడు.

సునీతి కొడుకు ధ్రువుడు, సురుచి కొడుకు ఉత్తముడు. ఒకనాడు ధ్రువుడు తండ్రి దగ్గరకు వచ్చాడు. అప్పటికే ఉత్తముడు తండ్రిచేత లాలింపబడుతున్నాడు. ఉత్తముణ్ణి తొడపైన కూర్చోపెట్టుకొని మరీ ముద్దుజేస్తున్నాడు ఉత్తానపాదుడు. ధ్రువునికి తాను కూడా తండ్రి తొడపైన కూర్చొని, తండ్రిచేత అలా ముద్దు చేయబడితే బాగుంటుంది అనిపించింది. తండ్రినుండి ఆ ముద్దును అనుభవింపగోరి తండ్రి తొడపైకి ఎక్కే ప్రయత్నం చేస్తున్నాడు ధ్రువుడు.

ఆ ప్రయత్నాన్ని గమనించింది సురుచి, ధ్రువుని ఈసడించింది. "నీ బ్రతుకుకు తోడు అంతటి అదృష్టమా! అంతటి అదృష్టమే కనుక నీకున్నట్లయితే నీవు నా కడుపుననే పుట్టి ఉండేవాడివి" అని నిష్ఠూరమాడింది.

ఒక్క క్షణమాగి ఇంకా ఇలా అన్నది: ఎందుకని నీకు ఆ అదృష్టం కలుగలేదో అలోచించుకో! అదృష్ట హీనుడవైన నీవు ఇలా వెంపరలాడటం మానుకో! చేతనైతే విష్ణుని పాదాలు ఆశ్రయించు! అప్పటికయినా నీకొకదారి దొరుకుతుంది. నా బిడ్డను చూచి ఈర్ష్యపడి ఏమి లాభం? పో ఇక్కడినుండి. దిక్కేమిటో అలోచించు!

సురుచి ఇంతగా నిష్ఠూరాలాడుతున్నా ఉత్తానపాదుడు కిమ్మనలేదు. చూడనట్లూ, వినీ విననట్లూ ఊరుకొన్నాడు. పినతల్లి అలా అన్నందుకన్నా, తండ్రి ఇలా ఉండిపోయినందుకు ధ్రువుని మనస్సు క్షోభించింది.

ధ్రువుడు తల్లిని చేరి భోరున ఏడ్చాడు. ఇదేమి దురదృష్టమమ్మా మనకు అని రోదించాడు. పరిచారకుల వలన జరిగినదంతా విన్నది సురుచి. పరిస్థితికి తల్లడిల్లింది. తాను ధాసికన్నా

హీనంగా చూడబడుతున్నది. అయినా సహిస్తూ వస్తుంది. ఇప్పుడిక కొడుకు వంతు వచ్చింది. వారసుడని కూడా చూడకుండా వీడినికూడా ఆరడి పెడుతున్నారు. ఆమె పెద్దపెట్టున నిట్టూర్చింది.

కొద్దిక్షణాల తరువాత ఇలా అన్నది: కుమారా! మీ పినతల్లి నిజమే చెప్పింది. నిజమే! మనకు విష్ణుని అనుగ్రహంలేదు. విష్ణుని అనుగ్రహమే నీకుంటే, నీకీ స్థితి రాదుకదా! నిష్ఠూరంగా చెప్పినా నిజమే చెప్పింది ఆమె. ఎవరికెంత ప్రాప్తమో ఎవరు చేసికొన్నది ఎంతో! ఎవరు ఎలాదారికి రావాలో! సరిజూడవలసినవాడు విష్ణువు కదా! తప్పేమున్నది? తప్పేమున్నది? అంటూ మరొక్కసారి నిట్టూర్చింది.

కొద్దిక్షణాల తరువాత మళ్ళీ బిడ్డను తేరిపారజూచింది ఆమె. దగ్గరకు తీసికొని కౌగలించుకొంది. విష్ణుని తలచుకొంటూ దుఃఖంలో మునిగిపోయింది. "ప్రభూ! నీ అనుగ్రహం మాపైన లేదా? నిజంగా లేదా ప్రభూ!" అంటూ ఆక్రోశించింది.

"కుమారా! దిక్కులేనివారికి దేవుడే దిక్కు! మనుషులను నిందించడం కన్నా విష్ణువును ఆశ్రయించడమే మంచిది! విష్ణువుని మనసారా తలచుకో! నీకు మంచి జరుగుతుంది. నా మాటనమ్ము" అన్నది.

తల్లిమాటను అందుకొన్నాడు ధ్రువుడు. అటూ ఇటూ చూడకుండా, ఏమీ చెప్పకుండా నడుచుకొంటూ వీధులలోనికి వచ్చేశాడు. వీధులను దాటుకొని అరణ్యాలను సమీపిస్తున్నాడు. గాయపడిన మనస్సుతో విష్ణుదేవుని తలచుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. ఆ రోదనలో కన్నులు, ముక్కులు కలసిపోయాయి. చిన్న చిన్న చేతులతో మరల మరల తుడుచుకొంటూ ఇంకా ఇంకా ఏడుస్తున్నాడు. ఏడుస్తూనే ముందుకు నడుస్తున్నాడు.

నారదునికి ఈ సంగతి గమనికకు వచ్చింది. వెంటనే అతడు ధ్రువుని యదుట నిలిచాడు. ధ్రువుడు నమస్కరించాడు. నారదుడు అశీర్వదించాడు. తన దివ్య హస్తాన్ని ధ్రువుని శిరస్సుపైన ఉంచి మరీ ఆశీర్వదించాడు.

అయిదేళ్ళ బాలుడవు! ఆశ్చర్యపరుస్తున్నావు. అభిమాన ధనుడవు. అవమానానికి ఇంతగా ఊగిపోతున్నావు క్షత్రీయుని బిడ్డవనిపించావు. కాని ఒక్కటి అలోచించావా? చిన్నపిల్లవాడవు. సమస్త సుఖభోగాలనూ వదులుకొని ఇలా వస్తున్నావు. ఈ అరణ్యవాసానికి తట్టుకోగలవా? ఆట పాటాలలో తేలియాడవలసిన వయస్సు నీది! ఎంత అవమానం జరిగితే మాత్రం ఇలా వచ్చేస్తావా? అవమానాలను పట్టించుకోవలసిన వయస్సేనా ఇది!

పోని నీది వయస్సును మించిన మనస్సనుకొందాం! వయస్సుతో నిమిత్తం లేకుండా వివేకం నీలో వెలిగింది అనుకొందాం. అప్పుడయినా నీవెలా ఆలోచించాలి. ఎదో ఎప్పుడోచేసి ఉంటాం. దానిని ఇప్పుడిలా అనుభవిస్తున్నాం అనుకోవాలి. ఈ లోకంలో చాలామంది అలాగే అనుకొంటున్నారు, సరిపెట్టుకొంటున్నారు. సర్దుకుపోతున్నారు.

అలాకాదు. ఇవన్నీకాదు. నేను మోక్షాన్నే సాధించదలిచాను అంటావా. దానికోసం ప్రయత్నిస్తున్నవారు ఎందరెందరో ఉన్నారు. అలా ఉన్నవారిలో చాలా మంది ఇంతకూ తాము ఆ మోక్షాన్ని పొందినదీ, లేనిది చెప్పలేకపోతున్నారు.

ఒక సూక్ష్మం చెబుతాను నీకు. మోక్షం పొందడానికి భాగవతమార్గం అవసరం. భాగవత మార్గాన సాగుతున్నవాడు తనకన్నా ఉన్నత స్థితిలో ఉన్నవాడిని చూచి సంతోషించాలి. తన స్తాయిలో ఉన్నవాడితో మైత్రి చేయాలి. తన స్థాయికి రాలేకపోతున్నవాడిని చూచి జాలిపడాలి!

నారదుని మాటలన్నీ విన్న ధ్రువుడిలా అన్నాడు. మీరు చెప్పిన మార్గం బాగున్నది. ఉన్నట్టుండి నేనంత భాగవతుడిని కాలేను. నా మనస్సు దెబ్బతిన్నది. గాయపడింది. ఆ పడినగాయం విష్ణుస్పర్శను ఔషధంగా కోరుకుంటున్నది. అంతవరకు చెప్పగలను.

ఇంకా చెబుతాను. నాలో పట్టుదల పెరిగింది. ఉన్నత స్థితిని సాధించి తీరాలన్న కాంక్ష రగిలింది. తప్పో ఒప్పో ఆ కాంక్షను విష్ణుదేవుని ముందు ఉంచదలిచాను, మూడు లోకాలకన్నా ఉన్నతమైనదీ ఎన్నటికీ చెదిరిపోనిది, అలాంటి స్థితి నా మనస్సు కోరుతున్నది. ఉన్నమాటా ఇది!

జరిగిన అవమానానికి పగబూని తోటివారితో పోరాడటంకన్నా పట్టుదలతో దైవాన్ని సాక్షాత్కరింపజేసికొని కావలసినదేదో అతడినుండి పొందడమే మంచిదనిపించింది.

ఈ నా స్థితి ఏమిటో నాకు తెలియదు. నేను భక్తుడనో కానో కూడ నాకు తెలియదు. మనుషులు నాకు లేకుండా చేసిన దానికోసం దేవుణ్ణి అడగడానికై పోతున్నవాడిని నేను. మనుష్యులెవ్వరూ ఊహించనట్టి దివ్యస్థితిని దేవునినుండి పొందాలని అభిలషిస్తున్నవాడిని.

మీరు మహాత్ములు. బ్రహ్మమానస పుత్రులు. బ్రహ్మదేవుని తొడపైన సావదానంగా కూర్చొని ముద్దు ముచ్చటలన్నీ పుష్కలంగా అనుభవించినవారు. అలాంటి మీరు నన్నాశీర్వదించండి. నాకు మేలు జరుగుతుంది. ఇదే మీకు ప్రదక్షిణం చేస్తున్నాను. మీరు నా విజయాన్ని ఆకాంక్షించండి! మీరు కనబడటమంటే దేవుని చెంతకు చేరేట్టి దారి కనబడటమే! నేను ధన్యుడను.

నారదుడు అబ్బురపడ్డాడు. అతని ఋజుత్వానికి ముచ్చట చెందాడు. "బాలకా! యమున ఒడ్డుకు చేరుకో! అక్కడ మధువనమున్నది, స్నానపానాలకు యమున! తపస్సాధనకు మధువనం!

నీ పట్టుదల దొడ్డది. నీ సంకల్పం గొప్పది. వేదాధ్యయనాదులు చేయలేదనీ, ఉపపానా వైఖరులు తెలిసికొనలేదనీ నీవు బాధపడవలసిన పనిలేదు. ఏకాగ్రత చెందిన నీ మనస్సే నీకు దారి చూపగలదు. మనస్సును గమనించు. మనస్సుతో ఉచ్ఛ్వాస నిశ్వాసలను గమనించు! ఆ ఉచ్ఛ్వాస నిశ్వాసల వెంట హృదయస్థుని చేరుకో!

అప్పుడు లోపలా, వెలుపలా అంతటా అతడే గోచరిస్తాడు. నిన్ను కరుణిస్తాడు, పిల్లవాడివైనా గట్టివాడివి. వెళ్ళిరా! సాధన సాగించు. లక్ష్యాన్ని సాధించు! నీకిక శుభమవుతుంది.

ధ్రువుని అటు తపస్సుకు సాగనంపి, ఇటు ఉత్తానపాదుని చేరుకొన్నాడు నారదుడు. ఖిన్నుడయి ఉన్నాడు ఉత్తానపాదుడు. ధ్రువుని తలచుకొని, తలచుకొని దుఃఖపడుతున్నాడు. నారదుడతణ్ణి సేదతీరమన్నాడు.

నారద మునీంద్రా! ఈ నా సంకట పరిస్థితిని గమనించారుకదా! భార్య యెడల వ్యామోహితుడనయి బిడ్డను దుఃఖపెట్టినవాడిని. అటూ, ఇటూ చెప్పలేక అతడిని అరణ్యాల పాలుజేసినవాడిని. అరణ్యాలలో నా బిడ్డ ఏమయిపోతాడో ఏమో? మళ్ళీ చూడగలనన్న నమ్మకం నాలో కలగడంలేదు. మునీంద్రా! చిక్కుకున్న మనస్సుతో చిక్కులు కొనితెచ్చుకొంటున్న నన్ను చూశారా!

నారదుడిలా అన్నాడు: రాజా! చూడగా ఇందంతా వాసుదేవుని ప్రణాళికగా కనిపిస్తున్నది. అతడు తలచుకోవాలేగాని మన అవలక్షణాలను కూడ అవలీలగా సద్వినియోగం చేయగలడు. ధ్రువుడు భద్రంగా ఉన్నాడు. తపస్సులో ఉన్నాడు. విష్ణు సాక్షాత్కారాన్ని పొంది మరలి వస్తాడు. నీవు దుఃఖించవలసిన పనిలేదు. నీవు కూడ విష్ణుధ్యానంలో నిలబడు! రాజ్య పాలనపై శ్రద్ధపెట్టు. వివేకమనే దీపం వెలిగిందిపుడు. ఈ దీపాన్ని ఇలా వెలగనీ! నీకిలా ముందుదారి చూపనీ! ఉపకరణాలు ఒరుసుకొన్నప్పుడు అగ్ని రగులుతుంది. సన్నివేశాలు ఒరుసుకొన్నప్పుడు వివేకం వెలుగుతుంది. ఈ వెలుగునిక నిలుపుకో! అంటూ నారదుడు బయలుదేరాడు.

ధ్రువుని తపస్సు తీవ్రంగా సాగుతోంది. అన్నపానాల ఆవశ్యకత దానికదిగా తగ్గిపోతోంది. మొదటి నెలలో మూడు రోజుల కొకసారి కాస్తంత వెలగపండు గుజ్జు తీసుకున్నాడు. రెండవ నెలలో ఆరు రోజుల కొకసారి కాసిని ఎండుటాకులు స్వీకరించాడు. మూడవ నెలలో తొమ్మిది రోజుల కొకసారి కొద్దిపాటి నీటిని త్రాగి ఉన్నాడు. నాలుగవ నెలలో ప్రణాయామ పరాయణుడయి పన్నెండు రోజులకొకసారి తగుమాత్రంగా వాయుభక్షణం చేశాడు. ఒంటికాలిపై, క్రమంగా ఒంటివ్రేలిపై నిలబడి తపస్సు చేయసాగాడు. కదలని శిలగా గోచరించాడు.

మనస్సు ఇంద్రియాలను స్వీకరించింది. ఉచ్ఛ్వాస నిశ్వాసల వెంట హృదయాన్ని సమీపించింది. హృదయస్థునిలో కరిగిపోయింది. హృదయం విశ్వరూపుడయిన నారాయణునితో తాదాత్మ్యస్థితి చెందుతుంది. సకలసృష్టితో అతనికి తాదాత్మ్యస్థితి వచ్చింది.

భూమి ఒక ప్రక్కకు ఒరిగింది. దిగ్గజాలు అటూ ఇటూ వత్తిగిల్లుతున్నాయి. దిక్పాలకుల స్థితి చిత్రంగా ఉంది. ధ్రువుడు ఊపిరి తీసికొన్నప్పుడు మాత్రం వారికి ఊపిరి ఆడుతోంది.

ధ్రువుడు శ్వాస నిలిపినప్పుడు, వారికి ఇక శ్వాస అందడంలేదు. ఇలా సృష్టి కదలికలు అతని కదలికలపైన ఆధారపడ్డాయి. అతడినిబట్టి సృష్టి అన్న స్థితి వచ్చింది. దేవతలు, ఋషులు నివ్వెరపోయారు. దేవదేవుని చేరి మొరబెట్టారు.

దేవదేవుడు ముచ్చట పడ్డాడు. ధ్రువునివైపుకు కదిలాడు. ధ్రువుని కనుల ముందు మెదిలాడు. తన చేతిలోని శంఖువుతో ధ్రువుని బుగ్గను నిమిరాడు. దానితో దేవస్థితినుండి జీవస్థితికి వచ్చాడు ధ్రువుడు. ఇంతవరకూ అనుభవించిన నారాయణ స్థితిని నోరార కీర్తించాడు. ఆ అనుభూతిలోని గాఢతకు దేవదేవుడు సంతసించాడు. "ఎంతలో ఎంత దర్శనాన్ని పొందాడీ ధ్రువుడు!" అని మురిసిపోయాడు.

బాలకా! నీ జీవనయాత్ర సాగిన తీరును గమనించాను. నీవు ఉద్దేశించిన లక్ష్యాన్ని నీకు అనుగ్రహిస్తున్నాను. మూడులోకాల కావల ప్రళయంలో కూడా చెదరని దివ్యపదం ఒకటి ఉన్నది. ఆ దివ్యపదాన్ని నీ కనుగ్రహిస్తున్నాను. ఇకపైన అది ధ్రువపదంగా ప్రసిద్ధి చెందుతుంది. సృష్టి మొత్తానికీ ధ్రువస్థితిని అందిస్తుంది.

ధ్రువా! నీవిక తల్లిదండ్రులను చేరుకోవలసి ఉంది. తండ్రికి అండగా నిలచి అతడినుండి రాజ్యాన్ని అందుకోవలసి ఉంది. ఇరవై ఆరువేల సంవత్సరాలపాటు దివ్య వైభవంతో రాజ్యపాలనచేసి, అప్పుడు ధ్రువపదానికి చేరికొని శాశ్వతమూర్తివై వెలుగొందవలసి ఉంది.

జరగనున్న కథలోని మరికొన్ని అంశాలు చెబుతాను విను. మీ తండ్రి పెద్దవాడై బాధ్యతలు నీకు అప్పజెప్పి తాను అరణ్యాలకు వెళ్ళిపోతాడు. మీ తమ్ముడు, ఉత్తముడు వేటకని వెళ్ళి యక్షుని చేతిలో చనిపోతాడు. మీ పినతల్లి సురుచి కుమారుని కొరకు దుఃఖిస్తూ, అరణ్యాలకు వెళ్ళి అక్కడ కార్చిచ్చులో పడి కాలిపోతుంది. మీ తల్లి మాత్రం నీకు తోడు నీడగా ఉంటూ, నీ సుఖ సంతోషాలలో తానూ పాలుపంచుకొంటుంది. నీవిక వెళ్ళిరా! నీకు శుభమవుతుంది.

నారాయణుని ఆశీస్సులను అందుకొని ధ్రువుడు రాజ్యానికి బయలుదేరాడు. దేవదేవుని మాటలు అతనికి గుర్తుకు వస్తున్నాయి. అతని మనస్సులో అసంతృప్తి ఒకటి కలుగుతోంది.

విజయం వేరు, తృప్తి వేరు. అతడు విజయాన్ని సాధించాడుగాని తృప్తిని పొందలేదు అని తెలుసుకొన్నాడు.

దేవదేవుని సాక్షాత్కారం కోసం జన్మల తరబడి తపస్సు చేస్తున్నవారున్నారు. అలాంటిది ఆరు నెలలలోనే ఆ దివ్యదర్శనం లభించింది. అంతటి సాక్షాత్కారం లభించినప్పుడు మోక్ష స్థితిని పొందితే ఎంత బాగుండేది! కాని మనస్సు విజయాన్ని ఆకాంక్షించింది. గతకాలపుటాలోచనలను అది వదులుకోలేక పోయింది. కనుకనే ఇదీ అని అడగకపోయినా దేవదేవుడు అదే ఇచ్చి పంపించాడు.

పొందేంతవరకు బాగున్నదిగాని, ఇప్పుడలా అనిపించడం లేదు. తమ్ముణ్ణి గురించి బాధ కలుగుతోంది. పిన తల్లిని గూర్చి జాలి కలుగుతోంది. వారిని గూర్చిన వైర భావాన్ని ఇంతవరకూ విడువలేకపోయినందుకు మనస్సు సిగ్గు పడుతోంది. ధ్రువుని మానసిక పరిణామం ఇలా ఉంది.

ఉత్తానపాదుడు తనవారందరితో కూడి ధ్రువునికి ఎదురు వస్తున్నాడు. తన వారందరినీ ఒక్కసారిగా అలా చూచి ధ్రువుడు కదిలిపోయాడు. అపురూపమయిన ఆ స్వాగత సత్కారాలకు ధ్రువుడు అబ్బురపడ్డాడు. ధ్రువుడు తండ్రి పాదాలకు నమస్కరించాడు. ఉత్తానపాదుడు ధ్రువుణ్ణి కౌగలించుకొన్నాడు. పినతల్లి సురుచి ధ్రువుణ్ణి ఎత్తి ముద్దాడింది. తమ్ముడు ఉత్తముడు నిజంగా ఉత్తముడయి ధ్రువునికి ఒదిగిపోయాదు. తల్లి సునీతి ఈ దృశ్యాలకు తన్మయత్వాన్ని చెందుతూ తనయుణ్ణి దీవించింది. లోకమంతా ఏకంగా కనబడుతోంది. జగత్తంతా ప్రేమమయంగా భాసిస్తోంది. ధ్రువుడు అందరికి అయినవాడయ్యడు. విష్ణుదేవుడు అవునన్న వాడిని లోకస్థులెవరు కాదంటారూ! అన్నట్లుగా ఉంది ఆ దృశ్యం.

ఎదిగివస్తున్న ధ్రువుని చూచి పొంగిపోతున్నాడు ఉత్తానపాదుడు. దేహంతో పాటు గుణసంపత్తి కూడా ఎదుగుతూ వస్తున్న ముచ్చట అది! అందుకే ఆ తండ్రికి అంత పారవశ్యం! అందుకే, అన్నివిధాలా అతడు ఎదిగి వస్తున్నందుకే! అతడందుకే ఎదురు చూస్తున్నాడు. ధ్రువుని పట్టాభిషిక్తునిజేసి, పరమార్ధ దృష్టితో అరణ్యాల వెంట సాగిపోయాడు. ఉత్తానపాదుడు

తనను మించిన వాడికి తన రాజ్యాన్ని అప్పగించానన్న సంతృప్తి అతనిది! ఇక అతడు వెనుదిరిగి చూడలేదు. ఆ అవసరం అతనికి కనిపించలేదు.

చక్రవర్తి అయిన ధ్రువుడు వివాహితుడు కూడ అయ్యాడు. శింశుమార ప్రజాపతి కుమార్తె "భ్రమి" అతని మొదటి భార్య. వాయుదేవుని కుమార్తె "ఇలాదేవి" అతని రెండవ భార్య. భ్రమికి ఇద్దరు కుమారులు కలిగారు. కల్పుడు వత్సరుడు. ఇలాదేవికి ఒక కుమారుడు, ఒక కుమార్తె, ఉత్కళుడు, మనోహర. ఇలా ధ్రువుడు నిండయిన గృహస్థునిగా నిలబడి వసుధైక కుటుంబ భావన కలిగి సర్వులనూ తరుగని ప్రేమాభిమానాలతో సాకుతూ, పాలించసాగాడు.

ధ్రువుని తమ్ముడయిన ఉత్తముడు వివాహమాడలేదు. ఒకనాడతడు వేటకని బయలుదేరి పోయాడు. హిమాలయ ప్రాంతంలో ఒక యక్షుడి చేత చంపబడ్డాడు. ఆ వార్త తెలిసి అతని తల్లి సురుచి పట్టరాని ఆవేదన చెందింది. అరణ్యాలను పట్టిపోయింది. అచ్చట కార్చిచ్చులో పడి కాలిపోయింది.

ఈ సన్నివేశాలను చూచి ధ్రువుని చిత్తం చలించింది. అతనిలోని మమకారం పెల్లుబికింది. తీవ్ర రోషంతో హిమాలయ ప్రాంతానికి బయలుదేరి వెళ్ళాడతను. అతనికి యక్షుల అంతు చూడాలనిపించింది. అలకా పట్టాణం సమీపానికి చేరి, శంఖాన్ని తీవ్రంగా పూరించాడు. ఆ శంఖనాదానికి యక్ష వనితలు భయకంపితులయ్యారు. యక్షులు మాత్రం నానావిధ ఆయుధాలతో ధ్రువునిపైకి త్రోసుకువచ్చారు.

యుద్ధం భీకరంగా సాగుతోంది. ధ్రువుడొక్కడే, యక్షులెందరో! అయినా యక్షుల నుదుళ్ళు చిట్లుతున్నాయి. ధ్రువుడి తాకిడికి వాళ్ళు తట్టుకోలేకపోతున్నారు. సొమ్మసిల్లి పడిపోతున్నారు. అలా పడిపోతూనే అతని పరాక్రమాన్ని చూచి ఆశ్చర్య పడిపోతున్నారు కూడా!

ఇక ఇలా లాభంలేదని యుద్ధంలోనికి తమ మాయలను ప్రవేశపెట్టారు యక్షులు. సింహాల గుంపులు, పులుల బృందాలు, ఏనుగుల మందలు అలా మీదకు వచ్చేస్తున్నాయి. అన్నివైపుల నుంచి సముద్రం అలాలేచి వచ్చేస్తున్నది. రక్తాలు, మలమూత్రాలు జల్లులయి ముంచి వేస్తున్నాయి. ధ్రువునికి ఏమీ పాలుపోవడం లేదు.

ఇంతలో అల్లంత దూరాన ఉన్న మునులు ఈ స్థితిని గమనించారు. "మనూ, మనూ!" అని మంత్రాన్ని స్మరించారు. "నాయనా! విశ్వాన్ని విష్ణువుగా చూసిన వాడివి నీవు! విష్ణువుకన్న వేరులేదని తెలిసినవాడివి. ఒక్కసారి విష్ణువును చూడు. ఇక ఈ మాయలుండావు. నీ నామ రూపాలలో కూడ విష్ణువునే చూడు అప్పుడు నీ రూపాన ఉండి యుద్ధం చేస్తున్నది కూడా విష్ణువేనని తెలుస్తుంది." అని ఉద్బోదించారు. ఆ ఉద్బోధను అందుకొన్నాడు ధ్రువుడు. ఇక విష్ణువును స్మరించాడు. ఇక మాయలు లేవు. యక్షులు మిగిలారు.

మళ్ళీ యుద్ధం సాగుతోంది. యక్షుల తలలు తెగిపడుతున్నాయి. యక్షుల రక్తం జల్లులయి కురుస్తోంది. చెవులు, ముక్కులు, గుట్టలు, గుట్టలు! యక్షులకు ఏమీ పాలుపోవడం లేదు.

ఇంతలో స్వాయంభువ మనువు గోచరించాడు ధ్రువుడు అతనికి శిరస్సు వంచి నమస్కరించాడు. మనువు ఇలా అన్నాడు: నాయనా! నీవు మను వంశంవాడివి. ఈ రోషం నీకు తగదు. ఈ యుద్ధాన్ని ఇక విరమించు, ఈ నా మాట మన్నించు!

నీ తమ్ముణ్ణి చంపించవాడు ఒక యక్షుడు అందుకు నీవు ఇందరు యక్షులను చంపుతున్నావు. పోనీ, ఇలా చంపడం వలన పోయిన నీ తమ్ముడు తిరిగివస్తాడా? ఒక్కసారి ఆలోచించు!

ఒక్క తమ్ముణ్ణి కోల్పోయి, మంకారం రగిలించిన రోషావేశంతో ఇంత మందిని నరికివేస్తున్నావు. మరి ఈ యక్షులు ఇంతమందిని కోల్పోతున్నారు. వారు నీ మీదకు రాకుండా ఎలా ఉండగలరు! ఇది కూడ అలోచించు!

మమకార పాశాలనుండి ఈ వలకు వచ్చి ఒక్కసారి గతాన్ని స్మరించు! చిన్ననాడు, అయిదేళ్ళ వయస్సున నీవు చేసిన తపస్సును గూర్చి ఆలోచించు! అప్పుడు నీ తపస్సు ఎలా సాగింది? విష్ణువు కానిది ఈ విశ్వంలో ఏదయినా ఉన్నదని నీకనిపించిందా? అలా కనిపించిందా! నీవు విశ్వంతో తాదాత్మ్యం చెందావు గుర్తుందా? విశ్వరూపుడయిన విష్ణువుతో తాదాత్మ్యంచెందావు గుర్తుందా! నీ కదలిక విశ్వానికి కదలికగా, నీ శ్వాస విశ్వానికి శ్వాసగా సాగింది, నడిచింది, అవునా!

ఒక్కసారి ఆ దివ్య స్థితిని స్మరించు! కర్తవ్యం నీకే బోధపడుతుంది. నీ తమ్ముడు మరణించడానికి యక్షుడొక నిమిత్తమాత్రుడని నీకే తెలిసివస్తుంది.

ధ్రువుడు అనుభూతి లోకాలలోనికి ప్రవేశిస్తున్నాడు. మనువు అందించిన స్మృతితో గత వైభవాన్ని అందుకొంటున్నాడు. తమ్ముడు ఇలా యక్షుని వాతపడి మరణిస్తాడని దేవదేవుడు చెప్పిన వాక్యాన్ని స్ఫురణకు తెచ్చుకొంటున్నాడు.

మనువు సంతసించాడు: "నాయనా! కుబేరుని ఆశీస్సులు కూడా అందుకో!" అని చెప్పి నిష్క్రమించాడు. మనువటు వెళ్ళగనే కుబేరుడు ధ్రువుని కనుల ముందు నిలిచాడు. ధ్రువుడు కుబేరునికి నమస్కరించాడు.

తాతగారి ప్రేరణతో రోషాన్ని విడిచిపుచ్చావు నీవు. ధ్రువుడా, నిన్ను చూస్తుంటే నాకు సంతోషంగా ఉంది. స్వయంగా అభినందించాలని ఇలా వచ్చాను. జరుగవలసినదేదో జరిగింది. నీ తమ్ముడు మరణించడానికి ఈ యక్షుడు నిమిత్తమాత్రుడు. ఈ యక్షులు ఇందరు తెగిపడటానికి నీవూ నిమిత్తమాత్రుడవు. కనుక చింతింపవలసిన పనిలేదు. అందివస్తున్న అంతర్యామి అనుభవంలో ఇక ముందుకు సాగు! అంటూ కుబేరుడు ధ్రువుని సాగనంపాడు.

ధ్రువుని పరిపాలన ఒక మహత్తరమైన అర్చనా విశేషంగా సాగుతున్నది. ప్రజలందరనూ పరమాత్మ స్వరూపులుగా దర్శిస్తూ, సేవిస్తున్నాడు ధ్రువుడు. పరిపాలన పవిత్రమయిన పూజా కార్యక్రమంగా రూపొందింది. అంతా విష్ణుమయం! ప్రేమమయం! అనుభూతిమయం, ఆనందమయం!

కాలం జరిగినట్లులేదు. కాని జరిగిపోయింది. వేల సంవత్సరాలు జరిగిపోయింది. ఇంతలో ధ్రువునికి పిలుపు వచ్చింది. ఇంటి ముంగిట విమానమొకటి ఆగింది, విష్ణుని అనుచరులిద్దరు ధ్రువుని ఆహ్వానిస్తూ నిలబడి ఉన్నారు. ధ్రువుడు విమానమెక్కాడు. 'మా తల్లి ఎక్కడ ఉన్నది?' అన్నట్లు చూశాడు. 'ఇదిగో ఇక్కడ మీ ముందు ఉన్నది.' అన్నట్లు చూపారు విష్ణుదూతలు. తల్లి బిడ్డను చూచి ముచ్చట పడింది. ధ్రువుడు తల్లిని చూచి ఆనందపడ్డాడు.

విమానం కదిలింది. పైకి లేచింది. గ్రహ మండలాలను దాటింది. మూడు లోకాలనూ దాటింది. ఆ పైనున్న హరి పదానికి చేరుకొంది.

ధ్రువుడక్కడ స్థిరపడ్డాడు. అతడక్కడ స్థిరపడటంతో ఈ సృష్టికి కూడ ఒక స్థిరత్వమొచ్చింది. ధ్రువుడున్న చోట ధ్రువపదమయింది. ధ్రువుని గాధ భాగవత గాథగా రూపొందింది. తరతరాల ప్రజలను తరింపజేస్తూ వస్తున్నది.





# ప్రహ్లాదుని పరమప్రేమ

విష్ణుదేవుని చేతిలో హిరణ్యాక్షుడు హతుడయ్యాడు. ఆ వార్త తెలిసి హిరణ్య కశిపుడు ఉగ్రుడయ్యాడు. రోషావేశాలతో ఊగిపోయాడు. రాక్షసులందరినీ రావించాడు. వారిని రెచ్చకొట్టాడు. సృష్టిలోని మంచినంతా కొల్లగొట్టమన్నాడు. మంచిని కొల్లగొడితే విష్ణువు కలగజేసికొంటాడు. ఆ కలుగజేసికొంటున్న క్షణాలలో అతణ్ణి మనం మట్టుపెట్టవచ్చు. ఇది అతడి ప్రణాళిక!

రెచ్చిన రాక్షసులు అన్ని దిక్కులకూ దూసుకుపోతున్నారు. నగరాలు, పట్టణాలు, పల్లెలు, క్షేత్రాలు, పాకలు, ఆశ్రమాలు దగ్ధం చేసికొంటూ వెళ్ళిపోతున్నారు. గుడులు, గోపురాలు, కోనేళ్ళు, ప్రాకారాలు, చలివేంద్రాలు, పర్ణశాలలు కూలద్రోసుకొంటూ వెళ్ళిపోతున్నారు. గో, బ్రాహ్మణులను హింసిస్తూ, వేదమార్గాలను కాలరాస్తున్నారు, భూమి అల్లకల్లోలమయిపోతున్నది. స్వర్గం చెల్లా చెదరవుతున్నది. మానవులు హాహాకారాలు చేస్తున్నారు. దేవతలు భయస్థులయి అడవులవెంట పరుగులెత్తుతున్నారు.

అటు రాక్షసులను అలా అన్నివైపులకూ పంపి, ఇటు తమ్ముని శరీరానికి ఉత్తర క్రియలు నిర్వహించాడు హిరణ్యకశిపుడు. అతని శరీరానికి తోడుగా భూమి మొత్తం దగ్ధమవుతోందా అన్నంత స్థితిని సృష్టించాడు.

అటుపైన దుఃఖిస్తున్న బంధువులను చేరుకొన్నాడు. గర్భశోకమనుభవిస్తున్న తల్లిని చూచాడు. వెక్కి వెక్కి ఏడుస్తున్న తమ్ముని భార్యలను చూచాడు. వారితో శ్రుతికలిపి రోదిస్తున్న బంధువర్గాన్ని చూచాడు. వారిని ఓదార్చడం అవసరం అనిపించిందతనికి.

తల్లిని అనునయిస్తూ ఇలా అన్నాడు: అమ్మా! దుఃఖపడకు. నామాట విను! వేసవికాలం వస్తుంది. చలివేంద్రాలు పెడతారు. దాహార్తులయిన జనులు గుంపులు గుంపులుగా ఆ చలివేంద్రాల దగ్గరకు చేరుతారు. దాహం తీర్చుకొంటున్న ఆకాసేపూ ఒకరినొకరు పలకరించుకొంటారు. అంతలోనే చుట్టరికాలను కలుపుకొని ఆత్మీయంగా ముచ్చటలాడుకొంటారు. ఇంతలో దాహం తీరుతుంది. ఎవరి దారిన వారు వెళ్ళిపోతారు. అమ్మా!

ఈ భూమి ఆ చలివేంద్రం లాంటిది. మనమందరం అలా కలుసుకొంటున్న వాళ్ళం. ఉన్నప్పుడు ఆనందించడంలో తప్పులేదు. ఊరికే ఉచ్చులు బిగించుకొని ఇలా దుఃఖపడకూడదు.

నిజానికి ఇదంతా అంతర్యామి లీల! ఈ దేహాలు అతడినుండి వ్యక్తమవుతున్నాయి. మళ్ళీ అతడిలోనికి కలసిపోతున్నాయి. ఆ వచ్చిపోయే లోపుల ఒకరికొకరు ఇచ్చిపోతున్నవే ఈ ముద్దు ముచ్చట్లు!

ఆ మాటలకు తల్లి కొంత కుదుట పడిందని అతడు గమనించాడు. తమ్ముని భార్యలు మాత్రం ఇంకా దుఃఖపడుతూనే ఉన్నారు. తీవ్రంగా దుఃఖపడుతున్నారు.

హిరణ్యకశిపుడు మరదళ్ళవైపుకు తిరిగాడు. మీకొక కథ చెబుతాను. ఒకానొకప్పుడు సుయజ్ఞుడనే రాజు ఉండేవాడు. అతడు శత్రువుల చేతిలో చనిపోయాడు. అతని రెండు చేతులు తెగి అటూ, ఇటూ పడ్డాయి. మధ్యలో మొండెం పడి ఉంది.

రాజు మణించాడన్న వార్త తెలిసి రాణులందరూ అక్కడకు చేరుకొన్నారు. దుఃఖంతో గొంతెత్తి ఏడవసాగారు. కాలం గడుస్తున్నదిగాని వారి దుఃఖం ఆగడం లేదు. ఇక లాభం లేదని యముడు ఒక బాలుడి వేషంలో అక్కడకు వచ్చాడు.

వారి చెంతకు చేరి ఇలా అన్నాడు: రాజు ఇంకా ఇక్కడ ఉన్నాడంటారా? ఇక్కడ ఉన్నది రాజా, రాజు దేహమా? ఒక్కసారి అలోచించండి! రాజులేడు వెళ్ళిపోయాడు ఎప్పుడో వెళ్ళిపోయాడు. ఎప్పుడు వెళ్ళి పోయాడో మీకు తెలియదు. కనీసం ఆ వెళ్ళిపోతున్నప్పుడు మీకు తెలిసి ఉంటే, ఆ కాసేపూ మీరు దుఃఖించగలిగి ఉంటే కొంత బాగుండేది. అది ఎలాగూ జరగలేదు. ఇప్పుడు ఈ దేహందగ్గర కూర్చొని ఎంత ఏడిస్తే ఏం లాభం ?

పోనీ మీరు చేస్తున్న రోదనలు ఆ రాజుకు వినబడుతున్నాయంటారా? ఆ అవకాశం లేదు. అతడు గాలిలో గాలిగా ఉన్నాడు. మీ రోదనలు వినలేడు.

పోనీ ఇంకొంతసేపు ఏడిస్తే అతడు తిరిగి వస్తాడంటారా? రాడని మీకు తెలుసుకదా! మరి ఈ ఏడవడంలో అర్థమేమిటి?

బాలుడుగా మాట్లాడుతున్న ఆ యముని మాటలు ఆ రాణులమీద పనిచేశాయి. వాళ్ళు దుఃఖించడం మానారు. రాజు శరీరానికి ఉత్తర క్రియలు జరిపించారు.

ఇలా చెప్పి హిరణ్యకశిపుడు తమ్ముని భార్యలవైపు చూచాడు. వాళ్ళు తేరుకొంటున్నట్లు గమనించాడు. ఇక అక్కడి నుండి తాను కదిలాడు.

తల్లినీ, మరదళ్ళనూ ఓదార్చి వచ్చాడుగాని తన మనస్సు మాత్రం ఊరుకోబెట్టలేకపోతున్నాడతను. మనస్సు తమ్ముని గురించి అలోచిస్తోంది. తమ్ముడు మృతుడయ్యాడని ఆలోచిస్తుంది. తాను మృతి చెందకూడదని కూడ ఆలోచిస్తోంది. ఆ ఆలోచన మధనంగా మారింది. ఆ మధనం తపస్సుకు దారితీసింది.

అరణ్యాలను చేరి తపస్సును ప్రారంభించాడు హిరణ్యకశిపుడు. బ్రహ్మనుద్దేశించి తపస్సును చేస్తున్నాడు. ఈ శరీరాన్ని ఇచ్చింది అతను. దీన్ని దెబ్బతినకుండా చూడగలిగినవాడు కూడా అతనే! అని అనిపించిందతనికి.

తపస్సు తీవ్రంగా సాగుతోంది. అతనిచుట్టూ పుట్టలు పెరిగాయి. పుట్టలకు చుట్టూ చెట్లు ఎదిగాయి. అతని శరీరాన్ని కండచీమలు పట్టి పీకుతున్నాయి. శరీరం చీలి ఖండఖండాలుగా కనబడుతున్నది. తపస్సు భయంకరంగా సాగుతున్నది.

ఆ తపస్సుకు బ్రహ్మదేవుడాశ్చర్యపడ్డాడు. హుటాహుటిని హిరణ్యకశిపునికి సాక్షాత్కరించాడు. శిథిలమవుతున్న అతని శరీరంపైన తన కమండలంలోని జలాలను జల్లాడు. దానితో హిరణ్యకశిపునికి పూర్వపురూపు వచ్చింది. తపస్సువల్ల అందివచ్చిన శోభ అందుకు తోడయ్యింది. అతడు వెలుగుతున్నాడు. అలా వెలుగుతూ బ్రహ్మదేవుని అనేక విధాల కీర్తిస్తున్నాడు.

ఆ కీర్తనకు ముచ్చటపడి వరమడగమన్నాడు బ్రహ్మదేవుడు. హిరణ్యకశిపుడు ఇలా అడిగాడు: పంచభూతములందుగాని, దిక్కులందుగాని, రేయింబవళ్ళయందుగాని మృత్యువు లేకుండా నాకు వరం ప్రసాదించు! మొసళ్ళు, రాక్షసులు, మృగాలు, సర్పాలు, దేవతలు, మానవులు మొదలయిన జంతువులతో కలహమేర్పడినప్పుడు కూడా నాకు

మృత్యువుండకూడదు. సమస్తమైన శస్త్రాస్త్రాలలో ఏ ఒక్కటీ కూడా నాకు మృత్యువును కలిగించకూడదు.

బ్రహ్మదేవుడు అతడడిగిన దానికి సమ్మతించాడు. హిరణ్యకశిపుడు ఇంకా ఇలా అడిగాడు: దేవా! నా శౌర్యమునకు ఎదురుండరాదు. లోకపాలకులుకూడా నాకు ఒదిగిపోవాలి. మూడు లోకాలను కూడ నేను జయించగలగాలి!

బ్రహ్మదేవుడు అందుకు కూడా సమ్మతిస్తూ ఇలా అన్నాడు: నాయనా భయంకరమైన నీ తపస్సుకు మెచ్చి, నీ వడిగినవన్నీ ఇస్తున్నాను. ఈ బలానికితోడుగా బుద్ధిబలాన్ని కూడ నీవు సంపాదించు! కార్యాచరణలో నైపుణ్యాన్ని ప్రదర్శించు! పెద్ద మనస్సుతో సకల లోకాలకూ హితాన్ని కోరు!

ఇలా అని బ్రహ్మదేవుడు తన దారిని తాను వెళ్ళాడు. అన్నీవిన్న హిరణ్యకశిపుడు తన దారిలో తాను మిగిలాడు. అతనికి బ్రహ్మ ఇచ్చిన వరాలు గుర్తున్నాయి గాని, బ్రహ్మ చెప్పిన మాటలు గుర్తులేవు. అసలా మాటలను అతడంతగా పట్టించుకోలేదు.

హిరణ్యకశిపునికి ధైర్యం పెరిగింది. మదం హెచ్చింది. ఇక అతడు విష్ణువుపైన తన వైరాన్ని ప్రకటించాడు. మితిమీరిన గర్వంతో సృష్టి వ్యూహాలను చెల్లా చెదురు చేయసాగాడు. దిక్పాలకులను లొంగదీసుకొన్నాడు. గంధర్వులను హడలగొట్టాడు. దేవతలను తరిమిగొట్టాడు. గ్రహగతులను అజ్ఞాపించసాగాడు. లోకాలన్నింటినీ ఆక్రమిస్తున్నాడు. స్వర్గం అతడి వశమైంది. ఇంద్రభవనం అతడి క్రిందకు వచ్చింది. సమస్తలోకాలూ తల్లడిల్లుతున్నాయి.

దేవతలు, ఋషులు విష్ణుదేవుని చేరారు. హిరణ్యకశిపుని గూర్చి మొరబెట్టుకొన్నారు. దేవదేవుడు ఇలా అన్నాడు: వరములిచ్చినవాడు బ్రహ్మదేవుడు. అవసరమున్నంతవరకు మనముకూడ ఆ వరాలను గౌరవించాలి. అటుపైన ఎలాగూ కలుగజేసుకుంటాను. అతడి కొడుకైన ప్రహ్లాదుడే అందుకు కావలసిన దారిని తెచ్చిపెడతాడు.

దేవతులు, సంతసించారు. ప్రహ్లాదుడు కారణజన్ముడని గ్రహించారు. హిరణ్యకశిపుడు తపస్సులో ఉండగా దేవతలు అతని రాజ్యంపైన దండెత్తారు. ఇంద్రుడు స్వయంగా హిరణ్యకశిపుని భార్యను చెరబట్టాడు. నారదుడు ఇంద్రుణ్ణి వారించాడు. ఈమే గర్భాన ఒక భాగవతత్పరుడు ఉన్నాడు. హిరణ్యకశిపునికి బదులుచెప్పగలిగిన దివ్యాంశ ఇతడు. ఈమెను నాకప్పగించు అంటూ ఆమెను తన ఆశ్రమానికి తీసుకువెళ్ళాడు. ఆమె అచ్చట సేదతీరింది. మనస్సుపెట్టి నారదుని సేవించుకొంది. నారదుడామెకు దివ్యబోధను అందిస్తూ ఉండేవాడు. ఆ బోధను ఆమెకన్నా, ఆమె గర్భాన ఉన్న పసికందు బాగా అందుకొనేవాడు. క్రమంగా ఆమెను నిమిత్తంగా చేసి, ఆ పసికందుకు సృష్టి తత్వాన్నంతటినీ ఉపదేశించసాగాడు నారదుడు. ఈ విధంగా హిరణ్యకశిపుని తపస్సు పూర్తయ్యేనాటికి అతనికి బదులుచెప్పగలిగిన కుమారుడు కూడ సిద్ధమయ్యాడు. విష్ణుని లీల ఇది! దేవతలు, ఋషులు ఈ లీలనంతటినీ, ఈ గాథనంతటినీ ఒక్కసారిగా స్మరించుకొని, దేవదేవునికి నమస్కరించి తృప్తిగా తమ పనులవెంట సాగిపోయారు.

ప్రహ్లాదుడు లలిత మర్యాదుడు. మర్యాద అంటే హద్దు. అతడు హద్దులను అతిక్రమించడు. అలాగని అతిక్రమించనట్లుగా మనకు తెలియనీయడు. లలితమైన క్రమశిక్షణమతడిది. మధురమైన మర్యాదస్థితి అతడిది.

ప్రహ్లాదునికి ఈ విశ్వం విష్ణుస్వరూపం. దినచర్య సమస్తం అతనికొక దైవారాధనం.

పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్ భాషింపుచున్ హాసలీ
లా నిద్రాదులు సేయుచున్ దిరుగుచున్ లక్షింపుచున్ సంతత
శ్రీ నారాయణ పాదపద్మయుగళీ చింతామృతా స్వాద సం
ధానుండై మఱచెన్ సురారి సుతున్ డేత ద్విశ్వమున్ భూవరా!

ప్రహ్లాదుడు ఇలా సర్వకాల సర్వావస్థల యందు అన్నిటా అంతటా ఈ విధమైన ఆనందానుభూతిలో ఇలా మునిగి తేలుతున్నాడు.

హిరణ్యకశిపునికి ఈ స్థితి నచ్చలేదు. తన కొడుకు మెత్తగా, మెతకగా ఉండకూడదు. చురుకుగా, కరుకుగా ఉండాలి. కావలసినది సత్వగుణ సంపన్నతకాదు. రజస్సు, తామస్సుల కలయిక. అప్పుడే అతడు రాక్షసుడు కాగలడు. తన వారసత్వాన్ని అంది పుచ్చుకొనగలడు.

అతడికి ప్రహ్లాదుణ్ణి చదివించాలనిపించింది. శుక్రాచార్యుని కుమారులను పిలిపించి, "ఇతడిని చదివించండి" అని వారికి అప్పజెప్పాడు. మనను గురించీ, మన ప్రతాపాన్ని గురించీ, మన పరిపాలనా సామర్ధ్యాన్ని గురించి వీడికి ఏమీ తెలిసినట్లు లేదు. మీరు మాకు కావలసినవారు. మా బిడ్డను మాకు తగినట్లుగా తీర్చిదిద్ది పెట్టండి. అని వారిని కోరాడు. అంతకంటేనా! అని వారా బిడ్డను తీసుకొని పోయారు.

సమ వయస్కులైన పిల్లలతో కూడి చదువు సంధ్యలు సాగిస్తున్నాడు ప్రహ్లాదుడు. గురువులు చెప్పినది చెప్పినట్లుగా చదువుతున్నాడు. అవుననడంగాని, కాదనండంగాని అతడు చేయడం లేదు. అన్ని విద్యలూ ఆ విష్ణుదేవునిలో అంతర్భాగాలే సుమా! అన్నట్లుగా ఆ అనుభూతిలోనుండి చదువుతున్నాడు.

కొన్నాళ్ళకు హిరణ్యకశిపునికి కొడుకు చదువుమాట గుర్తుకు వచ్చింది. గురువులేమి చెబుతున్నారో, వీడేమి చదువుతున్నాడో ఒకసారి గమనించి చూడటం మంచిదనిపించింది.

తన నివాస భవనంలో విశ్రాంతిగా కూర్చొని గురువులకు కబురుపెట్టాడు హిరణ్యకశిపుడు. ప్రహ్లాదునితో సహా అక్కడకు చేరుకొన్నారు గురువులు.

కుమారుని చూచి ముచ్చటపడుతూ ఇలా అన్నాడు హిరణ్యకశిపుడు: నాయనా! ఎదిగివతున్న తమ బిడ్డల మాటలను మరల మరల వినాలని కోరుకొంటారు తల్లిదండ్రులు. ఆ బిడ్డల మాటాలతో పడిన శ్రమలు మరచిపోయి సేదతీరుతారు. ఏదీ ఇలారా! తొడపై కూర్చొని ఇంతవరకు నీవు నేర్చుకొన్న దానిలో నీకు బాగా వచ్చినదేదో దానిని గూర్చి కాస్త చెప్పు.

ప్రహ్లాదుడు వినమ్రుడయి ఇలా అన్నాడు: తండ్రీ! రాక్షసరాజా! దేహధారులైనవారు తెలియక దేహాలకు పరిమితమవుతున్నారు. నేనువేరు, మిగిలినవారు వేరు అన్న భ్రాంతికి

లోనవుతున్నారు. అలాగాక, ఇందరుగా గోచరిస్తున్నది ఆ విష్ణువేనని తెలిసి, ఈ విశ్వమంతా ఆ విష్ణుదేవుని వైభవమేనని ఎరిగి, అతడియందు మనస్సు కరుగుతుండగా జీవన యాత్రను గడుపుచున్నవాడు ధన్యుడు.

హిరణ్యాకశిపుడు ఒక్కసారిగా గతుక్కుమన్నాడు. చిన్నపిల్లలు ఏమిచెబితే తిరిగి అదే చెబుతుంటారు. ఇతనికి ఇవన్నీ చెప్పిన వారెవరు? బాలకా! నాకాశ్చర్యంగా ఉంది. ఈ బుద్ధి నీకే పుట్టిందా, లేక ఎవరైనా నీకు పుట్టించారా? లేక నీ గురువులే ప్రత్యేకంగా నిన్ను కూర్చోపెట్టి నీకివన్నీ చెబుతున్నారా? నీకు తెలియదా, విష్ణుదేవుడు మనకు పరమ శత్రువు. నీ పినతండ్రిని చంపినవాడు.

ఎవరిని ఎలా జయించాలో చూడాలి. ఎవరిని ఎలా బాధించగలమో అలోచించాలి. ఎవరిని ఎలా నాశనం చేయవచ్చో యోచించాలి. అంతేగాని వారూ, వీరూ ఎవరూలేరు. అంతా విష్ణువేనంటూ ఇలా చతికిలబడి కూర్చోకూడదు.

తండ్రి మాటలని విని గురువులవైపునకు తిరిగి ఇలా అన్నాడు ప్రహ్లాదుడు: మాయవలన లేనిది ఉన్నట్లు కనబడుతున్నది. నిజానికి ఇందరులేరు. ఉన్నది ఒక్కడే: అతడే విష్ణువు. అతడియందు సమర్పణ చెందినవాడికి ఈ ఏకత్వం తప్పక బోధ పడుతుంది.

అందరిలోనూ "నేను"గా ఉన్నాడతను. వేరుగాలేడు. వారూ, వీరుగా లేడు. ఇన్ని నేనులు నేనయిన నేనుగా ఉన్నాడు. అనుభవించి చూడండి!

గురుమూర్తులారా! ఎవరు ఎంతగా చెప్పినా నాకు మాత్రం బేధభావం గోచరించడంలేదు. ఈ విశ్వరూపమే నాకు విష్ణురూపమవుతున్నది. నా మనస్సు అతనియందు కరిగిపోతున్నది. అయస్కాంతం చేత ప్రభావితం అవుతున్న ఇనుములా నేను అనుక్షణం విష్ణుదేవుని చేత ప్రభావితమవుతున్నాను. నాకిది ఒక దైవయోగంగా గోచరిస్తూ ఉన్నది.

గురుమూర్తులారా! ఉన్న స్థితి ఇది! మీరు ఇక ఎంతగా చెప్పినా నా మనస్సునకు భేద భావమన్నది అంటదు. అనుభవిస్తున్న ఏకత్వాన్ని వదిలి, బహుత్వంలోనికి నేనికరాలేను.

గురువులు ఉగ్రులయ్యారు. రోషపడ్డారు. అయిదేళ్ళ వయస్సునీది, వేలెడంత లేవు. మాకు మహావాక్యాలు చెబుతున్నావా? చెప్పిన పాఠాలను మాత్రం చెప్పవు. తండ్రినిక్కడ కూర్చోబెట్టి శత్రువును పొగుడుతున్నావా? మీ తండ్రిముందు మాకు తలవొంపులు తెచ్చావు.

వీడు రాజుకు పుత్రుడుకాడు శత్రువు. వీడినిక బ్రతిమాలి లాభంలేదు. దండించి దారిన పెట్టవలసిందే! మాకొక అవకాశమివ్వు అని అతడిని పట్టుకొనిపోయారు.

దర్మార్ధ కామాలను గూర్చి రాక్షస పద్ధతిలో అతనికి నూరిపోశారు. రాక్షస పద్ధతికి కావలసిన శాస్త్రాలలో అతడిని రాపిడి పెట్టారు. ఇక పరవాలేదనుకొని అతడిని తీసుకొని రాజుచెంతకు బయలుదేరారు.

దారిలో ఇలా అన్నారు: బాలకా, జాగ్రత్త! చెప్పింది చెప్పు, త్రిప్పి చెప్పకు, మప్పింది జెప్పు, మాధవుని సంగతి ఎత్తకు.

మధ్యలో అతణ్ణి తల్లిచెంతకు తీసుకువెళ్ళారు తల్లి బిడ్డను ముచ్చటాగా అలంకరించింది. తల్లి చెంతనుండి తండ్రి చెంతకు నడుస్తున్నాడు తనయుడు. అడుగడునా అనుభూతి చెందుతున్నాడు. తన స్మరణలో తానున్నాడు. తన్మయత్వంలో ఉన్నాడు.

తండ్రి కొడుకును చేరదీశాడు. నాయనా! చక్కగా చదువుతున్నావా? నీ తోటి పిల్లలు చూడు. ఎంత బాగా చదువుతున్నారో! చిలకల్లా చెబుతున్నార్రా వాళ్ళు. మరి నువ్వూ చెప్పాలి అలా! ఏది ఒక పద్యాన్ని చెప్పి, అర్థ తాత్పర్యాలను వివరించు.

ప్రహ్లాదుడు వినమ్రుడయి ఇలా అన్నాడు.

చదివింతిరి నను గురువులు.
సదివితి ధర్మార్ధ ముఖర శాస్త్రంబులు, నేన్
జదివినవి గలవు పెక్కులు
చదువులలో మర్మమెల్లన్ జదివితిన్ దండ్రీ!

తండ్రీ! మనసా, వాచా, కర్మణా అంతర్యామి అయిన విష్ణుదేవుని సేవించినవాడు ధన్యుడు. ఈ సృష్టికి అర్థమూ, పరమార్థమూకూడనతడే! విష్ణుదేవుని సేవించనినాడు జీవితాలకిక అర్థంలేదు. ఈ మన జన్మలకిక సార్థకతలేదు.

కమలాక్షు నర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ.
సురరక్షకుకునిన్ జూచు చూడ్కులు చూడ్కులు శేషశాయికి మ్రొక్కు శిరము శిరము.

విష్ణునాకర్ణించు వీనులు వీనులు మధువైరిన్ దవిలిన మనము మనము.
భగవంతు వలగొను పదములు పదములు పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి.

దేవదేవునిన్ జితించు దినము దినము.
చక్రహస్తునిన్ బ్రకటించు చదువు చదువు.
కుంభినీధవున్ జెప్పెడి గురున్ డు గురున్ డు.
దండ్రీ! హరిన్ జేరు మని యెడ తండ్రి తండ్రి.

ప్రహ్లాదుడు ఇలా అనేసరికి ఆ తండ్రి ఇక తట్టుకోలేకపోయాడు. ఏమిటిది అని గురువులపైన విరుచుకు పడ్డాడు. గురువులు చెప్పారు: నీ పాదాలపైన ఒట్టు! ఇదంతా మీ కుమారుని సొంత ప్రతిభ! విపత్తు ఇతడి రూపంలో ముంచుకు వస్తోంది. బయటపడే మార్గమేదో అలోచించండి!

హిరణ్యకశిపుడికి తల తిరిగిపోయింది. ప్రహ్లాదుణ్ణి వధించడమే పరిష్కారమనిపించింది. వెంటనే రాక్షసులను పిలిచాడు. ప్రహ్లాదుణ్ణి వారికి అప్పగించాడు. "వీణ్ణి చంపి పారేయ్యండి!" అని ఆదేశించాడు.

రాక్షసులు శస్త్రాస్త్రాలతో లక్షవిధాల ప్రయత్నిస్తున్నారు. ప్రహ్లాదుడుమాత్రం లక్షణంగా ఎప్పటిలాగనే ఉన్నాడు. కనీసం కందనైనా లేదు.

రాక్షసులు చంపడానికి యత్నిస్తున్నప్పుడు విష్ణువును గొంతెత్తి స్మరిస్తున్నాడు, వద్దనడు, పారిపోడు, తండ్రి దగ్గరకు రాడు. తల్లిదగ్గరకు పోడు.

హిరణ్యాకశిపుడు ఆశ్చర్యపడ్డాడు. ప్రయత్నాలను ఇంకా ఇంకా పెంచమన్నాడు. ఇక ప్రహ్లాదుని మట్టుపెట్టడానికి అనేక విధాల ప్రయత్నించారు రాక్షసులు. అతనిపైన ఏనుగులను నడిపించి చూశారు. పాములతో కరిపించి చూశారు. మంటలలో పడవేసి చూశారు. కొండచరియలనుండి దొర్లించి చూశారు.

ఎన్నిచేసినా ప్రహ్లాదుడు ప్రహ్లాదుడుగానే ఉన్నాడు. ఈసారి హిరణ్యాకశిపుడు ఖిన్నుడయ్యాడు. ప్రహ్లాదుడు చనిపోనందుకుగాదు. అతడు తనను ద్వేషించనందులకు! ఇంతచేస్తున్నాను. ఇన్నివిధాల పీడిస్తున్నాను. నన్ను ద్వేషించడేమిటి? కనీసం దూషించడేమిటి? ఆఖరుకు నావంక కోపంగానైనా చూడడేమిటి?

ఇతడి వైఖరిని చూస్తుంటే నాకు భయం వేస్తోంది. ఇతడు మాములు వ్యక్తి కాడు. నా కొరకు దిగివచ్చినట్లున్నాడు. నాకేదో భయం వేస్తోంది. ఆశ్చర్యం! నా మనస్సు వణుకుతున్నది. ఇంతలో గురువులు అక్కడికి వచ్చారు. "రాజా! చింతపడకు. శుక్రాచార్యులు రాబోతున్నారు. వారు ఇతడిని బాగుపరచగలరు. అదీగాక, ఇతడు చిన్నపిల్లవాడు. వయస్సు వచ్చినకోద్దీ అతనే తెలుసుకొంటాడు. మేం జాగ్రత్తగా చదివిస్తాము కదా!" అని అతణ్ణి తీసుకొనిపోయారు.

ప్రహ్లాదుడు ఈసారి గురుకులాన్ని విష్ణుమయం చేశాడు. గురువులు గృహకృత్యాల్లో ఉండగా, విధ్యార్థులందరూ ప్రహ్లాదునికి మొక్కసాగారు.

ఈ ప్రమాదాన్ని గమనించిన గురువులు గురుకులం రూపురేఖలు మారిపోతున్నాయన్న విషయాన్ని హిరణ్యాకశిపునికి విన్నవించారు. హిరణ్యాకశిపుడు మండిపడ్డాడు. హుటాహుటిని ప్రహ్లాదుడిని రప్పించాడు.

"విష్ణువు, విష్ణువు, విష్ణువు ... ఏక్కడరా నీ విష్ణువు!" అరిచాడు హిరణ్యాకశిపుడు.

వినమ్రుడయి ప్రహ్లాదుడిలా అన్నాడు: తండ్రీ! విష్ణువును గూర్చిన ప్రసక్తి వచ్చినప్పుడల్లా "ఎక్కడాలేడు" అని నీవంటున్నావు. "ఎక్కడలేడు?" అని నేనడుగుతున్నాను.

ఇందుగలఁ డందులేఁ డని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే గలడు దానవాగ్రణీ! వింటే.

ప్రహ్లాదుడు ఇలా అనేసరికి విష్ణుదేవుడు నరసింహరూపుడై విశ్వమంతా వ్యాపించి ఉన్నాడు. ఎప్పుడు పిలిస్తే అప్పుడు, ఎక్కడ పిలిస్తే అక్కడి నుండి వ్యక్తమవడానికి వీలుగా కావలసిన రూపంతో సంసిద్ధుడై ఉన్నాడు. భక్తుని మాటకు భగవంతుడు కట్టుబడి ఉంటాడు అన్నట్లున్నది అతని ప్రవర్తన.

ప్రహ్లాదుడు అలా అంతర్యామికి అంజలి ఘటిస్తూ నిలుచొని ఉన్నాడు.

అయితే ఈ స్తంభాన ఉన్నాడా? తన అరచేతితో ఆ స్తంభాన్ని ఒక చరుపు చరిచాడు హిరణ్యకశిపుడు. స్తంభం బ్రద్ధలయింది. నరసింహావతారం బహిర్గతమైంది. హిరణ్యకశిపుని కథ ఇక గతమైంది.

ఆ ఉగ్రనరసింహుడు హిరణ్యకశిపుని ఇక సంహరిస్తున్నాడు. అతడు పొందిన వరాలన్నీ అన్వయించేట్లుగా చేసి మరీ సంహరిస్తున్నాడు. అతడు మనిషి కాడు. అలా అని మృగమూకాదు. మనిషీ, మృగాల కలయికతో వచ్చిన అవతారం! అది రేయిగాదు, అది పగలుగాదు. అప్పుడు నడుస్తున్నది సంధ్యాసమయం! అది ఇంటగాదు, అలా అని బయటకాదు. రెంటికీ మధ్యనున్న గుమ్మమే రణస్థలం ! అది భూమికాదు. అది ఆకాశంకాదు. నరసింహుని తొడలపైన ఉంచబడిందతని శరీరం! అస్త్రాలుకావు, శస్త్రాలుకావు, అతడు చీల్చబడింది నరసింహుని గోళ్ళతో! ఇలా వరాలకు భంగం లేకుండానూ, సృష్టికి ఇబ్బంది తొలగిపోయేటట్లుగానూ హిరణ్యకశిపుని వధ ముగిసిపోయింది.

ప్రహ్లాదుడు వినమ్రుడై నమస్కరిస్తున్నాడు. దేవుని చేతిలో తండ్రికి ఉత్తమగతులు లభిస్తున్నాయని గ్రహించుకొంటున్నాడు.

దేవతలు, ఋషులు దిగివస్తున్నారు. దిగివస్తూనే పుష్పవృష్టిని కురిపిస్తున్నారు.



# గజేంద్రుని మొర

పాల సముద్రానికి దగ్గరగానున్న త్రికూటపర్వత ప్రాంతమది. ఆ ప్రాంతమంతా కూడా అందమైన ఆదవులతో శోభిల్లుతూ ఉంటుంది.

ఆ అడవిప్రాంతం ఏనుగులకు బాగా ప్రసిద్ధి. మందలు మందలుగా సాగిపోయే అక్కడి ఏనుగులకు సింహాలు కూడా భయపడుతుంటాయి. పెద్దపులులైతే పారిపోయి పొదరిళ్ళ వెనుక దాక్కుంటాయి. ఇక మిగిలిన జంతువుల సంగతి ప్రత్యేకంగా చెప్పవలసింది ఏముంటుంది?

ఒకరోజున పెద్ద ఏనుగులమంద ఒకటి సరస్సువైపుగా నడిచిపోతున్నది. ఉన్నట్టుండి గజరాజొకడు ఆ మందలోనుండి వేరుపడ్డాడు. అతని వెనుకగా అతని భార్యలయిన ఆడ ఏనుగులు అతణ్ణి అనుసరిస్తూ వచ్చాయి. క్రమంగా ఏనుగుమందది ఒకదారి అయింది. గజరాజూ, భార్యలది ఒకదారి అయింది. అదేమిటో గజరాజు పోయిందే పోకడగా పోతున్నాడు. తెలియని ఏ శక్తో అతణ్ణి లాక్కుపోతున్నదా అన్నట్లున్నది.

గజరాజు తన భార్యలతో కలసి పచ్చికబయళ్ళలో ప్రవేశించాడు. లేత పచ్చికను తొండంతో పెరికి భార్యల నోటికి అందించాడు. కొంచెం ముందుకు సాగాడు. మొక్కలూ, చెట్లూ అతనికి అందివచ్చాయి. పూలకొమ్మలను, చెట్లరెమ్మలను పుటుక్కున త్రుంచివేస్తున్నాడు. ఆ త్రుంచిన వాటిని వంతులువేసి భార్యలకు అందిస్తున్నాడు. నడక సాగుతోంది. ఆడ ఏనుగులు అలసినట్లుగా గమనించిన గజరాజు చేటలవంటి తన చెవులను విసనకర్రలుగా చేసి వాటికి విసురుతున్నాడు. అవి సేదతీరుతున్నాయి. అతడిలో ఉల్లాసం ఇంకా ఇంకా పెరుగుతున్నది. పెరిగిన ఉల్లాసంతో తన దంతాలను కలిపి ఆడ ఎనుగుల మెడలక్రింద గీరుతున్నాడు. తన తొండమెత్తి ఆడ ఏనుగుల శరీరాలపై అక్కడక్కడా రాస్తున్నాడు. ఆ చర్యలకు ఆడ ఏనుగులు పులకించిపోతున్నాయి. వాటి పులకింతలను చూచి గజరాజు మరింత ఉత్సాహపడుతున్నాడు.

ఇలా పులకిస్తూ, ఉత్సాహపడుతూ సరోవరం దగ్గరకు చేరుకొన్నారందరూ! వికసించిన పద్మాలతో స్వాగతం చెబుతోంది సరోవరం! రాజహంసల రావాలతో వీనులకు విందు చేస్తోంది.

అలలను పైకి లేపుతూ ఈవలకు చిమ్ముతున్న తుంపరలతో గజరాజు బృందానికి ఆహ్లాదం కలిగిస్తోంది. ఎంత హాయిగా ఉంది! ఒక ఉత్సవంలా ఉంది. ఈ సమయం ఆనందమయం! అనుకొంటూ గజరాజు బృందం ఒక్క ఉదుటున సరస్సులో దూకింది.

సరస్సులో దూకిన గజరాజు వీరవిహారం చేస్తున్నాడు. సరస్సునుండి నీటిని పీల్చి ఆకాశానికి ఎగజిమ్ముతున్నాడు. నీటితోబాటుగా చేపలవంటి జీవరాశులు కూడా పైకెగిరిపోతున్నాయి. ఆకాశంలో అల్లల్లాడుతున్నాయి.

గజరాజు ఉత్సాహాన్ని చూచి ఆడ ఏనుగులు సంబరపడ్డాయి. ఇంతవరకు గజరాజు మనను మురిపించాడు. ఇప్పుడిక గజరాజును మనం అలరిద్దాం అనుకొన్నాయి. అన్నీ కలసి తొండాలతో నీటిని పీల్చి, అన్నివైపుల నుండి గజరాజుపై చిమ్ముతున్నాయి. అలా అతణ్ణి స్నానాలు చేయిస్తున్నాయి. స్నానాలు చేస్తున్న గజరాజు కాటుక కొండలా మెరిసిపోతున్నాడు. వందలు, వేలుగా పద్మాలను పట్టుకొని వచ్చి గజరాజు ఒంటిని అలంకరిస్తున్నాయి. ఒంటినిండా పద్మాలతో గజరాజు వేయికనులతో విహరించే ఇంద్రుణ్ణి తలపిస్తున్నాడు. పద్మాల పరాగంతో గజరాజును పెద్ద యెత్తున ముంచేస్తున్నాయి. పరాగ శోభితుడైన గజరాజు బంగారు కొండను మరిపిస్తున్నాడు. తామర తూడులతో గజరాజు ఆదిశేషుణ్ణి మించి అగుపిస్తున్నాడు. లెక్కకు మిక్కిలిగా ముత్తెపు చిప్పలను తెచ్చి వాటితో అతనిని ముంచెత్తుతున్నాయి. ముత్తెపు చిప్పలతో మునుగుతున్న గజరాజు మెరుస్తున్న మేఘాన్ని గుర్తుకు తెస్తున్నాడు.

ఇలా ఇన్ని విధాలుగా భార్యలు అలరిస్తూ ఉండగా ఒక విధమైన తమకంతో మన్మథ సంబంధమయిన పారవశ్యంలో మత్తెక్కిపోతున్నాడు గజరాజు. ఎంత మధురం, ఈ జీవితం ఎంత మధురం! అయినవారి ఈ అనురాగం ఎంతెంత మధురం! ఇంతకంటే కావలసిన దేమున్నది! ఇంతకంటే కోరదగినది ఇంకేమున్నది? అని అనుకొంటూ, మత్తెక్కిన చూపులతో భార్యలవంక మరల మరల చూస్తున్నాడు గజరాజు, మరులగొన్నవాడై పరిసరాలనే మరచిపోయి.

ఇంతలో ఒకవైపునుండి భుగ భుగ ధ్వనులతో బుడగలు లేచాయి. అంతలో నీళ్ళు కళ్ళోలమై నలువైపులకూ కదలిపడుతున్నాయి. ఆ తాకిడికి గట్లు ఊగిపోతున్నాయి. గట్లపైనున్న

చెట్లు పెళ్ళగిల్లి పడిపోతున్నాయి. ఏమిటిదంతా అని గజరాజు బృందం ఈ లోక స్పృహలోనికి వచ్చి చూచేటప్పటికి భయంకరమైన మొసలొకటి గజరాజును పట్టనే పట్టింది.

ఆ పట్టునుండి తప్పించుకొని తొండంతో దానిమీద ఒక దెబ్బకొట్టాడు గజరాజు, ఆ దెబ్బను లక్ష్యపెట్టక మొసలి గజరాజు ముందు కాళ్ళను పట్టేసింది. పట్టుదలతో గజరాజు తన దంతాలను క్రిందికి దించి, రెట్టించిన ధైర్యంతో మొసలిని గుచ్చేసి విసిరేశాడు. ఆ దంతాల రాపిడికి తన తోలుచిప్పలను పోగొట్టుకొంది మొసలి.

వెనకడుగు వేసినట్లు వేసింది మొసలి గజరాజు తోకనుబట్టి చీల్చివేయసాగింది. చీరి చీరి బలంగా సరస్సులోనికీడ్చింది. దాని పట్టునుండి తప్పించుకొని గజరాజు దానిని తన తొండంతోపట్టి గట్టుపైకి ఈడ్చుకొచ్చాడు. దీనిని అవకాశంగా తీసికొని మొసలి గజరాజు తొండాన్ని చీల్చివేసింది. ఆ రక్తపు ధారలతో మడుగు నిండింది. గజరాజు ముందుకాళ్ళను నొక్కిపట్టి నీళ్ళలోనికి ఈడ్వసాగింది.

ఇలా మొసలి నీళ్ళలోనికి ఈడుస్తూ ఉంటే, గజరాజు గట్టుమీదకు లాగుతున్నాడు. ఎవరు బలవంతులు అన్నది తేలడంలేదు. ఎవరు గెలుస్తారు అన్నది అంతుపట్టడంలేదు. ఒకదాన్ని ఒకటి గీరుతున్నాయి. జారుతున్నాయి. పడుతున్నాయి, లేస్తున్నాయి, పెనవేసుకుపోతున్నాయి. త్రిప్పి త్రిప్పి కొడుతున్నాయి.

పాపం! ఆడ ఏనుగులు గట్టుపైనుండి బేలగా చూస్తున్నాయి. దిక్కుతోచక అలా బిక్కమొహాలు వేసికొని అలా నిలబడి ఉన్నాయి. గజరాజుకు సహకరించలేవు. అలా అని గజరాజును వదిలిపోలేవు.

వెళుతున్నకొద్దీ మొసలి బలం పెరుగుతోంది. గజరాజు బలం తరుగుతోంది. ఆ తేడా తెలిసిపోతుంది. ఎంతయినా మొసలిది స్థానబలం కదా నీళ్ళలో బ్రతికే మొసలికి అడవిలో తిరిగే ఏనుగు జవాబు చెప్పడం కష్టమవుతోంది.

ఎగిరెగిరి పడుతోంది మొసలి. గీరి గీరి గజరాజు రక్తాన్ని చెరువంతా చేస్తోంది. కాళ్ళుపట్టి నీళ్ళలోనికి లాగి వెన్నువెంట తోకతో చరుస్తోంది. ముక్కలు ముక్కలుగా చేస్తోంది. ఒక్కొక్కదెబ్బ కొడుతుంటే గజరాజు ఎముకలు ఫెళఫెళమని విరుగుతున్నాయి.

అయినా గజరాజు వెనుదీయడంలేదు. ఉండుండి ఎదురుదెబ్బ కొడుతూనే ఉన్నాడు. కొడుతున్న ప్రతిదెబ్బను తప్పించుకొంటోంది మొసలి. అలా కొట్టిన ప్రతిసారి గజరాజును వెల్లికిలా పడవేస్తుంది. గజరాజును గజగజ లాడించివేస్తుంది. ఇలా ఈ పోరు ఒక వేయేళ్ళు జరిగింది. మొసలి విజృంభిస్తునే ఉంది. గజరాజుకు మాత్రం ప్రాణం కడబడుతోంది. ఆ గజరాజు జవసత్వాలన్నీ నీళ్ళపాలై పోయినాయి. ఇక దీనితో వేగలేను. అన్న స్థితికి వచ్చేశాడు. ముందుకు సాగలేను అన్న స్థితికి వచ్చేశాడు. శరీరం శిథిలమవుతోంది. ప్రాణశక్తి హరించిపోయింది. మనస్సు వివశత్వాన్ని చెందుతోంది. అన్నివిధాలా వ్రాన్పడిపోతున్నాడతను.

అలాంటి దారుణమైన దీనస్థితిలో పూర్వ సంస్కారమేదో అతనిలో మెదిలింది. దివ్యబోధ ఏదో అతనికి అందింది. ఈ మొసలికి నేను చాలను అని తెలిసింది. దైవం ఒక్కడే తనను దరిచేర్చగలడని కూడ బోధపడింది. ఇక మనస్సు తన ప్రయత్నం మీదినుండి దేవుని వైపుకు మళ్ళింది. దైవాన్ని పొడగట్టించుకోవడానికి ప్రయత్నిస్తుంది.

ఉ. ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీనమై,
యెవ్వనియందుడిందుఁబర మేశ్వరుఁడెవ్వఁడుమూలకారణం,
బెవ్వఁడనాదిమధ్యలయుఁ డెవ్వఁడు సర్వము దాన యైనవాఁ,
డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్.

క. ఒకపరి జగముల వెలి నిడి
యొకపరి లోపలికిఁ గొనుచు నుభయముఁ గనుచున్
సకలార్థ సాక్షియగున
య్యకలంకుని నాత్మమయుని నర్థింతు మదిన్.

క. లోకంబులు లోకేశులు
లోకస్థులుఁ దెగినఁ దుదినలోకం బగుపెం
జీఁకటి కెవ్వఁడు వెలిఁగెడు
నేకాకృతితోడ నతని నే సేవింతున్.

కనబడుతున్న ఈ జగత్తంతా ఎవరినుండి వస్తున్నది? ఎవనియందు నిలబడుతున్నది? తిరిగి ఎవరియందు లీనమవుతున్నది? ఈ సృష్టికి మూలకారణమెవ్వడు? ఆది మధ్యాంతరహితుడైన వాడెవ్వడు? అలాంటి ప్రభువునకు ప్రణమిల్లుతున్నాను.

ఒకపరి లోకాలను వెలువరిస్తూ, ఒకపరి ఆ లోకాలను లోపలికి తీసికొంటూ, రెండూ తానే అయి రెండింటికీ సాక్షిగా ఉంటూ, అన్నింటికీ మూలమై వెలుగుతున్న అతనికి నమస్కరిస్తున్నాను.

లోకాలున్నాయి. లోక పాలకులున్నారు. లోకస్థులున్నారు. ఇలా భిన్న భిన్నంగా గోచరిస్తున్నారు. ఈ భిన్నత్వమనే పెనుచీకటికావల ఏకాకృతితో వెలుగుతున్న ఆ వెలుగుల మూర్తికి నమస్కరిస్తున్నాను.

అతడు నటన సూత్రధారి. ఈ నామరూపాలన్నీ అతని వివిధ భంగిమలే! అతడే ఇన్ని మూర్తులుగా గోచరిస్తూ జగన్నాటకాన్ని ఆడుతున్నాడు అతనిని కీర్తించడానికీ, అతనివర్తనాన్ని గ్రహించడానికీ ఎవరికి సాధ్యమవుతుంది? అలాంటి దేవదేవునికి నమస్కరిస్తున్నాను.

ముక్తసంగులైన మునులు, సర్వభూతరహితులైన ప్రేమ స్వరూపులూ, సాధువర్తనులూ వీరందరూ కూడా ఎవరి పాదాలను ఆశ్రయిస్తున్నారో, ఆ పాదాలే నాకు దిక్కని నేను నమ్ముకొంటున్నాను.

దైవాన్ని ఇలా పొడగట్టించుకొనే ప్రయత్నం గజేంద్రుని నుండి జరుగుతూ ఉండగా. మొసలి అతడిని మరింతగా వేధించసాగింది. ఆ వేధింపుకు అతడు కలత చెందినవాడై.

క. కలఁ డందరు దీనులయెడఁ
గలఁ డందరు పరమయోగి గణములపాలిన్
గలఁ డందు రన్నిదిశలను
కలఁడు కలం డనెడువాఁడు కలఁడో లేఁడో.

తప్పు, తప్పు ఇలా అనరాదు. కలలోనయినా ఇలా అనుకోకూడదు. ఎన్నిసార్లు ఎందరిని ఎన్ని విధాలుగా రక్షించలేదు అతడు. ప్రార్థించడం చేతకావాలేగాని, అతడు పలక్కపోవడం ఉంటుందా!

కలిమి లేములతో నిమిత్తం లేకుండా కలసివచ్చే వాడతను. ఆ మాత్రం నన్ను కనికరించడా! దుష్టులపాల పడుతున్నప్పుడల్లా శిష్టులను ఆదుకొనే వాడతను. ఆ మాత్రం నన్ను ఆదుకోడా! చూడగలిగిన కన్నుతో, తనను చూడగలిగిన వారందరినీ తానుగా చూచుకొనేవాడు. ఆ మాత్రం నన్ను చూచుకోడా? తనకోసం మొరలిడేవారి మొరను తానుగా వినివచ్చి, చేయూత నందించేవాడు ఈ నా మొర వినడా!

ఇన్ని రూపులు తన రూపయినవాడు, ఆది మధ్యాంతాలు లేనివాడు. ఆత్మబంధువు. ఆపద్బాంధవుడయినవాడు. ఈ నా స్థితిని వినడా, చూడడా, తలపడా, నా కొరకు వెంటనే తరలిరాడా! తప్పక వస్తాడు.

తండ్రీ! ఇంతవరకూ నేనుచేస్తూ వచ్చినదాన్ని నేను గమనించుకొన్నాను. నా ప్రయత్నాన్ని నా ప్రత్నంగా కొనసాగిస్తూ, నీ అనుగ్రహం కోసం వెంపరలాడుతున్నాను. అందువల్లనే నేమో బహుశా నా పిలుపు నిన్ను చేరలేకపోతుంది.

తెలిసికొన్నాను. నా ప్రయత్నమనేది వేరే లేదని, అదికూడ నీ అనుగ్రహంలో భాగమేననీ తెలుసుకొన్నాను. నీ అనుగ్రహాన్ని పట్టుకొని, కొంత నాదిగా, కొంత నీదిగా భ్రమపడుతున్నానని కూడ అర్థంచేసికొన్నాను. ఈ నా దృష్టిని సరిజేసికొంటున్నాను. తండ్రీ! నన్ను కరుణించు! మ

ప్రయత్నమనీ, దైవానుగ్రహమనీ ఇక రెండు లేవు. ఉన్నదీ, రెండుగా కనబడుతున్నదీ ఒక్కటే! అదే నీ అనుగ్రహం!

ఇక నా పరిస్థితిని గమనించు.

శా. లా వొక్కింతయు లేదు ధైర్యము విలోలం బయ్యెఁ బ్రాణంబులున్,
ఠావు ల్దప్పెను మూర్ఛ వచ్చెఁ దనువున్ డస్సెన్ శ్రమం బయ్యెడిన్,
నీవే తప్ప నితఃపరం బెఱుఁగ మన్నింపం దగుం దీనునిన్,
రావే యీశ్వర కావవే వరద సంరక్షింపు భద్రాత్మకా.

తండ్రీ నా పని అయిపోయింది. బలం ఏమాత్రం లేదిక. ధైర్యమూ అడుగంటిపోయింది. ప్రాణాలా పట్టుతప్పుతున్నాయి. మూర్ఛేమో ముంచుకు వస్తున్నది. శరీరం ఇలా అలసిపోయింది ఇక ఏమాత్రం శ్రమించే స్థితిలో లేదిది! నీవు తప్ప నాకు దిక్కెవరూ లేరు. రక్షించు! అభయమిచ్చి కాపాడు!

జీవుల మాటలన్నీ వినిపించుకొంటావటా నీవు. మా హృదయ ఘోషలన్నీ గమనించుకొంటావట! ఆర్తులను రక్షించడం కోసం ఇక్కడా, అక్కడా, అని లేకుండా ఎక్కడికైనా వచ్చేస్తావట! జీవులు 'కో' అని పిలిస్తే నీవు 'ఓ' అని పలుకుతావట. తండ్రీ, రావా, నన్ను చేరరావా! నన్నాదుకోవా! నన్ను నీ అక్కున జేర్చుకోవా!

హృదయపూర్వకమైన ఆ గజేంద్రుని ప్రార్థన అలవైకుంఠపురంలో, ఆ మూలనున్న ఆ సౌధగ్రంలో, ఆ లోపల ఏకాంతవాసంలో లక్ష్మీదేవితో క్రీడలలో తేలి ఆడుతున్న విష్ణుదేవుని చెవికి సోకింది అంతే! ఆ క్షణమే విష్ణుమూర్తి లేచాడు. ఆ ప్రార్థనను వింటూ అలా ముందుకు సాగడు. ఇటూ అటూ చూడటం లేదతను. ఎటూ, ఎవరికీ ఏమీ చెప్పడంలేదు.

మ. సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁడే,
పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం,
తరధమ్మిల్లముఁ జక్క నొత్తఁడు వివాదప్రోద్ధత శ్రీకుచో,
పరిచేలాంచల మైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై.

ప్రక్కనున్న లక్ష్మీదేవికి చెప్పలేదు. శంఖచక్రాలను చేపట్టలేదు. పరివారాన్ని పిలిపించలేదు. గరుత్మంతుడు వచ్చేవరకైనా ఆగలేదు. తలకట్టునైనా సరిజేసికోలేదు. ఆటలాడే వేళలో తన చేతిలోనికి వచ్చిన లక్ష్మీదేవి పైటను ఆమెకు వదిలివేయాలని కూడ అతనికి తోచలేదు.

అతడి దృష్టిలో గజేంద్రుడు మాత్రమే ఉన్నాడు. గజేంద్రుని మొర మాత్రమే అతనికిప్పుడు వినబడుతోంది. గజేంద్రుని వైపుగా వేగంగా సాగి వచ్చేస్తున్నాడతను.

లక్ష్మీదేవికి ఏమీ బోధపడలేదు. ఎక్కడో ఏదో జరిగి ఉంటుందని ఆమెకనిపించింది. భక్త రక్షణలో భర్తకున్న పూనికకు ఆమె ఆశ్చర్యపోతుంది. కొంగుతో పాటే ఆమెకూడ సాగి వచ్చేస్తుంది. ఇక ఆమెతో బాటుగా అందరూనూ!

మ. తనవెంట న్సిరి లచ్చివెంట నవరోధవ్రాతము న్దాని వె,
న్కను బక్షీంద్రుడు వానిపొంతను ధనుః కౌమోదకీశంఖ చ,
క్రనికాయంబును నారదుండు ధ్వజినీకాంతుండు రా వచ్చి రొ,
య్యనవైకుంఠపురంబునం గలుగువారాబాలగోపాలమున్.

లక్ష్మీదేవి అతనివెంట బయలుదేరింది. ఆమె వెంట అంతఃపుర పరివారమంతా బయలుదేరారు. వారి వెంట శంఖ, చక్ర, గదా, ఖడ్గాలు వస్తున్నాయి. ఆ వెంట విశ్వక్సేనుడు. ఆ వెంట నారదుడు. ఇక వీరూ, వారూ అనేముంది! వైకుంఠానికి చెందినవారంతా ఆబాల గోపాలమూ కూడ ఒక తీర్థయాత్రకు బయలుదేరి వస్తున్నట్లుగా వస్తున్నారు.

ఈ దృశ్యం దేనిని తెనియజెబుతోంది? ఆయన కదలాలేగాని, ఆయనతో అన్నీ కదలివస్తాయని! ఆయన కదలకుండా అవేవీ కదలిరావని! జీవులలో కొందరు ఈ తెలివి లేక, ఆయనను వదలి, ఆయన పరివారాన్ని రాబట్టుకోవాలని చూస్తారు. అప్పుడు వారు వాచ్చీరాక, ఉండీ లేకా సతమవుతూ ఉంటారు. వివేకవంతులయినవారు పరివారాన్ని వేరుగా కోరరు. ఆయననే తలుస్తారు. ఆయననే పిలుస్తారు. ఆర్తితో పిలిస్తేచాలు ఆయన వ్యక్తమవుతాడు. ఇక పరివారమంటారా ఆయనకు వదిగి ఉంటూ, ఎక్కడ ఎంతగా వర్తించాలో అంతగా వర్తిస్తూ, ఆయన కనుసన్నలలో మసలుకొంటారు.

ఇంతకూ గజేంద్రుడు పిలిచింది ఆ ఒక్కణ్ణి! ఆ ఒక్కడూ కదిలాడు. అంతే! ఇక అంతా కదిలారు. వైకుంఠమంతా కదలివస్తున్నదా అన్నట్లుగా ఉంది.

నారాయణుడు వెనుకా ముందూ చూడటంలేదు. గజేంద్రుడి వైపుగా వచ్చేస్తున్నాడంతే! మధ్యలో దేవతలు ఆయనకు నమస్కరించారు. సంతోషంతో గజేంద్రుని గూర్చి కీర్తించారు. గజేంద్రుడు ఎంత అదృష్టవంతుడోకదా అంటున్నారు. దేవ దేవుడికి ఇవేవీ వినబడటంలేదు. అతని దృష్టంతా గజేంద్రుని పైననే ఉన్నది.

క్షణాలలో సరస్సును సమీపించాడు నారాయణుడు. సమీపించడమే తడవుగా చక్రాయుధాన్ని మకరంపై ప్రయోగించాడు. ఆ మొసలికి తల తెగి పడింది. తలా, మొండెం వేరై, నీటిపైన తేలుతున్నాయి.

అందివచ్చిన ఆ అనుగ్రహానికి అమితంగా ఆనందిస్తున్నాడు గజేంద్రుడు. ఆ ఆనందంలో నుండే తన కాళ్ళను కదిపి చూసుకొంటున్నాడు. తనలో తాను కూడదీసికొంటున్నాడు.

ఈ శుభ సమయంకోసం ఎదురుచూస్తున్న ఆడ ఏనుగులు సరస్సులోనికి దిగాయి. గజేంద్రునికి మళ్ళీ స్నానాలు చేయించాయి. గజేంద్రుడు తేరుకొంటున్నాడు. విష్ణుస్మరణలో ఓలలాడుతున్నాడు.

విజయసూచకంగా విష్ణునాదం శంఖనాదం చేశాడు. దేవదుందుభులు తెరిపిలేకుండా మ్రోగాయి. పూలవానలు సందులేకుండా కురుస్తున్నాయి. అప్సరసలు అలు పెరగకండా నాట్యమాడుతున్నారు. జయ జయ ధ్వానాలు భూమ్యాకాశాల నడుమ నిండిపోతున్నాయి. ఆ జయ జయ ధ్వానాల నడుమ విష్ణుదేవుడు సరస్సులో ఉన్న గజేంద్రుని తన దక్షిణ హస్తంతో స్పృశించాడు. చేయూత నిచ్చి ఒడ్డుకు తీసికొని వచ్చాడు.

గజరాజు భార్యలతో కలసి ఆనందంతో ఘీంకారం చేశాడు. ఆనందాన్ని అలా ప్రకటిస్తూ, విష్ణుదేవుని పాదాలకు భార్యలతో కలసి ప్రణమిల్లాడు.

విష్ణుదేవుడిలా అన్నాడు: "గజేంద్రా! నీ పూర్వజన్మ గుర్తుకు వచ్చిందికదా!" అని. గజేంద్రుడు వెంటనే ఆ స్మృహలోనికి వెళ్ళాడు. పూర్వజన్మలో అతను ఇంద్రద్యుమ్నుడనే రాజు. ఒక కొండమీద కూర్చొని మౌనవ్రతంలో ఉండి విష్ణుదేవుని గూర్చి తపస్సు చేయసాగాడు. అతడు తపస్సులో ఉండగా అక్కడికి అగస్త్యముని వచ్చాడు. అతిధిగా వచ్చిన అగస్త్యుడికి ఆతిధ్యమివ్వడంలో ఇంద్రద్యుమ్నుడు శ్రద్ధ పెట్టలేకపోయాడు. వచ్చిన అతిధిని దేవునిగా చూడలేకపోయాడు. దేవుడంటే ఇంకెక్కడో ఉంటాడు అనుకొంటున్నాడు. అప్పుడు అగస్త్యుడన్నాడు: విష్ణువు విశ్వమంతటా ఉన్నాడని గ్రహించలేకపోయావు. ఈసారి గజరాజువై పుడతావు. గజంగా ఉంటూ జగంగా ఉన్నది విష్ణువే అని గ్రహించేవరకూ ఈ నీ కథ సాగుతుంది! అన్నాడు.

గజేంద్రుని కన్నులు చెమ్మగిల్లుతున్నాయి. ఆ గాథంతా గుర్తుకు వచ్చేటప్పటికి!

అలాగే ఈ మొసలికూడ మామూలు మొసలి కాదని అతడు తెలుసుకొన్నాడు. ఇతడు 'హూహూ' అనే గంధర్వుడు. దేవలుడు అనే ముని శాపంవల్ల మొసలిగా ఈ సరస్సులో పడి ఉన్నాడు. విష్ణుమూర్తి చక్రాయుధం వల్లగాని ఇతని తల తెగదు. అలా తెగితేగాని ఇతడికి మోక్షంరాదు.

ఈ విధంగా గజ, మకరాలకు విష్ణుదేవునితో పనిపడింది. మకరం గజేంద్రుని పట్టింది. గజేంద్రుడు పట్టుసడలి ఆక్రోశించాడు. "పాహి పాహి" అంటూ విష్ణుదేవుని వేడుకొన్నాడు.

విష్ణుదేవుడు దిగివచ్చాడు. చక్రాయుధాన్ని ప్రయోగించాడు. దానితో శాపాలు తొలిగాయి. పాపలు పోయాయి. లోపాలు సర్దుకొన్నాయి. పరిపూర్ణత లభించింది. ఇద్దరూ మోక్షస్థితిని అందుకొన్నారు. ఈ కథను విన్నవారికి కూడా ఇంతమంచీ జరుగుతుంది. శాపాలు తొలుగుతాయి. పాపాలు పోతాయి. లోపాలు సర్దుకొంటాయి. పరిపూర్ణత లభిస్తుంది. మోక్షస్థితి నిలబడుతుంది.





# బలిదానం-వామనవిలాసం

బలిచక్రవర్తి ప్రహ్లాదుని మనుమడు. భాగవత మార్గంలో ప్రహ్లాదుని తరువాత మళ్ళీ అంతటివాడు. రాక్షసత్వానికి బదులు చెప్పగలిగిన దైవత్వం ప్రహ్లాదునిది. రాక్షసత్వంతో ప్రారంభించి, దైవత్వంలోనికి అడుగిడి ఆ దైవత్వంలో స్థిరపడిన ఘనత బలిచక్రవర్తిది. ఇప్పుడిక మనం బలిచక్రవర్తి గాథలోనికి ప్రవేశిద్దాం.

అమృత మథనకార్యం ఎట్టకేలకు పూర్తయింది. విష్ణుదేవుని పుణ్యమా అని ఆ అమృతం దేవతలకు దక్కింది. దానితో దేవతలకు బలమూ, ధైర్యమూ కూడ పెరిగాయి. ఇంద్రాదులిక రాక్షసులపైన విజృంభించసాగారు. ఆ విజృంభణలో ఇంద్రుని చేతిలో బలిచక్రవర్తి దెబ్బతిన్నాడు. ఆ దెబ్బ అతడు ఊహించనిది. దానితో అతనికి పట్టుదల పెరిగింది.

ఎలాగైనాసరే ఇంద్రుణ్ణి దెబ్బకు దెబ్బా తీయాలి అని గట్టిగా నిర్ణయించుకొని తన రాజ్యానికి చేరుకొన్నాడు. శుక్రాచార్యునికి చేరువయి, అతనికి శిష్యుడయి అతన్ని అన్నివిధాలా మెప్పించాడు. బలిచక్రవర్తిని చూచి శుక్రాచార్యుడు ముచ్చట పడ్డాడు. ఇతని ద్వారా సాధించగలిగింది చాలా ఉన్నది అనిపించిందతనికి. బలిచక్రవర్తిచేత విశ్వజిద్యాగం చేయించాడు. యాగం దివ్యంగా సాగింది. యజ్ఞగుండం నుండి అగ్నిదేవుడు రూపుధరించి వచ్చాడు. దివ్యమైన రథాన్ని, గుఱ్ఱాలను, ధనస్సును, అమ్ముల పొదలను, ఒక మంచి కవచాన్నీ బలికి అందించాడు. ప్రహ్లాదుడు వ్యక్తమయ్యాడు. ఎన్నడూ వాడని పద్మమాలనొకదానిని కానుకగా ఇచ్చాడు. శుక్రాచార్యుడు దగ్గరగా వచ్చాడు. చంద్రునిలా తెల్లగా మెరుస్తున్న శంఖాన్ని ఒకదానిని ఇచ్చాడు. వారి ఆశిస్సులకూ, అనుగ్రహానికి బలిచక్రవర్తి ఎంతో సంతోషించాడు. వారి యెడల విధేయుడై మరల మరల వారికి నమస్కరించాడు. ఈ సాధన సంపత్తితో బలి మహా బలవంతుడయ్యాడు, పెద్దలను గౌరవించాడు. బ్రాహ్మణులను దానాలతో తృప్తి పరిచాడు. అందరినుండీ ఆశీస్సులందుకొన్నాడు. ఇక జైత్రయాత్రకు బయలుదేరాడు.

మొదటగా అతని దృష్టి స్వర్గంపైన పడింది. సమర్థులైన సేనాధిపతులతో స్వర్గం వైపుకు కదిలాడు. అతడి ఉత్సాహాన్ని చూస్తుంటే స్వర్గాన్ని తెచ్చి భూమి ఉన్న చోటునపెట్టి. భూమిని తీసుకువెళ్ళి స్వర్గమున్న చోటులో పెట్టగలను అన్నట్లున్నాడు.

స్వర్గాన్ని సమీపించాడు. శంఖానాదం చేశాడు. స్వర్గం గడగడ వణికింది. ఇంద్రుడు బృహస్పతిని పిలిచి కోర్చీపెట్టుకున్నాడు. గురువర్యా! బలిని చూస్తూ ఉంటే భయం వేస్తోంది. ప్రస్తుతం ఇతణ్ణి ఏమీ చేయలేనని నా మనస్సుకు అనిపిస్తూ ఉంది. ఇతనికి తోడుగా ఏదో శక్తి ఉంది. ఇతనిప్పుడు సామాన్యుడుకాడు. మరి నన్నిప్పుడే చేయమంటారు?

క్షణంపాటు ఆలోచించి బృహస్పతి ఇలా అన్నాడు: దేవేంద్రా! నీవు చెప్పింది నిజమే! బలిచక్రవర్తికి శుక్రాచార్యుని అండ ఉంది. వేదవిదుల ఆశీస్సులున్నాయి. ప్రస్తుతం అతను పుణ్యాత్ముడు. ఆ పుణ్యానికి జవాబు చెప్పగలిగిన సత్తా నీ దగ్గరలేదు. సమయం వచ్చేవరకూ వేచి ఉండటం మంచిది.

ప్రస్తుతానికి ఒక పనిచేయి. దేవతలందరినీ తీసుకొని ఎక్కడికైనా పారిపో! ఇప్పటికి ఇదే ఉపాయం! బృహస్పతి వాక్యాన్ని వెంటనే అమలుపరిచాడు ఇంద్రుడు. క్షణాలలో స్వర్గం ఖాళీ అయింది. ఇంద్రుడూ, దేవతలూ, స్వర్గలోక పరివారమూ కామరూపాలతో అక్కడినుండి తప్పుకొన్నారు.

బలిచక్రవర్తి శంఖనాదానికి ఇదీ వచ్చిన జవాబు: బలి ఇక నిరాటంకంగా స్వర్గంలో అడుగుపెట్టాడు. స్వర్గ రాజ్యాన్ని వశపరచుకొన్నాడు. మూడు లోకాలనూ తన వశంలోనికి తెచ్చుకొన్నాడు. శుక్రాచార్యుడు సంతోషంతో బలిచక్రవర్తిచేత నూరు అశ్వమేధాలు చేయించాడు.

బలిచక్రవర్తి రాజ్యపాలన అద్భుతంగా ఉంది. సకలలోకవాసులూ సిరిసంపదలతో తులతూగుతున్నారు. దానమడిగేవారులేరు. అడిగితే ఇవ్వనివారూ లేరు. విరోధాలు లేవు. అందరూ అందరికీ మిత్రులే! దేవాలయాలు నిత్యపూజలతో కళకళలాడుతున్నాయి. వర్షాలు సకాలంలో పడుతున్నాయి. భూమిపైన పాడిపంటలకు కొదువలేదు. బలిచక్రవర్తి చిత్రమైనవాడు. ప్రభువులను వెళ్ళగొట్టాడు. ప్రజలను సుఖపెట్టాడు. అతడికి అధికారం నిలబడటానికి లోకవాసుల

అభిమానం కావాలి. దానినీ మెండుగా సంపాదించాడు. "అసలు ఇలా పాలించిన రాజెవడండీ, ఇంతవరకూ ఇతడుగాక మరొకడున్నాడా?" అని అనిపించుకొన్నాడు.

దేవతలకు తల్లి అదితి. బిడ్డలపాట్లు ఆమెకు తెలిశాయి. దానితో ఆమె క్షోభపడింది. బెంగ పెట్టుకొంది. దిక్కులేనిదానిలా కూర్చొంది. కొన్నాళ్ళకు భర్త అయిన కశ్యప ప్రజాపతి ఆమె దగ్గరకు వచ్చాడు. ఆమె సరిగా లేదని గమనించుకొన్నాడు. ఏమిటలా బాధపడుతున్నావు అని అనునయించి అడిగాడు.

భర్త అనునయిస్తున్న కొద్దీ అమెకు దుఃఖం వస్తున్నది. ఆ దుఃఖంలో నుండి ఆమె ఇలా అన్నది: మహాత్మా! దేవతలూ దానవులు కూడ మీ సంతానమే! వాళ్ళూ, వీళ్ళూ కూడ క్షేమంగా ఉండాలి. అలా కాకుండా ఒకళ్ళ నొకళ్ళు పీడిస్తుంటే ఏం బాగుంటుంది ? దేవతలిప్పుడు దిక్కులేనివాళ్ళు అయిపోయారు. చెట్టుకొక పిట్టలా చెదరిపోయారు. నీవు కనికరించాలి. దానవులను దారిలో పెట్టాలి. దేవతలకు వాళ్ళ రాజ్యం వాళ్ళకు వచ్చేట్లు చేయాలి, అంటూ ఆమె వలవలా ఏడ్చింది.

అంతా విని కశ్యప ప్రజాపతి ఇలా అన్నాడు: అదితీ! అర్థమైంది. అందరినీ నిలబెట్టవలసినవాడు విష్ణుదేవుడు అసలు సృష్టి ఇలా నిలబడటానికి కారణం అతడు. అతడిని ప్రార్థించు! ఈ పరిస్థితులలో నీవు చేయవలసింది ఇదే!

"ఎలా ప్రార్థించమంటారు? ఆ విదివిధానమేమిటి?" అడిగింది అదితి. 'ఇదిగో ఇలా చేయి!' అంటూ వివరించి చెప్పాడు కశ్యప ప్రజాపతి. అదితి ప్రార్థన ప్రారంభమైంది. దేవతలకు మంచిరోజులు వస్తున్న సూచనలు కనిపించసాగాయి.

అదితి పట్టిన దీక్ష అలా పూర్తి అవుతూ ఉండగానే ఇలా ప్రత్యక్షమయ్యాడు విష్ణుదేవుడు. ఆ సాక్షాత్కారానికి పులకించింది అదితి. ఆమె కన్నులు చెమ్మగిల్లాయి. చూపులతోనే స్వామిని త్రాగేస్తోందా అన్నట్లు ఉన్నదామె. 'తండ్రీ! నన్ను కరుణించు!' అని వేడుకొన్నదామె! దేవదేవుడు ఆమె కన్నీటిని తుడుస్తూ ఇలా అన్నాడు: నీవప్పగించిన పనిని చేయడం కోసం నీ కడుపుననే

పుట్టబోతున్నానమ్మా నేను. నీకు బిడ్డను కాబోతున్నాను! మరి, నన్ను చాలా గారాబంగా పెంచాలి మరి!

ఆ అనుగ్రహానికి అదితి ఆశ్చర్యపోయింది. ఆమె ఆనందానికి ఇక అవధులు లేవు. దేవతల కార్యాన్ని సాధించి పెట్టడంకోసం దేవదేవుడు తనకు బిడ్డ కాబోతున్నాడు.

ఆ కబురు ఆమె కశ్యప ప్రజాపతికి వినిపించింది. కశ్యపుడు ఉప్పొంగిపోయాడు ఆమెను దగ్గరగా తీసుకొని అభినందించాడు. అదితి కడుపు పండింది. దేవదేవుడు వామనుడై దిగివచ్చాడు. చిన్న ఆకారం చిత్రంగానూ, ముచ్చటగానూ ఉన్నాడు. అందులోనూ మళ్ళీ నాలుగు చేతులు! ఈ దివ్యమూర్తి ఇంతకాలం నా గర్భాన ఉన్నాడుకదా! అనుకొంటూ పరవశించిపోయింది అదితి. సకల లోకాలూ సంబరపడ్డాయి.

కాసేపటిలో ఆమెకు మాయ కమ్మినట్లయింది. దేవదేవుడు ఇక ఆమెకు మాములు బిడ్డగానే గోచరించసాగాడు. ఆమె అతడిని గారాబం చేస్తోంది. అతడు ఆమెచేత ఇంకా ఇంకా గారాబం చేయించుకొంటున్నాడు. గారాబం అలా వేయింతలుగా సాగుతూ ఉండగా ఇంతింతై పెరుగుతూ వస్తున్నాడు వామనుడు.

కశ్యప ప్రజాపతి వామనుడికి ఉపనయనం జరిపించాడు. బ్రహ్మాదులందరూ ఉపనయనానికి తరలి వచ్చారు. దానితో అడుగులు వేస్తుంటే సృష్టి సమస్తం స్పందించింది!

ఇప్పుడతనికి వడుగయింది కదా! ఇక అతడు భిక్షను స్వీకరించవచ్చు. తాను స్వీకరించబోయే భిక్ష సర్వులకూ ఒక రక్ష కావాలని సంకల్పించాడు వామనుడు. అంతే! ఇక కదిలాడు.

కొందరు బ్రాహ్మణులు అలా వీదివెంట వెళుతున్నారు. అందులో అనేక దేశాల వాళ్ళున్నారు. "పెద్దలారా! యాచకుల కోరికలు తీర్చే దాతలెవరైనా ఉన్నారా? మీకు తెలిసే ఉంటుంది చెప్పరూ!" అని అదిగాడు వామనుడు. ఈ చిన్ని వటువును చూచి సంబరపడిపోయారు బ్రాహ్మణులు. చిరునవ్వుతో ఇలా అన్నారు: లేకేం నాయన! ఉన్నారు.

అందరిలోకీ మొనగాడైన దాత మన బలిచక్రవర్తి! అలాంటి దాత ఇంతకుముందు పుట్టలేదు. ఇకముందు పుట్టడు!

అయితే ఉండండి, నేనూ వస్తున్నాను! అన్నాడు వామనుడు. తల్లిదండ్రుల దగ్గర శెలవు తీసికొని, బలిని యాచించడానికని వారితో బయలుదేరాడు.

లక్ష్మీదేవి అతణ్ణి కోరి వరించింది. బలిచక్రవర్తిని అతడిప్పుడు కావాలని యాచించబోతున్నాడు. లోకహితార్థమై యాచించబోతున్నాడు. ఇలాంటి వేళలో యాచన కూడ నాకొక అలంకారమే! అన్నట్లుగా సాగిపోతున్నాడతను.

చిన్ని చిన్ని అడుగులు. చప్పు చప్పున వేస్తున్నాడు. మధ్యలో వర్మద అనే నదిని దాటాడు. బలిచక్రవర్తి యజ్ఞశాలను సమీపిస్తున్నాడు. ఆ యజ్ఞశాలనుండి హోమధూమాలు లేస్తున్నాయి. ఎంతగా లేస్తున్నాయీ అంటే ఆకాసాన సూర్యుణ్ణే అవి కప్పేస్తున్నాయి. గగనాన సూర్యుడికి కనిపించడమే ఇక గగనమైపోతోంది. బలి ఏంచేసినా ఇలాగే ఉంటుందన్నమాట! అనుకొంటూ లోనికి ప్రవేశించాడు వామనుడు.

ప్రవేశిస్తున్న వామనుణ్ణి సధాసదులందరూ చూస్తున్నారు. ఒకరికొకరు చూపుతున్నారు. "ఏమా బ్రహ్మవర్చస్సు! పన్నెండుమంది సూర్యులూ ఒక్కసారిగా ఉదయించినట్లుంది! ఎవరో ఈ బ్రహ్మచారి? త్రిమూర్తులలోని వాడేమో! ఇలా, ఈ వేషంలో వచ్చాడేమో! మానవుడు మాత్రం కాదు" సభాసభులు గుసగుసలాడుతున్నారు.

విశాలమైన ఆ మంటపంలో వామనుడు ముద్దు ముద్దుగా అడుగులు వేస్తున్నాడు. ఒకప్రక్క సామగానం సాగుతోంది. మరొక ప్రక్క యజ్ఞయాగాదుల విధి విధానాలను గూర్చి అర్థవంతమైన చర్చలు! వామనుడు వాటినన్నింటినీ ఆకళించుకొంటూ సాగుతున్నాడు. వాలుతూ, వంగుతూ, హరిస్మరణ చేస్తూ ఎన్నెన్ని భంగిమలో పోతున్నాడు. నటన సూత్రదారికదా, నటనకు కొదవేముంది!

ఇలా సభంతా కలియ దిరిగాడు కాసేపు. అందరినీ పరిచయం చేసికొన్నాడు. ఇక మెల్లిగా చొరవ తీసికొంటున్నాడు. కొందరితో మంత్రార్థాలను చర్చిస్తున్నాడు. కొందరితో వాదిస్తున్నాడు. కొందరితో నవ్వులాడుతున్నాడు. కొందరితో ముచ్చటలాడుతున్నాడు. ఇలా ఎవరేమి చేస్తుంటే తానూ అది చేస్తూ అందరికీ అన్నివిధాలా కనిపిస్తూ అందరిలోనివాడై వర్తిస్తున్నాడు.

రాక్షసరాజు ఈ దృశ్యాలన్నింటినీ అసక్తిగా గమనిస్తున్నాడు. ఆ చిన్ని వటువును చూచి మురిసిపోతున్నాడు. అతడి లీలలను చూస్తూ తన్మయుడవుతున్నాడు. తనచెంతకు కూడా అతనొస్తే బాగుండును అనుకొంటున్నాడు.

బలిచక్రవర్తి అలా అనుకొంటూ ఉండగానే వామనుడు ఎదురుగా వచ్చి అతడిని దీవించాడు. ఆ దీవించిన విధానానికి బలి ముచ్చటపడ్డాడు. శుక్రాచార్యుడు మాత్రం గతుక్కుమన్నాడు. వామనుడి కాళ్ళు కడిగి, ఆ నీళ్ళను తన తలపైన జల్లుకొన్నాడు బలి. భళీ! ఎంతటి అదృష్టమిది! అనుకొన్నారంతా!

వడుగా! ఎవ్వరివాడవు? ఎవడవు? అని కుశల ప్రశ్నలు వేశాడు బలి. వరచేరంబులో, మాడలో, ఫలములో ఇలాంటివేవో ఒకటి నానుండి నిండుగా స్వీకరించు నాయనా! అని కోరుకున్నాడు.

ఆ కుశల ప్రశ్నలకు ఇలా అన్నాడు వామనుడు: రాజా! ఒకచోటని ఏమి చెప్పేది? అన్నిచోట్లూ నావే! ఒకరి వాడనని ఎలా చెప్పేది? అందరూ నావారే! ఏమి నేర్పావంటే ఏమి చెప్పేది? అవసరమైనదల్లా నేర్పుగా వ్యక్తం చేస్తూనే ఉన్నాను. నడవడి ఏమంటే ఏం చెప్పేది? పరిస్థితి బట్టి పోతుంటాను. నేనెవరివాడనూ కాను. అందరూ నావారు! ఏకాకిని. చుట్టాలుకూడ ఎవరూ లేరు. లక్ష్మి ఉండేది పూర్వం. సజ్జనులయందు మాత్రం నేనుంటాను.

ఇక, నీవు నన్ను కోరమన్న విధానం నీస్థాయికి తగినట్లుగా ఉంది. అయినా, మీ వంశంలో తక్కువతిన్న వారెవరు? యుద్ధానికీ, త్యాగానికీ వెనుదీసిన వారెవరు? మీ తాత ప్రహ్లాదుడు ఎంతటి భాగవతమూర్తి! ఒక్కమాట చెప్పనా, చూడవలసిన విధంగా చూస్తే, మీ వారి కథలన్నీ విష్ణువుచుట్టూ తిరిగినవే! నయానో, భయానో అందరూ ఆ విష్ణువును స్మరించినవారే! ఏమంటావు.

మూడు లోకాలకు ప్రభువువు నీవు మూడడుగులు నాకివ్వు. చాలు నాకు. మూడడుగులు నాకిస్తే బ్రహ్మాండమే ఇచ్చినంతగా ఆనందిస్తాను.

ఇంత చిన్న కోరికా అన్నాడు బలి. నీ కోరిక నాకు తగినట్లు లేదు! అన్నాడు.

రాజా! నీకు తగినట్లు నీవాలోచిస్తున్నావు. నా అవసరాన్ని నేను గమనిస్తున్నాను. మహాదాతవు కదా అని ఏమేమో అడిగితే ఎలా? అవసరమైనదేదో అది మాత్రమే అడుగుతున్నాను.

ఆశాపాశమన్నది ఉన్నదే అది ఎంత పొడవైనదో! దాని అంతును చూచిన వారు లేరు. ఉన్నంతలో తృప్తిపడినవాడు అదృష్టవంతుడు. కావలసినదానిని మాత్రమేకోరి స్వీకరించగలవాడు వివేకవంతుడు.

చక్రవర్తుల్లాంటివాళ్ళు తృప్తిలేక, తృప్తిపడక ఎంతమంది ఎన్ని విధాలుగా కొట్టుకొని చచ్చిపోయారు! రాజా! చరిత్ర నొకసారి గమనించు! అంతా తెలిసికూడా ఇలా అంటావేమిటి? నేనడిగిన మూడడుగులు నాకివ్వు చాలు. నా పాలిట అదే బ్రహ్మాండమవుతుంది.

గొడుగో. జన్నిదమో, కమండలువో. నాకున్ ముంజియో, దండమో,
వడుఁ గే నెక్కడ" భూము లెక్కడ? కరుల్, వామాక్షు, లశ్వంబు లె
క్కడ? నిత్యోచిత కర్మ మెక్కడ? మదాకాంక్షామితంబైన మూఁ
డడుగుల్ మేరయు త్రోవ కిచ్చుటది బ్రహ్మాండంబు నా పాలికిన్.

ఒక్కమాట చెబుతాను విను. ఎవడు సంతోషపడగలడో వాడు సుఖపడగలడు. ఎవడు తృప్తిపడగలడో వాడు సంతోషపడగలడు. తృప్తికంటే ముక్తి ఇంకేముంది రాజా! సంతోషంగా ఉండగలగడం కంటే జీవితానికి కావలసింది ఏముంది! నాకిది తృప్తి నాకిది సంతోషం. నేనడిగిన మూడడుగులు నాకివ్వు చాలు అవే నాపాలిట మూడు లోకాలవుతాయి!

బలి సంతోషంతో ఉప్పొంగిపోతున్నాడు. దానం చేయడానికి సంబరపడుతున్నాడు. శుక్రాచార్యుడతన్ని పక్కకు పిలిచాడు. ఏమిటా ఉవ్విళ్ళూరడం? రాజా! మరీ

చిన్నపిల్లవాడివయిపోతున్నావేమిటి? ఆ వచ్చినదెవరనుకున్నావు? ఆ వామనుడు వటువు కాడు విష్ణువు! అతడు కోరుతున్నది మూడడుగులుకాదు. మూడు లోకాలు! ఈ మూడడుగులే నాకు మూడు లోకాలవుతాయి అని అతడు చెబుతూనే ఉన్నాడు. మనకు కాస్త బుర్ర పనిచేయాలి.

ఒకపాదం భూమికి సరిపోతుంది. ఒకపాదం ఆకాశానికి సరిపోతుంది. మూడవపాదం ఎక్కడ పెట్టను? అంటాడు ఏం చెబుతావు! ఏమైపోదామనుకుంటున్నావు?

నామాట విను. నీసంగతి నాకుతెలుసు. మాటిచ్చాను, మాటిచ్చాను అంటావు. ఏమ్మాటది? అంతా పోతున్నప్పుడు అబద్ధమాడితేనేం? తన్నుమాలిన ధర్మం మంచిదికాదు. ముందు నువ్వు నిలబడు. ఈ రాజ్యాన్నిలా ఉండనీ! అడిగింది ఇచ్చామనుకో! ఆతడిక ఆక్రమించడం మొదలుపెడతాడు. అప్పుడిక ఆ దృశ్యం ఎలా ఉంటుందో నీవు ఊహించలేవు. దానంలేదు, గీనంలేదు. ఆ వామనుణ్ణి వెళ్ళిరమ్మని చెప్పు. నువ్వు చెప్పలేకపోతే నీ తరుపున నేను చెబుతాను. ఏం, ఏమంటావు?

అంతావిని బలి ఇలా అన్నాడు: ఆచార్యా! మామూలుగా చూస్తే నీవు చెప్పింది నిజమే! కాని నాకలా చేయాలని అనిపించడంలేదు. ఒకటి నేను మాట తప్పలేను. రెండు నేను విష్ణువును వదులుకోలేను. ఇస్తానన్నదానాన్ని ఇవ్వకుండా ఉండలేని నేను, విష్ణువే వచ్చి దానమడిగితే ఇంక కాదని అనగలనా, లేదని అనగలనా?

కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే
వారేరీ సిరి మూటగట్టుకొని పోవంజాలిరే భూమిపైఁ
బేరైనం గలదే శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కెలు వారలన్ మఱచిరే యిక్కాలమున్ భార్గవా!

గురువర్యా! గడచిన చరిత్రలో ఎందరు రాజులు కాలేదు, రాజ్యాలు ఏల లేదు. తమంతవారు లేరని తొమ్ము విరుచుకొని తిరగలేదా? వారేరీ! ఎక్కడున్నారు! సిరినేమైనా మూటగట్టుకొని పోగలిగారా? కనీసం ఈ భూమిపైన వారి పేరయినా మిగిలిందా? అదేమరి!

శిభివంటి త్యాగమూర్తులున్నారు. వారు పోయి ఎంతకాలమైంది మరి వారిని మరచిపోగలుగుతున్నామా?

ఆచార్యా! ఎన్ని యజ్ఞాలు చేస్తే విష్ణువు ప్రత్యక్షమవుతాడు? ఎంత తపస్సు చేస్తే విష్ణువు గోచరిస్తాడు. అలాంటిది విష్ణువు నా కొరకని ప్రత్యేకంగా వామనుడై వటువు రూపంలో వచ్చాడు. ఎల్లప్పుడూ లక్ష్మీదేవిని అలరించే తన చేతిని చాచి నన్ను దాన మడుగుతున్నాడు.

ఆదిన్ శ్రీసతి కొప్పుపై తనువు పై నంసోత్తరీయంబుపైఁ
బాదాబ్జంబులపై కపోల తటిపైఁబాలిండ్లపై నూత్న మ
ర్యాదం జెందు కరంబు గ్రిందగుట మీద్రై నా కరంబుంట మే
ల్గాదే ? రాజ్యము గీజ్యమున్ సతతమే కాయంబు నాపాయమే !

గురువర్యా అలాంటి ఆచేయి క్రిందవున్నది. నా చేయి మీదవుతున్నది. ఈ అదృష్టమెంతటిది? ఈ అవకాశమెంతటిది!

ఏదో ప్రమాదం ముంచుకు వస్తుందని నేను వెనుకాడలేను. అడిగినది ఇస్తే అతడు మటుకు ఏం చేస్తాడు? బంధిస్తాడంటావా? తానే విడిచిపెడతాడు. విడిచిపెట్టడంటావా? పోనీ. ఏలా జరుగవలసిఉంటే అలా జరుగుతుంది. అంతేగాని బొంకుతామా? అది భావ్యమా? ఆచార్యా! ఆలోచించు!

సముద్రాలింకిపోయినా, భూమి పొడి పొడిగా అయిపోయినా, అంతా అణిగిపోయినా నేను మాత్రం మాట తప్పలేను. నేనతనికి దానమివ్వకుండా ఉండలేను.

శుక్రాచార్యుడు ఉగ్రుడయ్యాడు. "రాజా! మేలుకోరి చెబితే వినిపించుకోకుండా పోతున్నావు. కొద్దికాలంలోనే నీవు పదభ్రష్టుడవైపోతావు". అని శపించాడు. శుక్రాచార్యుడు శపించినా బలి చలించలేదు.

భార్యవైపు చూచాడు బలి. ఆమె బంగారు బిందితో నీళ్ళు తెచ్చింది. నీళ్ళతో వామనుడి చిట్టిపాదాలను కడుగుతున్నాడు బలి, కడుగుతూ ఆ అదృష్టానికి సంబరపడుతున్నాడు.

ఇక మూడడుగులను ధారపోస్తున్నాడు. కాని ఎంతపోసినా ధారపడటం లేదు. ధార పడకుండా శుక్రాచార్యుడు అడ్డుపడుతున్నాడని వామనుడు గ్రహించాడు. తన చేతి దర్భతో ఆ కలశ రంధ్రంలోనికి పొడిచాడు. అంతే! శుక్రాచార్యుడి కన్నొకటి పోయింది. ధార వెంటనే జలజలా పడింది.

ఉపదేశమూ, ఆచరణా రెండూ రెండు కన్నులు. శుక్రాచార్యుడు ఉపదేశముతో నిలబడగలిగాడుగాని, ఆచరణ కొచ్చేసరికి నిలబడలేకపోయాడు. అందుకే ఆ కన్నును పోగొట్టుకున్నాడు. చెప్పడం తేలికే! చేయడం దగ్గరకొచ్చేటప్పటికే కష్టం!

బలిచక్రవర్తి అలా ధారపోసినందుకు సకల లోకాలూ ఆశ్చర్యానందాలతో సంబరపడుతున్నాయి.

ఇక వామనుడు క్షణాలలో త్రివిక్రముడయ్యాడు. ఆశ్చర్యం! ఒక అడుగుతో భూమినీ, మరొక అడుగుతో ఆకాశాన్ని ఆక్రమించేశాడు. అపూర్వమైన దృశ్యమిది! సకలలోక వాసులూ ఎక్కడికక్కడే ఆ దివ్య రూపానికి పూజలు చేయసాగారు.

కొద్దిసేపట్లో మాములుగా నిలబడ్డాడు విష్ణువు. బలిచక్రవర్తిని బంధిపజేసి "మరి నా మూడవ అడుగు మాటేమిటి?" అడిగాడు విష్ణువు. బలి ఆ అడుగును తన శిరస్సున ఉంచమన్నాడు. అందరూ ఆశ్చర్యపోయారు.

ఇంతలో ప్రహ్లాదుడు విష్ణువును సమీపించాడు. "బలి అదృష్టవంతుడు ఇది నిగ్రహంలో అనుగ్రహం! దండన రూపంలో ఉన్న లాలన!" అన్నాడు.

బలి భార్య అక్కడకు చేరింది. 'ఇంతగా సర్వసమర్పణ చెందినవాడు ఇలా బలైపోవలసిందేనా? ఇది మీకు భావ్యమా, దేవా!' అన్నది.

బ్రహ్మదేవుడు సమీపించాడు. 'తండ్రీ, ఇది భావ్యమా?' అన్నాడు. ప్రహ్లాదుడు తప్ప మిగిలిన అందరూ కూడ ఇది భావ్యమేనా అన్నట్లు చూస్తున్నారు.

అందరివైపూ చూస్తూ విష్ణుదేవుడిలా అన్నాడు: చెబుతున్నాను వినండి. బలి ఆడిగిన ప్రకారం బలి శిరస్సున నేను పాదం మోపుతాను. తప్పదు. ఇతణ్ణి సుతల లోకానికి పంపిస్తాను. అక్కడ నా రక్షణలో ఇతడుంటాడు. తలచినంత మాత్రాన నేను గోచరిస్తూ ఉంటాను. ఇంతలో సావర్ణి మన్వంతరం వస్తుంది. అప్పుడు ఈ బలిని ఇంద్రుణ్ణి చేస్తాను. సమస్త భోగభాగ్యాలు నా రూపంగా ఇతడు అనుభవిస్తాడు. ఆ తరువాత ఎవరికీ అందని ఒకానొక దివ్యస్థితిలో ఇతడిని నాలో నిలుపుకొంటాను.


విష్ణుని పాదస్పర్శకు బలి పరవశిస్తున్నాడు. బలితో పాటుగా ప్రహ్లాదుడుకూడ సుతల లోకానికి బయలుదేరుతున్నాడు.

ఇక్కడొక చిత్రముంది. "మూడవ అడుగు ఎక్కడ పెట్టను" అని అడిగాడు విష్ణువు. "నా శిరస్సున పెట్టు!" అన్నాడు బలి. భూమి అంతా అప్పటికే విష్ణువు వశమైంది. మరి అలా వశమైన భూమిలో బలి లేడా? అతని శిరస్సు లేదా? అయినప్పటికీ "నా శిరస్సున పెట్టు" అంటున్నాడతను. అంటే ఈ భూమికన్నా తనను వేరుగా చూచుకొంటున్నాడన్నమాట. అహంకారమంటే అదే! విష్ణువు పాదం మోపింది కేవలం అతని శిరస్సునకాదు. అతని అహంకారం మీద!

నిజానికి బలిచక్రవర్తిలో ఏ దోషమూలేదు. ఈ ఒక్క అహంకారం తప్పు! ఆ ఒక్క అహంకారాన్నీ తన పాదంతో అదిమి, బలిని తరింపజేయడానికే విష్ణువు ఈ కథంతా ఇలా నడిపాడు.











# శ్రీకృష్ణ జననం

ద్వాపరయుగం ఇక చివరకు వస్తోంది. భూమికి భారం మాత్రం పెరిగిపోతోంది. దుష్టులయిన రాక్షసుల ప్రవర్తనతో భూమి అల్లాడుతోంది. అల్లాడుతున్న భూమి గోరూపాన్ని ధరించి, బ్రహ్మదేవుని సమీపించింది. తన గోడంతా వెళ్ళబోసుకొన్నది.

బ్రహ్మదేవుడు భూమాతనూ, ఇంద్రాది దేవతలనూ వెంట తీసికొని పాల సముద్రాన్ని సమీపించాడు. పురుషసూక్తాన్ని గానంచేస్తూ దేవదేవుని గూర్చిన ధ్యానంలో అలా నిలచిపోయాడు.

కొంతసేపటి తరువాత ధ్యానం నుండి ఈవలకు చూస్తూ బ్రహ్మదేవుడు ఇలా అన్నాడు: భూమాతా! బెంగపడకు. నీ భారాన్ని తగ్గించేటందుకు దేవదేవుడు నీపైన అవతరించబోతున్నాడు. దేవతలారా! మీరిక సిద్ధం కావాలి. మీరందరూ యాదవులుగా జన్మించి దేవదేవుని ప్రణాళికలో భాగస్వాములై వర్థిల్లాలి!

దేవదేవుడు దేవకీ వసుదేవులకు జన్మించబోతున్నాడు. అతడి సేవలో పాలుపంచుకోవడానికై దేవకాంతులు కూడ ఇక తరలి వెళ్ళవలసి ఉన్నది. వేయిపడగల ఆదిశేషుడు ఈసారి దేవదేవునికి అన్నగా జన్మించబోతున్నాడు. యోగ మాయకూడ దేవదేవుని అంశగా భూమిమీద అవతరించి ఒకానొక ప్రత్యేక పాత్రను పోషించబోతున్నది.

దేవతలు సంతోషించారు. భూమాత సేదతీరింది. బ్రహ్మదేవుడు పరితృప్తుడయ్యాడు. కాలం కథకు అనుగుణంగా కదులుతోందిక.

ఇక భూమిపైన దేవకీ వసుదేవులకు వివాహమైంది. దేవకి అన్న కంసుడు నూతన దంపతులను రథాన ఎక్కించుకొని మిడిసిపడుతూ, స్వయంగా తీసికొని వెళుతున్నాడు. కంసుడు ఏంచేసినా ఆర్భాటంగానే ఉంటుంది. ఆత్మీయత తక్కువ ఆర్భాటం ఎక్కువ.

రథం అలా సాగుతూ ఉండగా ఆకాశవాణి ఇలా పలికింది: "కంసుడా! ఒళ్ళు తెలియని స్థితిలో ఉన్నావు నీవు, ఏ దంపతులకు పెళ్ళిచేసి నీవు ఇప్పుడు తీసికొని వెళుతున్నావో, ఆ దేవకీ వసుదేవుల అష్టమ గర్భాన పుట్టినవాడు నిన్ను సంహరించబోతున్నాడు. తెలుసుకో!".

ఆకాశవాణి పలుకులకు దద్దరిల్లాడు కంసుడు. క్షణాలలో అతడిలోని రాక్షసత్వం పైకి ఉబికింది చెల్లెలిని కొప్పుపట్టి, రథమ్మీదనుండి క్రిందకు లాగిపడేశాడు. ఆమెనలా ఒడిసి పట్టుకొని మరొక చేత్తో ఆమెపైకి కత్తిని ఎత్తాడు. ఈ హఠాత్పరిణామానికి తల్లక్రిందులవుతున్నాడు వసుదేవుడు.

ఏది ఏమైనా ఈమెను రక్షించుకోవాలి అనిపించింది వసుదేవునికి. మొదటిది ఈమె తన భార్య. భార్యను బ్రతికించుకోవడం భర్త ధర్మం! రెండవది పలికింది ఆకాశవాణి. ఆ పలుకులు నిజంకాక తప్పదు. ఆ పలుకులను అనుసరించయినా సరే ఈమెను బ్రతికించుకొని తీరాలి!

గుండె దిటవు చేసికొని కంసునితో ఇలా అన్నాడు వసుదేవుడు. బావా! నిదానించు! పసుపు బట్టలతో ఉన్న చెల్లెలిని పంచభూతాలలో కలిపేయాలని చూడకు. ఒకవేళ నీకు ప్రమాదం వస్తే ఎవరివల్ల వస్తుంది? ఈమె అష్టమ సంతతివల్లకదా వస్తుంది. నే నొకటి చెబుతున్నాను విను! పుట్టిన బిడ్డను పుట్టినట్లుగా నీకు ఇచ్చి వేస్తాను. ఈమెను మాత్రం వదిలిపెట్టు.

కంసుడు కొద్దిగా అలోచించాడు. వసుదేవుని నిజాయితీమీద అతనికి ఆ మాత్రం నమ్మకముంది. బిడ్డలను ఇచ్చేస్తానంటున్నాడతను. ఇప్పుడీ పనిచేసి, నలుగురిలో చెడ్డపేరు తెచ్చుకోవడమెందుకు? కంసుడప్పటికి ఆగాడు. నీమీద నమ్మకంతో ఈమెను ఇప్పటికి వదిలిపెడుతున్నాను అన్నాడు. 'బ్రతుకు జీవుడా!' అనుకొంటూ వసుదేవుడు దేవకిని దగ్గరకు తీసికొన్నాడు.

దేవకీ వసుదేవులకు మొదటి మగబిడ్డ కలిగాడు. ఇచ్చినమాట ప్రకారం ఆ బిడ్డను తీసికొని వెళ్ళి కంసునికి ఇవ్వబోయాడు వసుదేవుడు. వసుదేవుని నిజాయితీకి లోలోపల మెచ్చుకొన్నాడు కంసుడు. 'ఆకాశవాణి చెప్పింది అష్టమ గర్భాన్ని గురించి వీడేం చేస్తాడులే

నన్ను. వీడిని నీవు తీసికొని పో!' అన్నాడు కంసుడు. ఆ మాటకు వసుదేవుడు పెద్దగా సంతోషించలేదు. కంసుని మాటకు నిలకడ ఎంతో అతనికి బాగా తెలుసు.

కాలం ఇలా కదులుతూ ఉండగా నారదుడొకసారి కంసుని దగ్గరగా వచ్చాడు. కంసరాజా! ఏమిటీ మెతకదనం! సత్యాన్ని చెబుతున్నాను గమనించు! నీవూ, నీ చుట్టూ ఉన్నవారు రాక్షసులు, వసుదేవుడూ, అతనిచుట్టూ ఉన్నవారు దేవతలు. ముఖ్యంగా, నీవు కాలనేమి అనే రాక్షసుడివి. దేవకి కడుపున అష్టమ సంతతిగా దిగివస్తున్నవాడు దేవదేవుడయిన విష్ణుదేవుడు.

నారదుని మాటలకు కంసునికి తల తిరిగిపోయింది. ఆ తిరిగిన తలకు గతమంతా గోచరించింది. ఇక అతడు వెర్రెత్తిపోయాడు. దేవకీ వసుదేవులకు అంతవరకూ పుట్టిన బిడ్డలందరినీ వరుసగా వధించేశాడు. వారిని బద్ధశత్రువులుగా పరిగణించి కారాగారంలో బంధించివేశాడు. వారి కదలికలపై గట్టి నిఘా ఏర్పాటు చేశాడు. ఆ కారాగారం చుట్టూ పెద్ద ఎత్తున కాపలా పెట్టాడు.

అతని దృష్టి యాదవులపైకి మళ్ళింది. వాళ్ళను నానా యాతనలూ పెట్టసాగాడు. ఈ దారుణ కృత్యాలన్నింటికీ అడ్డువస్తాడన్న ఉద్దేశంతో తండ్రి అయిన ఉగ్రసేనుణ్ణి కూడా బంధించి వేశాడు. ఇలా మొత్తం రాజ్యాన్నే తన బందీగాచేసి పట్టుకున్నాడు. ఈ హడావిడిలో ఇలా ఉండగా, అక్కడ దేవకీదేవి కడుపున ఆదిశేషుడు బుసలుకొడుతున్నాడు.

విష్ణుదేవుడు యోగమాయను చేరబిలిచాడు. "కథలో నీ పాత్ర వచ్చింది" అన్నాడు. "దేవకీ గర్భాన రూపుదిద్దుకొంటున్న ఆదిశేషుణ్ణి నీ మాయతో రోహిణి గర్భాన ప్రవేశపెట్టు! అప్పుడతడు రోహిణికి బిడ్డగా, నాకు అన్నగా రూపొందుతాడు. నేనిక దేవకీదేవికి పుడతాను. నీవక్కడ యశోదాదేవికి పుట్టు! దివ్య ప్రణాళికకు ఇంతగా కలసివస్తున్న నీకు తరతరాల జనులు గుడులుకట్టి, పూజలు సలుపుతారు. ఇక క్షేమంగా వెళ్ళిరా!" అన్నాడు.

కథ ముందుకు సాగుతోంది. అందరూ ఇక్కడ దేవకీదేవికి గర్భం పోయింది అనుకొన్నారు. ఇక్కడనుండి పోయి అక్కడకు చేరికొన్నది అని గ్రహించలేకపోయారు. ఆదిశేషుడు ఇలా ఇద్దరి తల్లుల బిడ్డ అయ్యాడు.

ఇక విష్ణుదేవుడు వసుదేవుని సమీపించాడు. అతని తేజస్సును ఆశ్రయించి, దేవకీదేవి గర్భాన ప్రవేశించాడు. దేవకీదేవిలో ఇప్పుడొక క్రొత్తవెలుగు గోచరిస్తుంది. కారాగారంలో కారుచీకటిలో ఉండికూడా ఆమె ఒక కాంతిరేకలా కనిపిస్తోంది. ఆ తేజస్సును చూసి కంసుడు దడుసుకొంటున్నాడు.

ఈమెను ఇప్పుడే చంపివేస్తే ఎలా ఉంటుంది? అన్న ఆలోచన వచ్చింది కంసుడికి. మళ్ళీ బాగుండదనిపించింది. వాడెప్పుడు పుడతాడో, పుట్టగానే వాణ్ణి చంపేద్దాం! అని ఎదురుచూస్తున్నాడు కంసుడు. కన్ను మూసినా, కన్ను తెరిచినా, కూర్చున్నా, నించున్నా, అడుగడుగునా అదే స్మరణ! ఆగని విష్ణుస్మరణ!

దేవకీదేవికి నెలలు నిండుతున్నాయి. నారదాది మునీంద్రులు అటు బ్రహ్మనీ, ఇటు శివునీకూడ వెంటబెట్టుకొని ఒక ప్రశాంత సమయంలో కారాగారానికి చేరుకొన్నారు. మళ్ళీ చాలా కాలానికి చూస్తాము ఈ అవతార లీలలు! అని మురిసిపోతూ, దేవదేవుని అనేక విధాల కీర్తిస్తున్నారు. భూమాతతో బాటుగా మేమందరమూ కూడ నీ అవతార లీలకై ఎదురు చూస్తున్నాము. వెలుగుల మూర్తి! ఇక వెలికి రావయ్యా! అని మరీ మరీ వేడుకొన్నారు.

దేవకీదేవిని అభినందించారు. అమ్మా! నీవు అదృష్టవంతురాలవు! నీ గర్భాన ఉన్న శిశువు సామాన్యుడు కాడు. సృష్టికి నాయకుడైన శ్రీ మహా విష్ణువు! ఇక కంసుణ్ణి గురించి మీరు బెంగపడవలసిన పనిలేదు. మీతోబాటుగా మేము కూడా సుఖసంతోషాలను నిండుగా అనుభవించే మంచిరోజులు వచ్చేస్తున్నాయి. భగవానుడిక అవతరించబోతున్నాడు! సకలలోకవాసుల హృదయాలను దోచుకోబోతున్నాడు!

ఆ పెద్దలందరూ అలా వెళ్ళారో లేదో ఇక దేవకీదేవికి పెద్ద ఎత్తున నొప్పులు ప్రారంభమయ్యాయి. సృష్టి అంతా దేవదేవుడు దిగివస్తున్న వైనాన్ని సూచిస్తోంది. అణువణువునా ఆ సంబరం వ్యక్తమవుతోంది. సరస్సులు, నదులు, సముద్రాలు పరమమైన ప్రశాంతతను చెంది, పరమ పురుషుని రాకను సూచిస్తున్నాయి. నిదానంగా సాగుతూ ఆయన కొరకు ధ్యానాన్ని కొనసాగిస్తున్నాయి. పల్లెలు, పట్టణాలు, నగరాలు మంగళ వాద్యనాదాలను

వీనుల విందుగా వినిపిస్తున్నాయి. అంతటా ఒక పండుగ జరుగుతున్న వాతావరణం దానికదిగా గోచరిస్తున్నది. ఏదో తెలియని ఆనందం ఆవనినుండి అంబరందాకా అనుభవింపబడుతోంది.

అన్ని శుభశకునాల మధ్య దేవకీదేవి దేవదేవుని కన్నది. చతుర్భుజాలతో, శంఖచక్రాది ఆయుదాలతో దివ్యంగా గోచరిస్తున్నాడతను. దేవకీ, వసుదేవుల ఆశ్చర్యానందాలకు అంతులేదు. వారు చేతులు జోడించి, శిరస్సులు వంచి, అనేక విధాల అతణ్ణి కీర్తించారు. అంతగా సంబరపడుతూ కూడా కంసుణ్ణి తలచుకొని బాధపడ్డాడు వసుదేవుడు. తండ్రీ! ఇతడి బారినుండి మనం బయటపడటం ఎలా అనిపిస్తున్నది నాకు? అన్నాడు.

దేవకీదేవి పరవసిస్తూ అన్నది: తండ్రీ! దేవదేవా! యోగులయినవారు సమాధి స్థితిలో నిన్ను పొడగట్టించుకొంటారు అంటారు. వారు ఏమాత్రం నిన్ను పొడగట్టించుకోగలరో చెప్పలేనుగాని, ఇదిమాత్రం నా అదృష్టం! ఇలా నేను నిన్ను బిడ్డగా పొందగలగడం ఉన్నదే, ఇది అంతుబట్టని అదృష్టం!

తండ్రీ! ఈ నీ దివ్యదర్శనం నాకెంతగా ఆనందాన్ని కలిగిస్తున్నా, ఇక్కడి పరస్థితులను బట్టి నీవు మాములు శిశువుగా గోచరిస్తేనే మంచిదనిపిస్తున్నది నాకు, అంటూ ఆమె అతడిని వేడుకొన్నది.

వారి భక్తికీ, ఆర్తికీ మెచ్చుకొని, దేవదేవుడిలా అన్నాడు: మీకొక విషయం చెప్పాలి. అందుకనే కాసేపటిపాటు ఇలా ఉండదలిచాను.

తల్లీ! పూర్వం స్వాయంభువ మన్వంతరంలో నీవు పృశ్ని అనే పతివ్రతవు, ఈ వసుదేవుడు సుతపుడు అనే ప్రజాపతి బ్రహ్మయొక్క ఆజ్ఞ ననుసరించి, సృష్టి కార్యాన్ని నిర్వహింపగోరి మీరు నాకొరకు తపస్సు చేశారు. తపస్సుకు మెచ్చి నేను సాక్షాత్కరించాను. కొడుకు కావాలని కోరుకున్నారు మీరు. మీ కోరికను మన్నించి నేను మీకు కుమారుడనయ్యాను. పృశ్నిగర్భుడు అని పిలవబడ్డాను.

ఆ తరువాతి కాలంలో వసుదేవుడు కశ్యప ప్రజాపతి కాగా, నీవు అదితిగా వ్యక్తమయ్యావు. అప్పుడుకూడ నేను మీకు కొడుకునయ్యాను. వామనునిగా అవతరించి బలిచక్రవర్తికి బదులు చెప్పాను. ఇప్పుడు మీరు దేవకీ వసుదేవులయ్యారు. ఇప్పుడు కూడ మీకు నేను మళ్ళీ బిడ్డనయ్యాను. ఇలా మూడు తరాలుగా మీ ముద్దు ముచ్చటలననుభవిస్తున్నాను. ఇక మీకు జన్మలేదు. నన్ను భజిస్తూ, ఎవరూ అందుకోలేని దివ్యస్థితిని అందుకొంటారు.

వసుదేవా! కంసునివల్ల కీడు కలుగుతుందని నీ కనిపిస్తే నన్ను వ్రేపల్లెకు తీసికొని వెళ్ళి నందుని ఇంట ప్రవేశించి, యశోదాదేవి పొత్తిళ్ళల్లో నన్ను పడుకోబెట్టు. నాతోబాటుగా ఇదే సమయాన యశోదాదేవికి అక్కడ జన్మించిన యోగ మాయను త్వరగా ఇక్కడికి తీసికొనిరా! ఈ తల్లికి ఆ బిడ్డను అప్పగించు!

ఇదంతా ఎలాగని అలోచించవద్దు, ఈ తలుపులు తెరుచుకొంటాయి. ఆ యమున మనకు దారినిస్తుంది. ఇక పద!

అంతవరకూ దివ్యమూర్తిగా గోచరించిన విష్ణుదేవుడు ఇక ఒక సామాన్య శిశువై రోదించసాగాడు. దేవకీదేవి దేవదేవుని బిడ్డగా తన దగ్గరకు తీసికొంది. చనుబాలిస్తోంది. పాలు త్రాగుతున్నాడు. పరితృప్తి చెందుతున్నదామె. లోకాలన్నింటినీ పాలించే కొడుకు తనకు పాలిచ్చే అవకాశాన్ని ఇలా అనుగ్రహించాడు కదా! అని మురిసిపోతున్నదామె!

ఏమైనా వసుదేవుడు కొంత తొందరపడుతున్నాడు. దేవదేవుడు చెప్పిన విధాన ఈ కథను ముందుకు నడపాలి అని ఆర్తిచెందుతున్నాడు. తప్పదుసుమా అన్నట్లుగా తల్లినుండి బిడ్డను అందుకొన్నాడు. ఒక బుట్టను తీసికొని ఆ బుట్టలోని పొత్తిళ్ళలో బిడ్డను పెట్టుకొని, ఆ మొత్తాన్నీ శిరస్సున పెట్టుకొని ఇక ముందుకు సాగుతున్నాడు. "దేవదేవుని ఆజ్ఞను శిరస్సున ధరించడానికే నేనున్నాను." అన్నట్లుగా!

తలుపులుకు కూడా తలపులు తెలుస్తున్నాయి. ఇక తలుపులు వాటికవిగా తెరుచుకొంటున్నాయి. కావలివారు నిద్రపోతున్నారు. కావాలనే అలా నిద్రపోతున్నట్లుగా కనపడుతున్నారు.

వసుదేవుడు ఆచితూచి అడుగులువేస్తున్నాడు. ఆదిశేషుడు వెనుకనుండి తలుపులు వేసుకొంటూ వస్తున్నాడు. వసుదేవుడు వీధిని చేరుకొన్నాడు. జడివాన ప్రారంభమైంది. అయినా అలజడి ఏమాత్రం లేదు. ఆదిశేషుడు తన పడగలను గొడుగుగా పట్టి ఆ వెనుకగా వస్తున్నాడు. సాగుతున్న దేవదేవునికి కూడ ఆతోక అవసరమైంది. 'తోకలాగ నీ వెందుకు?' అని అతడు అనలేదు, అనలేడు.

యమునను సమీపిస్తున్నాడు వసుదేవుడు. జడివాన సాయంతో ఉప్పొంగుతోంది యమున. దేవదేవునికి ఆహ్వానం పలుకుతోంది. ఎటు నీళ్ళు అటు సర్దుకొంటున్నాయి. ఆ మధ్యన దారి ఏర్పడుతున్నది. ఆదిశేషుడు గొడుగు పడుతూనే ఉన్నాడు. వసుదేవుడు దారివెంట సాగుతున్నాడు. దేవకార్యానికి అనుగుణంగా సాగుతున్నవాడికి దారి ఎప్పుడూ ఏర్పడుతూనే ఉంటుంది. దారి ఎప్పటికప్పుడు ఏర్పడుతూనే ఉంటుంది. అన్నట్లుగా ఉందా దృశ్యం.

వ్రేపల్లెను చేరాడు వసుదేవుడు. అక్కడ ఆబాలగోపాలమూ మంచి నిద్రలో ఉన్నారు. వెళ్ళి వెళ్ళి నందుని ఇంట ప్రవేశించాడు. 'తన నందనుడిక నందనందనుడు అవుతున్నాడూ అని గ్రహించుకొన్నాడు. 'అతడు ఎంత వసుదేవుడో, అంత నందనందనుడిక!'

యశోదాదేవి పడకను సమీపించాడు వసుదేవుడు. ఆమె పొత్తిళ్ళలోనున్న ఆడుబిడ్డను తీసికొన్నాడు. తన చెంతనున్న మగబిడ్డను ఆమెచెంత పడుకోబెట్టాడు. 'దేవకీ పుత్రుడిక యశోదా తనయుడవుతున్నాడు!' అని చిన్న నవ్వు నవ్వుకొన్నాడు.

కొద్దిక్షణాలపాటు అలా మైమరచి ఉన్నాడు. అలా ఒక విధమయిన పారవశ్యానికి లోనవుతున్నాడు. ఆ పారవశ్యానికి అతని కళ్ళు చెమ్మగిల్లాయి. రెండు కన్నులనుండీ రెండు కన్నీటిబొట్లు ఆ శిశువు శిరస్సున పడ్డాయి. శిశువు కనులువిచ్చి చూచాడు. వశుదేవుడు ఆ శిశువును తన గుండెలకు హత్తుకొన్నాడు. "ఈ నీ గుండె నాకు గుడి" అన్నట్లు చూస్తున్నాడు శిశువు. వసుదేవుడు పరవశించిపోతున్నాడు. దేవకీదేవిని బిడ్డనిమ్మని తొందరపెట్టగలిగాడుగాని, తానిప్పుడు బిడ్డను విడిచి ముందుకు సాగలేకపోతున్నాడు.

ఉంచలేక ఉంచాడు బిడ్డను. కదలలేక కదులుతున్నాడు. కేవలం కథకొరకు కదులుతున్నాడు.

వసుదేవుడు యోగమాయతో కారాగారాన్ని చేరుకొన్నాడు. దేవకీదేవి ఆ పాపను చూచి ఆశ్చర్యానందాలను అనుభవిస్తోంది. కాసేపు వారినలా మురిపించి యోగమాయ ఇక తన మాయను వ్యక్తంచేయసాగింది.

తెల్లవారబోతుంది. పాప కెవ్వున ఏడ్చింది. కావలివారు లేచారు. తాళాలవైపు చూచారు. తృప్తిగా నిట్టూర్చారు. కంసుని లేపుదామని వెళ్ళారు. ఆ అవసరం లేకపోయింది. అతడు ఎప్పటినుండో ఎర్రటి కళ్ళతో ఎదురుచూస్తున్నాడు.

వార్త విన్న కంసుడు ఒక్క ఉదుటున కారాగారానికి చేరాడు. పాపను పట్టి లాగాడు. "అన్నా! ఇది ఆడబిడ్డ ఆకాశవాణి చెప్పింది మగబిడ్డను గురించి!" అన్నది దేవకీదేవి. "ఆడబిడ్డో, మగబిడ్డో ఇది అష్టమ గర్భం ఆవునా కాదా, అదీ నాకు కావలసింది" అన్నట్లు కౄరంగా చూస్తున్నాడు కంసుడు.

క్షణాలలో పాపను తీసికొనిపోయి, పైకి ఎగరేసి, క్రింద కత్తిపెట్టాడు. లెక్కప్రకారం పాప ముక్కలై క్రిందపడాలి. కాని అలా జరగలేదు. పైనుండి ఏవో ముక్కలు వినబడసాగాయి భయ భయంగా పైకిచూశాడు కంసుడు.

ఎనిమిది చేతులతో మహాశక్తి ఆకాశాన దర్శనమిచ్చింది. ఆ చేతులలో సకల ఆయుధాలూ ఉన్నాయి. ఫకాలున నవ్వి ఆమె ఇలా అన్నది: కంసా! నీ పేరు హింస అని పెట్టబడినట్లయితే బాగుండేది. ప్రాణం మీద తీపితో ఎన్ని ప్రాణాలను తీస్తున్నావు నీవు! ఏమీ, ఎదుటవారి ప్రాణాలు నీ ప్రాణాలలాంటివి కావా? దేవకీదేవి సంతతిని పుట్టినవారిని పుట్టినట్లుగా హతమార్చావు. ఇప్పుడు నన్ను కూడ హతమార్చే ప్రయత్నం చేశావు. ఎంత హతమార్చబోయినా కథ మార్చలేవు నీవు. నిన్ను చంపే వీరుడు నాతోబాటుగా పుట్టి, తగినచోట పెరుగుతున్నాడు. చేతనైతే ఒకపని చేయి! ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని దేవకీ వసుదేవులను విడిచిపెట్టు! వారిని మన్నించడం ద్వారా నీవు మనుగడను సాగించు!

లేదంటావా? నీకింకా భయం పెరుగుతుందే తప్ప తగ్గదు. భయాన్ని పోగొట్టుకునే ప్రయత్నంలో మరింతగా భయాన్ని మూటగట్టుకొంటున్నావు నువ్వు. మూర్ఖుడా ముందుకు చూడలేకపోతున్నావు!

కంసుడికి కొంతసేపు ఏమీ తోచలేదు. నిశ్చేష్టుడై అలా నిలబడిపోయాడు. కాసేపటికి కొద్దిగా తేరుకొని, దేవకీ, వసుదేవులను సమీపించి క్షమాపణ వేడుకొన్నాడు. "ఎవరి కర్మఫలం వారు అనుభవించక తప్పదు, అని తెలిసికూడా ఇలా వెర్రిగా ప్రవర్తిస్తున్నాను. అందరుగా ఉన్నది ఒకేదేవుడు అని తెలిసికూడా కొందరిని శత్రువులుగా, కొందరిని మిత్రులుగా చూస్తున్నాను. దైవానికి ఒదిగి ప్రవర్తించడం అన్నివిధాలా మంచిదని తెలిసికూడా అహంకారంతో రెచ్చిపోయి, అనర్థాలను తెచ్చుకొంటున్నాను. అయిందేదో అయిపోయింది. నన్ను మన్నించండి!" అంటూ వేడుకొన్నాడు. వేడుకగానయినా ఇలా వేడుకొంటాడని దేవకీవసుదేవులు ఎన్నడూ ఊహించలేదు కంసుణ్ణిచూచి వారు ఆశ్చర్యపడ్డారు. 'ఇతనేనా ఇలా అంటున్నది?' అనుకొన్నారు. 'ఈ పశ్చాతాపం ఇతనిలో ఇలా నిలబడిపోతే బాగుండును.' అనుకొన్నారు.

ఆ రాత్రి కంసుడికి నిద్రపట్టలేదు. తెల్లవారే వరకూ అలా అలా కాలక్షేపం చేశాడు. తెల్లవారుతూ ఉండగానే ఇష్టులయిన మంత్రులతో ఇష్టాగోష్ఠి జరిపాడు. యోగమాయ ఏమన్నదీ వారికి వివరించి చెప్పాడు. 'కర్తవ్యమేమిటి?' అన్నట్లుగా వారిపైపు చూపులని నిలువరించి ఉంచాడు.

మంత్రులందరూ ముక్తకంఠంతో ఇలా అన్నారు: ఇందులో అలోచించడానికి ఏమీలేదు. మన పరివారం అన్నీవైపులకూ వ్యాపించాలి! కనపడ్డ శిశువును కనబడ్డట్లుగా నరికి పారేయాలి! ఆ చంపేవాడు తనతోబాటు పుట్టాడు, తగినచోట పెరుగుతున్నాడు అన్నదికదా యోగమాయ ముఖ్యంగా అప్పటినుండీ పుట్టిన వారందరినీ మనవాళ్ళు మాయం చేసేయాలి!

రాజా! శత్రుశేషం ఉన్నంతవరకూ మనం నిద్రపోకూడదు. చేయగలిగినది లేదేమోనని బెంగపడిపోకూడదు. అతడెవరు, ఎక్కడున్నాడు? అన్నది కనుక్కోవడం కష్టమైనప్పుడు ఆ వయస్సు వారందరినీ హతమార్చడమే పరిష్కారం! అప్పుడందరితోబాటు వాడూ పోతాడు.

ముఖ్యంగా ధర్మమున్నచోట విష్ణువుంటాడు సద్గుణాలున్నచోట అతడుండటానికి ఇష్టపడతాడు. అతడున్న ప్రాంతం సుభిక్షంగా ఉంటుంది. సిరిసంపదలకు లోటుండదు. ఇహపరాలు రెండూ నిండుగా సాగిపోతుంటాయి. కనుక అతడున్న ప్రాంతాన్ని గుర్తుపట్టడం ఏమంత కష్టంకాదు.

ఇంకొక పనికూడ చేద్దాం! శిశువులతోపాటు వేదవిదులనుకూడ హతమారుద్దాం! వేదాలను దగ్ధం చేద్దాం! ఈ భూమిని అల్లకల్లోలంచేసి విష్ణువును హడలగొడదాం!

వారి మాటలకు కంసుడు తృప్తిపడ్డాడు 'మీరంతా కలసివస్తే నాకింకా కావలసింది ఏముంది? మనవలన కానిదేముంది? పదండి. ఇక విష్ణువును వెంటాడుదాం! వేటాడుదాం!' అంటూ పైకిలేచాడు.

కంసుని కథ మళ్ళీ మొదటికి వచ్చింది. పరిస్థితులు కలసిరాక, తప్పనిసరిగా కదలివచ్చిన మంచి ఆలోచన దుష్టునిచిత్తంలో ఎంతసేపు నిలువగలదు! మంత్రిమండలి జబ్బల చరుపులకు మంచి అలోచన ఎగిరిపోయింది. దుష్టత్వం ఇక పేట్రేగిపోయింది.









# రాక్షస సంహారం

కొడుకును పొందినందుకు నందుడు సంబరపడ్డాడు. ఇదంతా ఒకానొక దైవానుగ్రహ విశేషమని పరవశించాడు. బ్రాహ్మణులను అర్చించాడు. కళాకారులను సన్మానించాడు. బీదలను తృప్తిపరిచాడు. కనబడ్డ వారందరికీ కానుకలు అందించాడు.

వ్రేపల్లె మొత్తం పండుగ సందడిలాంటి సందడి. ఆనందోత్సాహాలతో తేలిఆడుతున్నారు అందరూ! ఏ ఇద్దరు కలసినా ఈ ముచ్చటలే! ఇక ఆడువారి హడావిడికి అంతులేదు. అన్ని వయసులవారు ఆ శిశువు దగ్గరే గుమిగూడుతున్నారు. ఏదో ఒక వంకబెట్టుకొని అతడిని దగ్గరకు తీసికొంటున్నారు. ముట్టుకోందే ఉండలేరు. పట్టుకోందే ఆగలేరు. ఎత్తుకోందే వెళ్ళలేరు. ఇక అతడు ఎత్తువారి చేతి బిడ్డడయ్యాడు. అందరూ కలసి అన్నీ చేస్తున్నారు. యశోదమ్మను పాలుమాత్రం ఇమ్మంటున్నారు. లాల పోస్తున్నారు. ఆడిస్తున్నారు. పండబెడుతున్నారు. తమ ముచ్చటనంతా ముద్దు రూపంలో అతడికి అందిస్తున్నారు. తనివితీరని ముచ్చట అది! వేళపాళలు ఇక తెలియడంలేదు.

ఆలమందలు పరవశిస్తున్నాయి. కోడెదూడలు గంతులేస్తున్నాయి. పాడిపంటలకు కొదవలేదు. ఆటపాటలకు లోటులేదు. అసలు రోజులు గడుస్తున్నట్లే లేదు. సంతోషంలో సమయం తెలియదు, సంతాపంలో సమయం నడవదు!

కప్పం కట్టివద్దామని కంసుని దగ్గరకు బయలుదేరాడు నందుడు. ఆ పనిని పూర్తిచేసి వసుదేవుణ్ణి చేరుకున్నాడు. ప్రాణం లేచివచ్చినట్లయింది వసుదేవునికి. బిడ్డను గూర్చిన విశేషాలను ఇంకా ఇంకా, ఎంతో ఎంతో వినాలని ఉబలాటపడుతున్నాడతను. నందుడు చెప్పుకొస్తున్నాడు. వసుదేవుడు చెప్పమంటున్నాడు.

'నందుడా! మగబిడ్డను పొంది, నీవిలా ధన్యుడవయ్యావు కదా!' అన్నాడు వసుదేవుడు. "వసుదేవుడా! అదేమిటో నీకు పుట్టిన వారందరూ హతులయ్యారు. మట్టిలో కలసిపోయారు.

చివరికి ఆ ఆడపిల్లనయినా దక్కుతుందీ అనుకొంటే ఆ పిల్లేమో ఆకాశంలో కలసిపోయింది. సమస్యలు వచ్చినప్పుడే తట్టుకోవాలి మనం!" అంటూ నందుడు వసుదేవుణ్ణి ఓదార్చాడు.

ఆ ఓదార్పుకు చిన్నగా నవ్వుకొని, వసుదేవుడిలా అన్నాడు: కబుర్లతో కాలం తెలియడంలేదు. ఎంత చెప్పుకున్నా ఇవి అంతులేని కబుర్లు! అంతుబట్టని కబుర్లు కూడా! ఎందుకైనా మంచిది నీవిక వ్రేపల్లెకు బయలుదేరు! రక్షకులుగా నీ వెందరిని నియమించినా, రాక్షసులు అంతకు మించినవారు! రోహిణినీ బిడ్డనూకూడ కనిపెట్టుకొని ఉండు. ఇలాగే అవకాశం వచ్చినప్పుడల్లా వచ్చిపోతూ ఉందు. వచ్చినప్పుడల్లా నీవు చెప్పే కబుర్ల కోసం, విశేషాలకోసం ఈ చెవులను ఇలా పెద్దవి చేసికొని వేచి ఉంటాము. మీరెంత సందడిలో ఉన్నా మా సంగతి మీకు గుర్తుంటుంది కదా! స్నేహశీలివి నీవు. నీకన్నా నాకాత్మీయుడెవరు? ఇక వెళ్ళిరా!

నందుడు వ్రేపల్లెకు సాగుతున్నాడు. వసుదేవుని మాటలను మరల మరల మననం చేసికొంటున్నాడు. ఏవైపునుండి ఎటువంటి ప్రమాదాలు వచ్చినా కనిపెట్టుకొని కాచుకోవలసిందిగా విష్ణువును వేడుకొంటున్నాడు. వ్రేపల్లెకు చేరి పనిపాటలలో ఎప్పటిలా మసలుతున్నా వసుదేవుని మాటలు మాత్రం నందుని మనస్సులో ఎప్పటికప్పుడు మెదులుతూనే ఉన్నాయి.

మంత్రిమండలి సలహా ప్రకారం కంసుడు కామరూపులయిన రాక్షసులను శిశువులను సంహరించేటందుకై ప్రత్యేకంగా కేటాయించి ప్రయోగించాడు. అలా ప్రయోగింపబడినవారిలో పూతన ఒకతె. గ్రామాలలోకి అలా వస్తూ పోతున్నట్లే ఉంటుంది. శిశువుల ప్రాణాలు ఇట్టే తీసికొనిపోతూ ఉంటుంది.

అలాంటి పూతనకు కృష్ణుని ఏడుపు వినిపించింది. క్షణాలలో అందమైన వనితగా రూపొందింది పూతన. అక్కడ ఉన్నవారందరినీ సమ్మోహన పరుస్తూ ఊయల దగ్గరకు చేరుకొంది. కృష్ణుడామెను ఓరగా చూచాడు. మళ్ళీ అంతలోనే గుర్రు పెట్టి నిద్రపోతున్నాడు. అంతా దొంగనిద్ర! అసలతనే ఒక దొంగకదా! దొంగ యొక్క నిద్ర దొంగనిద్ర కాక మరేమవుతుంది!

మృదువుగా తట్టిలేపింది పూతన. పిల్లావాణ్ణి తన ఒడిలోనికి తీసికొంది. అల్లంత దూరానికి తీసికొని వెళ్ళి ఆడిస్తూ కూర్చొంది. క్రొత్త ఏమీ లేకుండా ఆడుతున్నాడు కృష్ణుడు. అయినా కృష్ణుడికి క్రొత్తేమిటి!

పరవశాన్ని అభినయిస్తూ పాలివ్వబోయింది పూతన! పాలరూపంలో ఆమె ఇవ్వబోతున్నది కేవలం విషాన్ని! ఒక్క గ్రుక్క త్రాగాడు కృష్ణుడు. అమ్మయ్య అనుకొంది. ఇంకొక గ్రుక్క త్రాగాడు కృష్ణుడు. ఇక గ్రుక్కత్రిప్పుకోలేకపోయింది. 'అమ్మయ్యో!' అంటూ ఒక పెద్ద గావుకేక పెట్టింది కళ్ళు తేలవేసింది. నేలమీద విరుచుకుపడుతోంది. యోజనంన్నరమేర ఉన్న చెట్లనూ, పుట్లనూ విరుచుకొంటూ మరీ పడుతోంది. కనుచూపుకు అందనంత బీకరాకారం! ఒక మహారాక్షసి!

ఎవరికీ ఏమీ బోధపడటంలేదు. ఒక ప్రక్క భయం! ఒకప్రక్క ఆశ్చర్యం! ఇలాంటి దృశ్యాన్ని వారెప్పుడూ చూడలేదు. ఇలాంటి సంఘటనను వారెప్పుడూ వినలేదు. చాలామందికి అక్కడ గొంతులోనుండి మాట పెగలడమే లేదు.

గోపికలలో కొందరుమాత్రం ఆ రాక్షసిపైన ఆ చనుగవకు మధ్యన నిబ్బరంగా ఆడుకొంటున్న కొంటెకృష్ణుణ్ణి చూచారు. గభాలున ఇవతలకి తీసికొన్నారు. దిష్టి తీశారు. రక్ష కట్టారు. ఆవుతోకతో అతడికి దిగదుడిచారు. ఆవుడెక్కలో ఉన్న మట్టినితీసి అతనికి బొట్టుగా పెట్టారు. గోమూత్రాన్ని తెచ్చి అతనిపైన జల్లారు. ఇంత ఆవుపేడను తెచ్చి అతని అవయవాలకి పులిమారు. అన్నిటికీ ఆవే వారికి! మంచికీ, చెడ్డకూ అన్నిటికీ భయానికీ, భక్తికీ అన్నిటికీ! అన్నిటికీ ఆవే వారికి!

ఏది ఏమైనా పిల్లవాడు లక్షణంగా ఉన్నాడు. యశోదమ్మ అందుకు సంతోషించింది. ఆమెకు ఏమీ పట్టడంలేదు. పిల్లవాడికి పాలిచ్చి, జోలపాడి పడుకోబెట్టింది.

ఇంతలో మధురనుండి నందాదులు వచ్చారు. ఇందంతా చూశారు. జరిగినదంతా విని ఆశ్చర్యపోయారు. పూతన శరీరాన్ని గొడ్డళ్ళతో ముక్కలు చేశారు. ఆ భాగాలను ఊరవతలకు లాగించారు. అక్కడ వాటికి అగ్నిసంస్కారం ఏర్పాటు చేశారు. ఆశ్చర్యం! దగ్ధమవుతున్న పూతన

శరీరము నుండి సువాసనలు సంక్రమించాయి. కృష్ణస్పర్శకు పూతన ఇలా పునీతమైంది! అని చెప్పుకొంటూ అందరూ పరవశించారు.

కాలం సాగుతోంది. ఇంతలో ఓ రోజున పసిపాపడైన కృష్ణుడు ప్రక్కకు ఒత్తిగిల్లాడు. పైగా ఆ రోజు జన్మనక్షత్రం కూడా అయింది. అంతే! ఇక యశోదమ్మ మురిపానికి అంతులేదు. ఉత్సవం ప్రారంభమైంది. ప్రత్యేక స్నానాలు. ప్రత్యేక పూజలు. విందు భోజనాలు. వేడుకలు, పేరంటాలు!

చిన్ని కృష్ణుడు నిద్రపోతున్నాడు. అందరూ ఆ లోపల అనందోత్సాహాలలో ఉన్నారు. కృష్ణునిది దొంగనిద్ర ఇదివరకే చెప్పుకున్నాంకదా! అంతే, ఒకసారి ఓరగా చూచాడు. బండి ఒకటి సమీపిస్తున్నట్లు గమనించాడు. తన చిన్ని చిన్ని కాళ్ళను పైకి లేపాడు. ఒకసారి సరిజూచుకొన్నాడు. మీదకు వస్తున్న బండిని మృదువుగా ఒక తన్నుతన్నాడు. అంతే! అ బండి ఆకాశంలోనికి ఎగిరింది. ముక్కలై క్రిందపడింది. అతడు శకటాసురుడు అనే రాక్షసుడు. శకట రూపంలో సంకటం సృష్టిద్దామని వచ్చాడు. చిన్ని కృష్ణుని చేత ఇలా సంహరింపబడ్డాడు.

ఆ హడావిడికి యశోదమ్మ బిడ్డను చేరుకొంది. అతణ్ణి గుండెలకు హత్తుకొంది. రక్ష కట్టమని బ్రాహ్మణులకు వేడుకొంది. గోధూళిని బొట్టుగా పెట్టి, రక్ష కట్టారు వాళ్ళు.

ఇంతలో నందాదులక్కడకు చేరుకొన్నారు. గోపబాలకులు జరిగింది చెప్పారు. ఎంత చెప్పినా నందాదులు నమ్మరే! అదిసరే, మరి చచ్చిపడి ఉన్న రాక్షసుని మాటేమిటి? మళ్ళీ ఆశ్చర్యం!

శకటాసురునికి ఇక దహనకార్యం. ఈ సారి ముక్కలు చేయవలసిన అవసరం మాత్రం కలుగలేదు.

ఇలా కృష్ణుడు తన్నిన ఒకే తన్నుతో తన్నుతాను తెలిసికొన్నాడు శకటాసురుడు.

బాలకృష్ణుడు మెల్లిమెల్లిగా కూర్చుంటున్నాడిక! యశోదమ్మ ఒకరోజున బిడ్డకు పాలిచ్చి. ముద్దాడి తలనిమురుతూ అలా తన తొడపైన కూర్చొపెట్టుకొంది. కాసేపట్లా కూర్చున్నాడు పిల్లవాడు.

ఆశ్చర్యం! పిల్లవాడలా చూస్తుండగా బరువైపోతున్నాడు. ఒక మహాపర్వత శిఖరాన్ని తన తొడపైన కూర్చోపెట్టుకొన్నట్లుగా అనిపించసాగింది యశోదమ్మకు. ఇక తాళలేకపోయింది. క్రింద కూర్చోపెట్టింది. ఈ పిల్లవాడు సామాన్యుడిలా లేడు అనుకొంది.

ఇంతలో సుడిగాలొకటి రేగింది. అది మామూలు సుడిగాలి కాదు. తృణావర్తుడనే రాక్షసుడు అలా సుడిగాలిలాగా వచ్చాడు. కృష్ణున్ని ఎత్తి పడేద్దామన్నది వాడి ఊహ!

పిల్లవాడిని ఒకపట్టాన లేపలేకపోతున్నాడు తృణావర్తుడు. దానితో వేగాన్నీ, బలాన్నీ కూడ పెంచాడు. అందుచేత ఊరంతా సుడిగాలిలో చిక్కుకున్నట్లయింది. భూమి మొత్తం లేచి పైకెళ్ళిపోతుందా అనిపిస్తోంది. లేచిన దుమ్ముతో సూర్యుడు కప్పివేయబడుతున్నాడు. అంతటా అంధకారం అలుముకుంటోంది. చూడటానికది ఒక ప్రళయంలా ఉంది.

వ్రేపల్లెలో ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొన్నారు. భయంతో గడగడలాడుతున్నారు. ఏమీ తోచని స్థితిలో ప్రూన్పడిపోతున్నారు.

ఇంతలో యశోదమ్మ పిల్లవాడికోశం చూచింది. అక్కడ పిల్లవాడు లేడు. ఆమె భయంతో వణికింది. బావురుమన్నది.

చుట్టుప్రక్కల గోపకాంతలక్కడకు చేరుకొన్నారు. యశోదమ్మను ఓదారుస్తున్నారు. అనునయిస్తున్నారేగాని వాళ్ళు చెప్పలేనంతగా ఆవేదన ననుభవిస్తున్నారు. 'ఏమిటిదంతా, ఒకదాని తరువాత ఒకటి ఇలా ముంచుకు వచ్చేస్తున్నాయి! దినదిన గండం నూరేళ్ళాయుష్షు అన్నట్లుంది పరిస్థితి! పసివాడిపైనా ఇంత కసి! ఇలా రోజుకొక రాక్షసి!' వాళ్ళు నివ్వెరపోతున్నారు. వాళ్ళు నిట్టూరుస్తున్నారు.

తృణావర్తుడు కృష్ణుణ్ణి పైకైతే ఎత్తుకెళ్ళగలిగాడుగాని, ఇక అక్కడ ఎత్తుకోలేకపోతున్నాడు. కృష్ణుడి బరువును మోయలేకపోతున్నాడు. నీరసపడుతున్నాడు. పసివాడేమిటి, ఈ బరువేమిటి? అని ఆశ్చర్యపడుతున్నాడు.

రాక్షసుని పని ఇక అయిపోయిందని గ్రహించాడు కృష్ణుడు. తన రెండు చేతులనూ రాక్షసుని మెడకు చుట్టాడు. అలా మెడపట్టుకొని వ్రేలాడసాగాడు. మెడకు ఒక కొండ వ్రేలాడుతూ ఉన్నట్లుంది తృణావర్తుడికి. దానితో వాడు ఇక ఆగలేకపోయాడు. కృష్ణుడితో వేగలేకపోయాడు. క్రిందపడి ముక్కలయ్యాడు. కంసుడి ప్రణాళికలన్నీ ఇలా ముక్కలవుతున్నాయి. చెక్కలవుతున్నాయి. ముక్కచెక్కలవుతున్నాయి.

ముక్కలై పడిన రాక్షసుని గుండెలమీద విహరిస్తున్నాడు బాలకృష్ణుడు. కంసరాజా! ఇలా నీ గుండెల్లో నిద్రపోతానన్నట్లుగా. గోపకాంతలది చూశారు. అదిరిపడ్డారు. గభాలున తీసికొని వెళ్ళి కృష్ణుణ్ణి తల్లిచేతికిచ్చారు. ఆ తరువాత నందుడొచ్చాడు. జరిగినదంతా కన్నాడూ, విన్నాడూ. "ఇవన్నీ కూడ రాక్షస చేష్టలు. వసుదేవుడు హెచ్చరించినట్లే జరుగుతోంది" అనుకొన్నాడు.

"అయితే దేవదేవుని దయవల్ల ఎప్పటికప్పుడు బయటపడుతున్నాం. బ్రతికి బట్టకడుతున్నాం. అదొక్కటే సంతోషం" అనుకొంటూ తృప్తిపడ్డాడు. తృప్తిగా విష్ణుదేవునికి నమస్కరించుకొన్నాడు. ఒకరోజున యశోదమ్మ కృష్ణుడిని తొడపైన కూర్చోపెట్టుకొని ముద్దు చేస్తున్నది. ఆ ముద్దుకు నిద్రవస్తున్నట్లుగా చిరునవ్వు నవ్వాడు కృష్ణుడు. అలా నవ్వుతూ ఒక్కసారి ఆవలించాడు. యశోదమ్మ నిర్ఘాంతపోయింది. బాలకృష్ణుని నోటిలో భూమి, ఆకాశం, సముద్రాలు, సూర్యుడు, చంద్రుడు, అగ్ని, దిక్కులు, వాయువు, కొండలు, ఇలా సమస్తసృష్టి కనబడుతున్నది.

ఆ దర్శనానికి యశోదమ్మకు కనులు మూతపడుతున్నాయి. స్పృహ తప్పినట్లవుతున్నది. కాసేపటిలో వాటన్నింటినీ చూడగలిగిన ఆ స్పృహ తప్పుకొని మామూలు స్పృహ కలిగింది. మళ్ళీ కథ మానవీయంగా కదిలింది. తల్లీ బిడ్డలయి వారు ముచ్చట గొలుపుతున్నారు.

జరుగుతున్న విశేషాలన్నీ ఎప్పటికప్పుడు వసుదేవుడికి తెలుస్తున్నాయి. పరిస్థితిని గమనించుకొన్న వసుదేవుడు గర్గమునిని వ్రేపల్లెకు పంపాడు. గర్గుడు దైవజ్ఞుడు, యాదవుల పురోహితుడు.

గర్గుణ్ణి చూడగానే నందుడు ఆనందంతో ఉప్పొంగాడు. బాలునికి తగిన విధంగా సంస్కారాన్ని జరిపించండి అన్నాడు. గర్గుడన్నాడుకదా! ఇప్పుడు ఈ కథను నేను నడిపిస్తే ఇతడు వసుదేవుడి బిడ్డనికంసుడనుకొనేందుకు వీలుంది అని. "ఫరవాలేదులెండి రహస్యంగా జరిపిద్దాం! పెద్ద హడావిడి లేకుండా నడిపిద్దాం" అన్నాడు నందుడు.

రోహిణి తన బిడ్డతో అక్కడికి వచ్చింది. యశోదమ్మ తన బిడ్డతో ఆ ప్రక్కన కూర్చుంది. బలరామ కృష్ణులని వారికి పేర్లు పెట్టాడు గర్గుడు.

బలరామకృష్ణులు లేచి అడుగులు వేసే ప్రయత్నంలో ఉన్నారు. తల్లి చెంగును పట్టుకొని పైకి లేస్తున్నారు. ఆవు దూడల తోకలను పట్టుకొని కూడా అలాగే వెళుతున్నారు.

పూర్వం తల్లుల దగ్గర బుద్ధిగా పాలుత్రాగేవారు. ఇప్పుడు పాలుత్రాగుతూ అల్లరి చేస్తున్నారు. పాలు నోటిలోనికి పీల్చుకొని, గుటక వేయకుండా, బుగ్గన అట్టిపెట్టుకొని, ఆ బుగ్గనుండి ఈ బుగ్గకు త్రిప్పుతున్నారు. మధ్య మధ్యలో కొద్ది కొద్దిగా అలా పెదవుల మీదుగా పాలను బయటకు వదులుతూ కొంటెతనంగా తల్లుల వైపుకు చూస్తున్నారు.

బలరామ కృష్ణుల అల్లరి తల్లులతో ప్రారంభమై ఇక అల్లుకుపోతోంది, ఎవరి లీలలైనా జెప్పాలి అంటే ఆదిశేషుడే చెప్పాలి అంటాం. అలాంటిది ఆ ఆదిశేషుడూ ఆ శేషశయనుడూ కలసి కావాలని పిల్లలై కోరి మరీ అల్లరి చేస్తుంటే ఇక ఆ లీలలను ఇంకెవరు వర్ణించగలరు!

తలలు పైకెత్తి ఆడుతున్నప్పుడు పడగలు పిప్పిన పాముల్లా ఉంటారు. ఒడలనిండా బురద పూసుకొంటున్నప్పుడు ఏనుగు గున్నల్లా కనపడతారు. ఆట పాటల్లో వేగాన్నీ, లాఘవాన్నీ చూపినప్పుడు సింహపు పిల్లలను పోటీకి పిలుస్తున్నట్లుగా ఉంటారు.

మెరుస్తున్న వారి ముఖకవళికలలో సూర్యచంద్రులు దాగి ఉన్నారా అనిపిస్తుంది. తల్లుల దగ్గర చనుబాలు తృప్తిగా త్రాగి, సొమ్మసిల్లి అలా సోలిపోతున్నప్పుడు సమాధి స్థితిలోనికి జారిపోతున్న యోగీశ్వరులా వీరు! అనిపిస్తుంది.

బాలకృష్ణుడు మెల్లగా జాణ అవుతున్నాడు. గోపకాంతలను చూసి అర్థవంతంగా నవ్వుతున్నాడు. ఆ నవ్వులలో ఎనలేని భావాలను ఒలికిస్తున్నాడు, పలికిస్తున్నాడు. మెల్లగా వారిని పిలుస్తున్నాడు, తలుస్తున్నాడు, వారికోసం పలవరిస్తున్నాడు. ఎన్నెన్నో పోకడలు పోతున్నాడు.

అతడలా చూసినప్పుడు, అతడలా నవ్వినప్పుడు, అతడలా పిలిచినప్పుడు, అతడలా కులికినప్పుడు గోపకాంతలు మేనులు మరచిపోతున్నారు. ఏదో ఒక నిమిత్తంగా అతనికి చేరువకావాలనీ, అతని ఆటపాటలలో పాలుపంచుకోవాలనీ ఉవ్విళ్ళూరుతున్నారు. వారు పొందుతున్న అనుభూతి వారినలా నడిపిస్తోంది. వారికి కాలం తెలిసేది కాదు. ఒకవేళ తెలిసినా వారి కాళ్ళు కదిలేవి కావు.

కృష్ణుడు, మెల్లగా అన్నను కలుపుకొని సమవయస్కులతో సరసాలు కూడ ప్రారంభించాడు. ఆ సరసాలు ముందు తమ ఇంటితోనే ప్రారంభమయ్యాయి. తల్లి కన్నుగప్పి పాలు, పెరుగు, వెన్న, నెయ్యి, అన్నీకూడా పిల్లిలా తిని ఏమీ ఎరగనట్లుగా తల్లిదగ్గర దూరి పడుకుండిపోయేవాడు.

పిల్లలతో చేరి "నేను గోపాలుడను, మీరు గోవులు" అనిచెప్పి, గోవులను కాచే ఆట ఆడేవాడు. ఇంకొకసారి "నేను రాజును మీరు సేవకులు" అంటూ వారికి పనులు పురమాయించేవాడు. మరొకసారి, "నేను దొంగను, మీరు ఇళ్ళ యజమానులు" అంటూ వారిని పడుకోబెట్టి అన్నీ ఒలుచుకొనేవాడు. మరొకసారి, "నేను సూత్రధారిని, మీరు నటులు" అంటూ వేషాలు కట్టించి నాటకాలాడించేవాడు.

మామూలు ఆటల సంగతి ఇక చెప్పవలసిన పనేలేదు. దాగుడుమూతలు, ఉయ్యాలలు, బంతులాటలు ఒకటేమిటి ఎన్నో ఆటలు! అసలన్నీ ఆటలే! అతడివన్నీ ఆటలే! ఆటలన్నింటిలో అతడే మొనగాడు, అతడే నాయకుడు!

జతగాళ్ళు బాగా కుదిరారు. అన్న, బలరాముడు అన్నిటికీ కలసివస్తాడు. ఇక కృష్ణుడు మెల్లగా గ్రామ సంచారాన్ని ప్రారంభించాడు. ఇళ్ళలోనికి చొచ్చుకుపోతున్నాడు. ఇళ్ళన్నీ తనవే

అన్నట్లుగా ప్రవర్తిస్తున్నాడు. ఆ ఇళ్ళలోని వారిని ఆటలు పట్టిస్తున్నాడు. ఆరడి పెడుతున్నాడు. వారికీ వారికీ జుట్టు ముడులువేస్తున్నాడు. దూరాన్నుండి చూసి నవ్వుతున్నాడు.

బాలకృష్ణుని బృందం గ్రామమంతా విహరిస్తోంది ఇలా! ఎప్పుడు ఎక్కడుంటారో తెలియదు. ఎక్కడ ఏంచేస్తారో తెలియదు. ఎక్కడ కుండలు ఖాళీ అవుతాయో తెలియదు. ఎవరి మూతులకు నేతులు పూయబడతాయో తెలియదు. అంతా అల్లరి, అల్లరి, అల్లరి! అంతా అతగాడి హాస్యవల్లరి!

వ్రేపల్లెకు అంతా క్రొత్త క్రొత్తగా ఉంది. అవునన్లేరు, కాదనలేరు, కావాలనలేరు, వద్దనలేరు, అతడు లేనిదే మనలేరు. అతడి తాకిడికి తట్టుకొనలేరు!















# చిలిపి చేష్టలు

చిన్నికృష్ణుని దొంగతనాలు పెరిగాయి. బాలగోపాలుని గోలవేషాలు అంతులేకుండా పోతున్నాయి. గోపకాంతలు ఒకళ్ళతో నొకళ్ళు కూడబలుక్కొని అందరూ కలసి ఒకరోజున నందుని ఇంటికి చేరారు.

ఇంకేముంది! నందుని ఇంటిముందు చిందులు ప్రారంభమయ్యాయి. క్రమంగా వారిక కదంత్రొక్కసాగారు. 'యశోదమ్మ బయటకు వచ్చి తీరాలి!' అన్నట్లుగా ఉంది వారి హడావుడి. 'ఏమిటీ కోలాహలమంతా!' అనుకొంటూ ఆవిడ బయటకు రానే వచ్చింది.

ఆమె కనబడటం ఆలస్యం, ఫిర్యాదులు ఇక ప్రారంభమయ్యాయి. అమ్మా యశోదమ్మా! నీ బిడ్డను నీవు ముద్దుచేయడం బాగానే ఉందమ్మా! అలాగని అతగాణ్ణి మా ఇళ్ళమీదకు వదిలేస్తావా? ఇది పద్ధతేనా? మీ పిల్లవాడి అల్లరి మీకు బాగుండొచ్చు. మేమా అల్లరిని భరించలేకపోతున్నాం. పనివేళలో ఇల్లువదిలి ఇలా వచ్చామంటే మా పరిస్థితిని అర్థంచేసికో!

మీ వాడి లీలలూ, గోలలూ ఇన్నిన్నికావు. పాలు, పెరుగు, వెన్న, నెయ్యి ఎక్కడున్నా ఏమాత్రం బ్రతకనియ్యడు. ఇంకెవరికీ అవి దక్కనీయడు! ఏం చెప్పమంటావు? ఎంతచెబితే అవుతుంది నీ బిడ్డకథ!

ఒక ఇంట్లోకొచ్చాడు. పీటమీద పీట చొప్పున ఉన్న పీటలన్నీ వేశాడు. ఆ పీటలన్నిటిపైకి ఎక్కి నిలుచున్నాడు. అయినా పాలకుండ వాడికి అందలేదు. ఊరుకొన్నాడా? ఊరుకుంటే కథేముంది? ఆ కుండకు కన్నంకొట్టి క్రింద దోసిలిపట్టి పాలన్నీ త్రాగేశాడు. ఇలా రోజుకు ఎన్నెన్ని కన్నాలు వేస్తున్నాడో మీ కన్నయ్య! నీకేం తెలుస్తుందీ, నీవు పట్టించుకొంటేగా! నీవు పట్టించుకుంటే వాడు అసలలా చేస్తాడా?

ఒక ఇంట దూరాడు. కడవలలో నెయ్యంతా ఖాళీచేసాడు. అంతటితో ఊరుకోవచ్చా! ఆ ఖాళీ కడవల్ని పనివేళ తీసుకొనివెళ్ళి ప్రక్కింట్లో పడేశాడు. ఇక వాళ్ళూ వీళ్ళూ పోట్లాట! ఆపేటప్పటికి మా తలప్రాణం తోకకొచ్చింది. నీకేం, నీవు నిశ్చింతగా ఇక్కడున్నావు!

ఈ చోద్యంచూడు. ఒక ఇంట్లో దూరాడు. పెరుగంతా జుర్రాడు. పోతూ, పోతూ ఆ ప్రక్కింటి కోడలిమూతికి ఆ పెరుగు చేయి రాసాడు. ఇంతలో అత్త వచ్చి కోడలిని చీపురుకట్టతో కొట్టింది!

ఈ చిత్రం చూడు! ఒక ఇంటికి వచ్చాడు. దూడలను వదిలేస్తున్నాడు. "వద్దురా, అవి కుడుచుకుపోతాయి. ఇంట్లో పసిపిల్లలున్నారు వాళ్ళకి పాలుకావాలి" అని మొత్తుకొన్నది. వింటేగా? నీవూ, పిల్లల్ని కన్న తల్లివేగా, ఆలోచించు!

ఈ చిత్రంచూడు, ఇది మరీ చిత్రం! మా పిల్ల దొడ్లో స్నానం చేస్తోంది. "బంతి పడిపోయింది తీసికొని వెళతాను" అంటూ దొడ్డివైపుకు వచ్చాడు. నూతి గట్టుమీద ఉన్న కోకను పట్టుకుపోయాడు. ఈ మాట ఎవరైనా వింటే ఎలా ఉంటుంది. నీవే చెప్పు!

వేలెడులేడు నీ బిడ్డ, ఎలాంటి మాటలు మాట్లాడుతున్నాడో విన్నావా? ఒక ఇంట్లోకి వెళ్ళాడు. పిల్లలు లేరని ఆ ఇంటావిడ బాధపడుతూ కూర్చుంది. "ఎందుకలా బాధపడతావు. నన్ను పెళ్ళిచేసికో, నీకు పిల్లలు పుడతారు" అని అన్నాడట! ఇది అనవలసిన మాటేనా? వినవలసిన మాటేనా? వీడు పిల్లవాడు కాడు, దిప్పకాయ! ఇక మీ ఇంటి పరువేమవుతుందో అలోచించుకోండి!

మొన్నటికి మొన్న ఏం జరిగిందనుకొన్నావు! మా పిల్లాడు నిద్రపోతున్నాడు. వాడి జుట్టును తీసికొని వెళ్ళి ఒక ఆవుదూడ తోకకి ముడివేశాడు. వేసి ఊరుకొన్నాడా! దూడను తోలడం మొదలుపెట్టాడు. దూడ పరుగెత్తడం మొదలుపెట్టింది. మావాడు దొర్లుతున్నాడు లబోదిబోమంటూ ఒకటే గోల వాడు!

ఇది విను! మా పిల్లలకు అసలేభయం! సందెవేళ వాళ్ళకు అన్నంపెడుతున్నాను. వెనుకనుండి వచ్చి దీపాన్ని ఆర్పేసి, పిల్లిలా అరచి పారిపోయాడు. పిల్లలంతా ఘొల్లుమన్నారు!

ఇంతెందుకూ! ఈ పల్లెలో ఏ ఇంటికయినా వెళ్ళిచూడు. బోర్లించిన కుండలే కనబడతాయి నీకు! అవన్నీ మీ అబ్బాయి బోర్లించినవే అని వేరే చెప్పాలా! చూసి, చూసి విసిగెత్తిపోయాం మేము. ఈ మా చివరిమాట విను.

ఓయమ్మ! నీ కుమారుడు
మా యిండ్లను బాలు పెరుగు మనీడమ్మా
పోయెదమెక్కడి కైనను
మా యన్నల సురభులాన మంజులవాణీ!

ఆలమందల మధ్యలో పాలు పెరుగులకు నోచుకోకుండా ఎన్నాళ్ళుండగలమమ్మా! మా అన్నలమీద ఒట్టు! ఎక్కడికయినా వెళ్ళిపోతాము మేము. ఇదంతా నీ కడుపు చలువ, అనిమాత్రం గుర్తుంచుకో!

వాళ్ళందరూ వచ్చి, ఇలా ఇన్ని మాటలూ చెబుతూ ఉంటే, బాలకృష్ణుడు మాత్రం బుద్ధిమంతునిలా అమాయకంగా ముఖాన్ని పెట్టి, భయాన్ని నటిస్తూ, ఏమీ ఎరుగనట్లుగా యశోదమ్మ కొంగుచాటున దూరి కూర్చున్నాడు.

వచ్చినవాళ్ళు ఒక్కక్కమాట చెబుతున్నప్పుడల్లా యశోదమ్మ కృష్ణుడివైపు చూస్తున్నది. 'వీడా ఇలా చేస్తున్నది?' అని అనుకొంటున్నది. నమ్మలేకపోతున్నది. మళ్ళీ వాళ్ళవైపు చూస్తున్నది. వాళ్ళుమాత్రం అలా చెబుతూనే ఉన్నారు.

చెప్పడం అంతా పూర్తయిన తరువాత యశోదమ్మ నింపాదిగా ఇలా అన్నది: అమ్మలారా, నామాట వినండి! వీడింకా చిన్నపిల్లవాడు! ఎక్కువసేపు నా చంకలోనే ఉంటాడు. ఒకవేళ చంకదిగినా. వాడిలో వాడే ఆడుకొంటూ ఉంటాడు. మా ఇంటి పరిసరాలే సరిగా తెలుయవు వీడికి! ఇంకా మీ ఇళ్ళ త్రోవలెలా తెలుస్తాయి చెప్పండి! ముక్కుపచ్చలారనివాడు. లేకలేక కలిగినవాడు! మిమ్మల్నందరినీ బ్రతిమాలుకొంటున్నాను. వాడినేమీ అనకండి! మీరు ఎక్కడికీ వెళ్ళకండి! అని క్రమంగా వాళ్ళని శాంతింపజేసింది.

కడుపులో ఉన్నది అనేసిన తరువాత వారికీ అ ఉబ్బు తీరినట్లయింది. "చెప్పాంగా చాలు" అనిపించింది వారికి. కృష్ణుడు రావడం మానేస్తాడని వాళ్ళనుకోలేదు. కృష్ణుడిమీద చెప్పడమే వాళ్ళకు ముఖ్యం. అతగాడి అల్లరి చేష్టలనుగూర్చి అలా మళ్ళీ మళ్ళీ చెప్పాలనీ, చెప్పుకోవాలనీ

ఉంటుంది వాళ్ళకి! ఇంకా ఇంకా చెప్పుకోవాలీ అంటే అతడు ఇంకా ఇంకా చేస్తూ ఉండాలిగా మరి! అతనలా చేస్తుంటే బాగుంటుంది. వారికలా అనుకుంటే బాగుంటుంది! ఇదీ వరస!

ఒకరోజున ఒక చిత్రం జరిగింది. బాలకృష్ణుడు మన్ను తింటున్నట్లుగా కనిపించాడు. బలరాముడు వెంటనే యశోద దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చాడు. అతని వెంట గోపబాలకులు చాలామంది వచ్చారు. అందరూ కలసి ఒకటేమాట. "కృష్ణుడు మన్ను తింటున్నాడు" అన్నారు.

'అవునా?' అంటూ పరిగెత్తినట్లుగా నడిచింది యశోదమ్మ. గబాలున తింటూండగా అతణ్ణి పట్టుకోవాలని! కృష్ణుడు భయం భయంగా, బెదురు బెదురుగా కళ్ళు పెద్దవిచేసి చూస్తున్నాడు.

అల్లరి ఎక్కువైంది నీకు కృష్ణా! చేస్తున్న అల్లరిచాలక, చాటుమాటున మన్నుకూడా తింటున్నావట! వీళ్ళంతా చూశారట! ఏం, తిన్నావా, లేదా? నిజం చెప్పు!

బెదురుగా చూస్తూనే కృష్ణుడిలా అన్నాడు: నేను మన్నెందుకు తింటాను? అమ్మా! నీవే చెప్పు. నేనేమయినా ఇంకా చిన్నపిల్లవాడినా, తినకూడదని తెలియని వాడినా! తెలిసికోలేని వెర్రివాడినా! పోనీ నాకేమయినా ఆకలయిందా, ఆకలయిన తినడానికి ఏమీలేక ఇలా చేస్తానా? నాకేమి లేవని ఇలా చేస్తాను? నీవు నాకేం తక్కువ చేశావనీ!

ఏమీలేదు. నీవు నన్ను ముద్దుచేస్తావుకదా! అలాంటి నీ చేత నన్ను కొట్టించాలని వీళ్ళంతా ఇలా చేస్తున్నారు. నీవు నన్ను కొడితే వీళ్ళకు చాలా బాగుంటుంది! అందుకే ఇలా చెబుతున్నారు. అన్నీ అబద్ధాలే! కావాలంటే చూడు. నా నోటిని చూడు, నా నోటి వాసనని చూడు! నీకేమాత్రం అనుమానమొచ్చినా నన్ను దండించు! నేను సిద్ధం. ఆంటూ ఒక్కసారి నోరు తెరిచాడు కృష్ణుడు.

యశోదమ్మకు ఆ నోటిలో కనిపించింది మట్టికాదు. మొత్తం ఈ భూమి అంతా కనిపించింది. విశ్వరూపం గోచరించింది. సముద్రాలు, కొండలు, నదులు ఆ భూమితోపాటు తిరుగుతూ కనిపించాయి. ఇంకా అగ్ని, సూర్యుడు, చంద్రుడు, దిక్పాలకులు ఒకటేమిటి బ్రహ్మాండంలో ఇమిడి ఉన్నవన్నీ గోచరించాయి.

యశోదమ్మ ఆశ్చర్యానికి అంతులేదు. ఇది కలా, లేక వైష్ణవమాయా. నేను యశోదనేనా? ఈ చిన్నివాని నోటిలో ఈ బ్రహ్మాండమేమిటి? బ్రహ్మాండమయిన ఈ దర్శనమేమిటి? నాకీ అదృష్టం పట్టడానికి కారణమయిన ఆ పరమపురుషుణ్ణి ఆ సర్వాంతర్యామిని ప్రార్థిస్తున్నాను.

అరెరే! ఏమి చిత్రం! ఏమి చిత్రం! ఏమి చిత్రమయిన దర్శనం! ఆ కనబడుతున్న బ్రహ్మాండంలో నా మగడున్నాడు. నేనున్నాను. అదిగో వ్రేపల్లె. గోవులవిగో! అదిగో గోపాలరు! అంతా ఉన్నారు. లేనిదెవరు? ఇతడు పసివాడు కాడు. నేను ఏ పరమపురుషుణ్ణి ప్రార్ధిస్తున్నానో, ఆ పరమ పురుషుడితడే! ఇదంతా అతడే, అతడే ఇదంతా!

ఆమె అలా చూస్తూనే ఉన్నది, ఆ దివ్యానుభూతిలో తేలియాడుతూనే ఉన్నది. దర్శనం పూర్తయింది అన్నట్లుగా కృష్ణుడొక చిరునవ్వు నవ్వాడు. అంతే! యశోద మామూలు యశోదమ్మ అయింది. తల్లిగా బిడ్డను కౌగిలించుకొంది. ఒడిలో కూర్చోపెట్టుకొని ముద్దుచేస్తూ, బుజ్జగిస్తోంది. నువ్వు చెప్పిందే నిజం నాన్నా! నేను నిన్నే నమ్ముతాను, అని అతనికి కితాబు ఇస్తోంది. కృష్ణుడు నవ్వుకొంటున్నాడు. ఈ ముద్దులు, ఈ నవ్వులు కొనసాగాలీ అంటే ఈ మాత్రపు మాయ అవసరమనుకొంటున్నాడు. తన మాయను చూపి తానే ముచ్చట పడుతున్నాడు.

యశోదమ్మ ఒకరోజున పెరుగు చిలుకుతోంది. పరివారం ఉన్నారుగాని ఆయా పనులలో ఉన్నారు. అదీగాక ఆమెకు పెరుగు చిలకడమంటే అమితమయిన ఇష్టం. పెరుగు చిలుకుతూ ఉండగా శ్రమ అనిపించకుండా ఉండటంకోసం బాలకృష్ణుడిమీద పాటలుకట్టి పాడుతోందామె!

ఇంతలో ఎక్కడినుండి వచ్చాడో, బాలకృష్ణుడు అక్కడికి రానేవచ్చాడు. గిర్రున తిరుగుతున్న కవ్వాన్ని పట్టుకొని చటుక్కున ఆపాడు. 'అమ్మా ఆకలి పాలియ్యవా?' అంటూ మారాము చేశాడు. తల్లి గారం చేసినకొద్దీ, బిడ్డ మారం చేయడామరి!

ఆ పనిని అలా ఉంచి, ముందు బాలకృష్ణుడికి పాలిస్తోంది యశోదమ్మ. అల్లరి కోసం అడిగాడు కాని, నిజానికి అంత అవసరం లేదతనికి. పాలుత్రాగే వంకపెట్టుకొని, తల్లిముఖాన్ని మరల మరల చూస్తుంటాడు. పాలిస్తున్న అవకాశాన్ని తీసుకొని బిడ్డముఖాన్ని మరల మరల

చూస్తూ ఉంటుంది యశోదమ్మ. ఒకరినొకరు అలా చూసుకునేటందుకే ఈ పాలకథ! ఈ లోకాల కథ!

సమయం సాగిపోతున్నది. పాలుత్రాగే పనిమాత్రం పూర్తికావడంలేదు. ఈ లోపల పొయ్యిమీదనున్న పాలు పొంగుతున్నాయి. యశోదమ్మ బిడ్డనక్కడ కూర్చోపెట్టి, పొంగుతున్న పాలకొరకు లేచివెళ్ళింది. కోపం వచ్చినట్లుగా ముఖంపెట్టి, ఒక చిన్న రాయిని ఎదురుగా ఉన్న పెరుగుకుండమీదకు విసిరాడు కృష్ణుడు. కుండ పగిలింది. వెన్న చిక్కింది. వెన్ననంతా తినేసి, ఎవరో తనను కొట్టినట్లు ఏడుస్తూ, ఎటో వెళ్ళిపోయాడు.

పొంగుతున్న పాలసంగతి చూచి, యశోదమ్మ వచ్చేసరికి పెర్గుకుండ ముక్కలై కనిపించింది. వెన్న దొంగలించిన జాడలు కనిపిస్తున్నాయి. మరి పిల్లవాడు?! వాడి జాడమాత్రం కనబడలేదు. 'ఏడివీడు? ఏమయ్యాడు?' అనుకొంటూ పదడుగులు ముందుకు వేసింది.

ఎదురింటిలో కనబడ్డాడు కృష్ణుడు. రోలుమీద కూర్చునాడు. పైనున్న ఉట్టెను అందుకొని, కుండలోనుండి వెన్నను తీసి కోతిపిల్లకు పెడుతున్నాడు. అన్నీ కోతిచేష్టలే! ఆ కోతిపిల్ల సంబరపడుతోంది. యశోదమ్మకు ఒళ్ళుమండింది. చేతిలోనికి కర్రతీసికొని కృష్ణునిమీదకు పరుగెత్తింది.

కృష్ణుడు దొరుకుతాడా! రోలుదిగి పారిపోతున్నాడు. యశోదమ్మ అతడివెంట పడుతూనే ఉంది. ఎంతపడినాదొరకడు. ఇక వెంటపడలేకపోతోంది. అలసిపోతోంది. కృష్ణుడది గమనించాడు. కావాలని ఆగి ఒక ప్రక్కగా నిలబడి ఏడుస్తున్నాడు. ఏడుస్తూ కాటుక కళ్ళను చేతులతో నలుపుతున్నాడు. ఆ నల్లని ముఖంపై నల్లని కాటుక చారలు చిత్రంగా ఉన్నాయి. ఇరువురిలో ఎవరు ఎక్కువ నల్లన? కృష్ణుడా, కాటుకా? అవి పోటీ పడుతున్నట్టున్నాయి.

యశోదమ్మ కృష్ణుణ్ణి కొట్టబోయింది. కానీ కొట్టలేకపోయింది. ముద్దు చేస్తుంటే హద్దుమీరుతున్నావా? నీవు అలా, ఇలా చేస్తున్నావని వారూ, వీరూ చెబితే 'ఏమిటిలా చెబుతారు!' అనుకొన్నాను. నిన్ను వెనకేశుకొచ్చాను. ఇవాళ ఇంటా, బయటా ఒకేసారి కళ్ళతో చూశాను, నా కళ్ళాతో చూశాను. నాతో రా, నీపని చెబుతాను. అని చేయిపట్టుకొని ఇంటికి తీసికొని వచ్చింది.

"నిన్నిప్పుడు ఒక రోటికి కట్టివేస్తాను అప్పుడు సరిపోతుంది. నిన్ను కొట్టినట్లూ కాదు, వదిపెట్టినట్లూ కాదు" అంటూ త్రాడు తీసికొని వచ్చి, అతణ్ణి రోటికి కట్టే ప్రయత్నం చేస్తోంది. రెండంగుళాలత్రాడు తక్కువైంది. "ఇలా ఉందా నీ పని" అని ఇంకో త్రాడును తెచ్చి దానికి ముడివేసింది. మళ్ళీ రెండంగుళాలు తక్కువైంది. ఇలా ఇంటిలో తాళ్ళన్నీ వచ్చి చేరుతున్నాయి. ఎప్పటికప్పుడు రెండంగుళాలు తక్కువ అవుతూనే ఉంది. యశోదమ్మ అలసిపోతోంది. ఆ అలసటను గమనించాడు కృష్ణుడు. ఠక్కున కట్టుబడ్డాడు. తాననుకుంటే తప్ప తానెవరికీ కట్టుబడడతను! ఆ అనుకోవడాన్నే అనుగ్రహమంటారు. "అమ్మయ్య! వీడిపని ఇప్పటికి ముడిపడింది." అనుకొంది యశోదమ్మ. ఇక నిశ్చింతగా వెళ్ళి ఇంటిపనులు చూచుకొంటోంది.

ఉన్న చోటున ఉంటాడా కృష్ణుడు! అలా ఉంటే ఇక కథేముంది? కృష్ణుడు తాను కదిలాడు. రోటిని కదిలించాడు. అల్లంతదూరాన ఉన్న మద్దిచెట్లను సమీపించాడు. మద్దిచెట్ల మధ్యనుండి తాను అవతలికి సాగాడు. రోలుమాత్రం ఆ చెట్లకు అడ్డుపడింది. అయినా కృష్ణుడు రోటిని లాగుతున్నాడు.

చిత్రం! మద్దిచెట్లు ఫెళఫెళమని విరుచుకుపడుతున్నాయి. అమాంతంగా ఫెళ్ళగిల్లిపోతున్నాయి. ఒరిగిపోతున్న ఆ చెట్లలోనుండి ఇద్దరు దివ్యమూర్తులు లేచి నిలబడ్డారు. వారిద్దరూ కుబేరుని కుమారులయిన నలకూబర, మణిగ్రీవులు! అహంకారంతో పేట్రేగి ప్రవర్తించిన కారణాన నారదుని శాపానికి గురై, ఇలా ఇక్కడ మద్దిచెట్లయి పడి ఉన్నారు. కృష్ణ స్పర్శతో ఈ శాపం విడిపోతుందని కూడా నారదుడే చెప్పి ఉన్నాడు. నారదుడి వచనాన్ని నిజంచేస్తూ, కృష్ణుడు తనతోటి కథను ఇలా మలుపు త్రిప్పాడు.

నలకూబర, మణిగ్రీవులు శ్రీకృష్ణుని స్తుతించారు. కృష్ణుడు వారిని బుద్ధిగా ఉండమని చెప్పి, ఆశీర్వదించి పంపించివేశాడు.

అప్పటికి నందాదులక్కడకు చేరారు. పెనుగాలిలేదు. పిడుగు పడిన జాడలేదు. చెట్లిలా పడిపోవడమేమిటి? ఫెళఫెళమని ఆ శబ్దమేమిటి? చెట్లమధ్యలో చెక్కుచెదరని ఈ బాలుడేమిటి? నందాదులాశ్చర్యపడుతూ నిలబడిపోయారు.

బాలకృష్ణుడు ఇలా చెట్ల మధ్యగా వస్తున్నాడు. రోలు ఇలా చెట్లకు తగిలింది. చెట్లికపడిపోయాయి, అంటూ గోపబాలకులు విడ్డూరంగా చెప్పారు.

వ్రేపల్లె వాసులలో పెద్దవాడైన ఉపనందుడు ఒకరోజున నందుని ఆధ్వర్యంలో ఊరందరినీ సమావేశపరచి ఇలా చెప్పాడు: మీరంతా గమనిస్తున్నారు కదా! కృష్ణుడు పుట్టినప్పటినుండీ రాక్షస శక్తులు మన పల్లెను చుట్టుముడుతున్నాయి. కాని, అవేమీ చేయలేకపోతున్నాయి. అంతవరకూ బాగానే ఉంది. కాని ఇంతవరకూ ఎందుకు రావాలి? మనమెందుకు రానియ్యాలి? రాక్షస పీడకు ఆలవాలమైన ఈ పల్లెను పట్టుకు మనమెందుకు వ్రేలాడాలి? చోటుమారితే బాగుంటుందేమో! అప్పుడీ పరిస్థితులు కుదుట పడతాయేమోనన్న అలోచన నాకు వస్తోంది. కృష్ణుని మహిమలకు నేనూ సంతోషిస్తున్నాను. కాని మనుషులుగా మన పాత్రలను మనమూ పోషించాలి కదా!

ఒకపని చేద్దాం! యమునానది తీరాన బృందావనమనే ప్రాంతం ఉంది. చూడముచ్చటయిన పర్వత ప్రాంతమది. చెట్టూ, చేమా, పచ్చికా, నీరూ — దేనికీ లోటు లేదక్కడ. మన బృందమంతా అక్కడకు చేరుకొందాం — ఏమంటారు?

అందరూ అలాగేనన్నారు. బళ్ళు బయలుదేరాయి. వ్రేపల్లెవాసులు బృందావనానికి ఒక యాత్రగా బయలుదేరారు.

అవును. బృందావనమిక ఒక యాత్రా స్థలమవుతున్నది కదా! బృందావనమొక పుణ్యక్షేత్రమై వర్ధిల్లబోతున్నది కదా!

కృష్ణుడిక బృందావన విహారి కాబోతున్నాడు. వేణుగాన లోలుడయి, యమునా తీరాన విహరించబోతున్నాడు.

బృందావనం చేరారందరూ! ఉపనందుడు కృష్ణుడివైపు చూశాడు. "బాబూ! తృప్తిగా ఉన్నదా ఇప్పుడు! అన్నట్టుగా. కృష్ణుడొక చిరునవ్వు నవ్వాడు. తాతా! నా సంకల్పమే నిన్ను అలా పలికించింది. వ్రేపల్లెను బృందావనానికి తరలించింది" — అన్నట్టుగా.

బలరాముడు చేరవచ్చి, కృష్ణుని భుజంపై చేయివేశాడు. 'అన్నా!' అన్నాడు కృష్ణుడు. ఇంద అంటూ ఒక వేణువును అందించాడు కృష్ణుడికి బలరాముడు. వేణుగానమిక ప్రారంభమైంది. క్రొత్తచోటికి వచ్చిన వ్రేపల్లె వాసులను క్రొత్త లోకాలకది తీసికొనిపోతున్నది!











# వనభోజన వైభవం

వ్రేపల్లెలో ఉండగా, ఇళ్ళచుట్టూ తిరిగిన కృష్ణకథ బృందావనానికి చేరినప్పటి నుండీ పచ్చికబయళ్ళమీదుగా సాగనారంభించింది. బాలకృష్ణుడిప్పుడు గోపాలకృష్ణుడయ్యాడు. సమవయస్కులతో కలసి ఆలమందలను మేపుతూ వాటికి వేణుగానాన్ని వినిపిస్తున్నాడు.

ఒకరోజు గోవుల గుంపులలో క్రొత్తదూడ ఒకటి కనిపించింది. అది చాలా మంచిగా, బుద్ధిగా ప్రవర్తిస్తోంది. మెల్లమెల్లగా కృష్ణుని వైపుకు వచ్చేస్తోంది. అది దూడకాదు. దూడరూపంలో ఉన్న రాక్షసుడు అని గమనించాడు కృష్ణుడు. తన గమనిక బలరామునికి చెవిలో చెప్పాడు. చెబుతూనే అలా ముందుకుసాగి, ఆ దూడ నాలుగు కాళ్ళనూ, తోకతోకూడ కలిపి పట్టుకొని పైకెత్తి ఎదురుగానున్న వెలగ చెట్టుకు వేసికొట్టాడు. చెట్టుతోపాటుగా వత్సాసురుడు చచ్చిపడ్డాడు. గోపాలకులందరూ కరతాళధ్వనులు చేశారు. ఇంకొక రోజున ప్రొద్దు పూర్తిగా పొడవకముందే చద్ది తిని ఆలమందలతో బయలుదేరారు బలరామ కృష్ణులు గోపాలకులతో కలసి. మందలను మేపుకొంటూ అలా దూరదూరంగా వెళ్ళిపోయారు.

కొంతసేపటికి అందరికీ దాహం వేసింది. తట్టుకోలేనంతటి దాహమది! అక్కడొక చెరువును గమనించారు. ఆలమందలకు ముందుగా నీరుపెట్టి, తామూ దప్పిక తీర్చుకొని గట్టెక్కుతున్నారు.

గట్టెక్కుతూ ఉంతే ఆ ప్రక్కగా ఒక కొంగ కనిపించింది. చాలా పెద్ద కొంగ. వజ్రాయుధం దెబ్బకు తెగిపడిన పర్వత శిఖరంలాఉంది. బలమయిన శరీరం, పెద్ద పెద్ద రెక్కలు, గట్టిముక్కు భయంకరంగా ఉంది చూడటానికి. యోగిలాగ ఎటూ చలించకుండా కూర్చుంది. కాని దాని చూపంతా కృష్ణునిపైనే ఉంది. కృష్ణుడలా దగ్గరకు వచ్చాడో లేదో, కొంగ ఒక్కసారిగా కదిలింది. భయంకరంగా అరుస్తూ ఉవ్వెత్తున లేచింది. కొండ గుహలాగా నోరుతెరిచి కృష్ణుణ్ణి మింగేసింది. బలరాముడూ, మిగిలిన గోపాలకులూ నిశ్చేష్టులై నిలబడ్డారు, ప్రాణాలను కోల్పోయిన ఇంద్రియాల్లా!

మ్రింగడమయితే మ్రింగిందిగాని. కృష్ణుడు దానికి మ్రింగుడు పడటంలేదు. గొంతుమండిపోతుంది దానికి. అంతా దాని గొంతుమీదికొచ్చిందిప్పుడు!

కృష్ణుణ్ణి బయటకు ఉమ్మేసి, ముక్కుతో చీల్చాలని చూసింది. ఉమ్మేయడమే తడవుగా కృష్ణుడు దాని ముక్కులను పట్టి చీల్చేశాడు. క్షణాలలో బకాసురుడు మరణించాడు.

గోపాలకులు తేరుకొని మళ్ళీ కరతాళధ్వనులు చేశారు. కృష్ణా! ఇప్పటికే ప్రొద్దుపోయింది. ఇక ఇళ్ళకు చేరుదాం! అంటూ ముందుకు సాగారు.

నందాదులకు ఈ రాక్షసుల వదలూ, కథలూ ఎప్పటికప్పుడు తెలుస్తున్నాయి. గర్గముని చెప్పినట్టు ఈ కథ ఇలా కంసుని వరకూ సాగుతుంది. కంసవధతో గాని కథ ఒక కొలిక్కిరాదు అని అనిపించింది వారికి. బలరామకృష్ణుల లీలలను మరల మరల స్మరించుకొంటూ సంతోషంగా కాలం గడుపుతున్నారు వాళ్ళు.

వ్రేపల్లెకూ ఇక్కడకూ ఒక తేడా ఉంది. వ్రేపల్లెలో ఇలాంటి ఘట్టాలు జరిగినప్పుడు మనస్సుకు బాగా కష్టం అనిపించేది. ఇప్పుడు, ఇక్కడ ఈ బృందావనంలో అలా అనిపించడంలేదు. ఎటువంటి పరిస్థితినయినా సుళువుగా అధిగమించగలం అనిపిస్తున్నది. జరుగుతున్న సన్నివేశాలన్నీ కూడా దేవదేవుని ప్రణాళికకు అనుగుణంగానే సాగుతున్నట్లు అనిపిస్తున్నది. దానితో నందాదులు నిత్యతృప్తులయి, ఆనందభరితులయి, తమవంతు కర్తవ్యాన్ని నిండుగా నిర్వహిస్తున్నారు.

ఒకనాడు ప్రొద్దునే బలరామునితో పాటుగా అందరినీ నిద్దురలేపాడు కృష్ణుడు. "ఈ రోజు మనం వనభోజనాలు చేస్తున్నాం" అన్నాడు. అందరూ సంబరపడ్డారు. అలమందలను తోలుకొని గోపకుమారులందరూ బలరామకృష్ణుల వెంట బయలుదేరారు.

మెడల్లో దండలు, చేతులలో కర్రలు, నోళ్ళల్లో బూరలూ, భుజాన సద్దికావిళ్ళు, కాళ్ళకు చెప్పులు విలాసవంతంగా విహారానికి బయలుదేరారు.

పాటలూ, పద్యాలు పాడుతున్నారు. అడుగులూ నాట్యాలూ వేస్తున్నారూ, చేస్తున్నారు. కోకిలలతో కలసి కూస్తున్నారు. చిలకలతోకూడి అరుస్తున్నారు. పైన పక్షులు వెళుతుంటే క్రింద ఆ నీడలవెంట పరుగెత్తుతున్నారు. పొదరిళ్ళు కనబడగానే దాగుడుమూతలాడుతున్నారు.

వాగులను, వంకలను రామదండులా దాటుతున్నారు. చెట్లనున్న పళ్ళను ఎగిరెగిరి అందుకొంటున్నారు. అంతులేని అల్లరి చేస్తున్నారు. అమాయకమైన అల్లరి చేస్తున్నారు.

ఒకడినొకడు తోస్తున్నాడు. కావిడి క్రింద పడిందని వాడేడిస్తే నవ్వుతూ చప్పట్లు కొడుతున్నారు. పరధ్యానంగా వెళుతున్నవాడి చెవిదగ్గర గావుకేక పెడుతున్నారు. వాడు దడుసుకొని త్రుళ్ళిపడితే కెవ్వున అరుస్తున్నారు. ముందు వెళుతున్న కృష్ణుణ్ణి ఎవరు అందుకోగలరని పందాలు కడుతున్నారు. ఓడిపోయిన వాణ్ణి పట్టుకొని ఆట పట్టిస్తున్నారు.

ఏ పర పురుషుని పాదధూళికోసం యోగిశ్రేష్ఠులు నిరంతరం తపిస్తారో, ఆ పరమ పురుషుడు గోపకుమారులకొక చెలికాడు. గోపకుమారులు అతణ్ణి తమ కౌగిళ్ళలో అదుముతున్నారు. అతనితో ఆడుతున్నారు. అతనిని ఆడిస్తున్నారు. అతనిని మన్నిస్తున్నారు. అతనినుండి మన్ననలందుకొంటున్నారు. ఈ గోపకుమారుల అదృష్టాన్ని ఏమని చెప్పగలం? ఎంతని చెప్పగలం!

ఆటపాటలలో అలా తేలియాడుతున్న గోపకుమారులందరినీ అఘుడు అనే రాక్షసుడు చూచాడు. ఆ అఘాసురుని పేరు చెబితే అమృతం త్రాగిన దేవతలు కూడా దడుసుకొని క్రిందపడతారు. కంసునికి ఆప్తుడువీడు. ఇంతకుముందు కృష్ణుని చేతిలో చనిపోయిన బకాసురునికి తమ్ముడు. కృష్ణుణ్ణి సంహరించడం తన కర్తవ్యంగా భావిస్తున్నవాడు.

ఉన్నట్టుండి అఘాసురుడు ఒక పెద్ద కొండచిలువగా మారిపోయాడు. దారి మొత్తం ఆక్రమించి, దారి పొడుగునా పడి ఉన్నాడు. ఆటపాటలతో ఆదమరచి ఉన్న గోపకుమారులు ఆ కొండచిలువను చూచారు. చూడండిరా ఎలా ఉందో ఇది! అన్నాడొకడు. "ఏముంటే ఏం చేస్తుంది? బకాసురుణ్ణి చంపిన కృష్ణుడే మనతో ఉన్నాడు" అన్నాడు మరొకడు.

అలా అంటూనే, అనుకుంటూనే గోపకుమారులందరూ ఆలమందలతో సహా అలా అలా ఆ కొండచిలువ నోటిలోనికి వెళ్ళిపోయారు. ఆ కొండచిలువ నోరు అంత ఉంది! ఒకకొండ గుహంత ఉంది!

అరెరే! అనుకున్నాడు కృష్ణుడు. నేనున్నానన్న ధీమాతో ముందూ వెనకా చూచుకోకుండా వెళ్ళిపోతున్నారు వీళ్ళు - అంటూ త్వరత్వరగా నడిచాడు. నడిచి వస్తున్న కృష్ణుణ్ణి తన నాలుకతో అందుకొన్నది కొండచిలువ. ఆ దృశ్యానికి దేవతలు కూడా తల్లడిల్లారు.

కొండచిలువ నోటిలోనికి చేరిన కృష్ణుడు దాని గొంతుకు అడ్డుగా నిలిచాడు. దానికి ఊపిరాడకుండా చేశాడు. కొండచిలువకిక ఊపిరి సలపడంలేదు. గిజ గిజ గింజుకుంటోంది. అటు ఇటు తన్నుకుంటోంది. అతలోనే పెటిల్లని తల పగిలిపోయింది. మేఘం చాటునున్న చంద్రుడు చుక్కలతో సహా ఈవలకు వచ్చినట్టుగా, కొండచిలువ నోటినుండి పరివారంతో సహా ఈవలకు వచ్చాడు కృష్ణుడు. వామనావరాతంలో ఒక్కసారిగా భూమ్యాకాశాలను ఆవరించిన స్వామికి ఈ కొండచిలువ నోటికి అడ్డుపడగలగడం ఇదొక విశేషమా!

చనిపోయిన కొండచిలువ శరీరం నుండి తేజస్సు ఒకటి వచ్చి కృష్ణుడిలో కలసిపోయింది. పూతనను పునీతం చేసిన కృష్ణస్పర్శ అఘాసురుని మాత్రం వదిలి పెడుతుందా! రాక్షసుడయినా అతని స్పర్శను పొందేటంతవరకే రాక్షసుడు. ఇలా పెద్ద ఎత్తున అఘాయిత్యం చేద్దామని వచ్చిన అఘాసురుడు దేవదేవునిలో లీనమయినాడు.

దేవతలు పూలవాన కురిపించారు. దేవదుందుభులను మ్రోగించారు. గంధర్వులు పాడారు. అప్సరసలు ఆడారు. సృష్టిమొత్తం ఉత్సవం జరుపుతోంది. గోపకుమారులు మాత్రం తామనుకొన్న ప్రకారం వనభోజనాలకై సాగిపోతున్నారు.

ఆడుతూ పాడుతూ గోపకుమారులకు సరస్సు నొకదానిని చూపించి, "ఇక ఇక్కడ కూర్చుందాం, కావిళ్ళు దించండి" అన్నాడు కృష్ణుడు. మందలకు నీళ్ళు త్రావించి పచ్చిక బయళ్ళలో విడిచిపెట్టారు. కృష్ణుణ్ణి మధ్యలో కూర్చోపెట్టుకొని, తాము చుట్టూ కూర్చున్నారు.

ఇక చల్దుల ఆరగింపు ప్రారంభమయింది. కావలసినంత అల్లరి చేస్తున్నారు వాళ్ళు. అసలా అల్లరి చేయడానికే ఇంత కార్యక్రమం పెట్టుకొన్నారు.

ప్రక్కవాడిని మరీ మరీ ఊరిస్తూ, తన ఊరగాయను ఆవురావురుమని తింటున్నాడొకడు. ప్రక్కవాడి కంచంలోనుంది ఒడుపుగా తీసికొని, తన నోట్లో వేసికొని "కావాలంటే నా నోరు చూడు" అంటున్నాడొకడు. కావాలని అయిదారుగురితో పందెం కట్టి, అందరివంతులూ ప్రోగుచేసి, తానొక్కడే బొక్కుతున్నాడు ఒకడు. అలాకాదని, తన కంచంలోనిది అందరికీ పంచుతున్నాడు ఒకడు. 'అదిగో కృష్ణుడేం చేస్తున్నాడో!' అని చూపించి, ఈలోపల అక్కడున్నదానిని తినేస్తున్నాడొకడు. ఇలా నవ్వుతున్నారు. నవ్విస్తున్నారు. వారి మధ్యలో కృష్ణుడు మాత్రం మీగడ పెరుగుతో కలసిన అన్నముద్దను అరచేత పెట్టుకొని, వేళ్ళమధ్యలో మాగాయ ముక్కలను దూర్చుకొని, మధ్య మధ్యలో నంజుకొంటూ తింటున్నాడు. పెరుగన్నానికీ, మాగాయబద్దకూ అదేమి చుట్టరికమో మరి!

ఆదమరచి చల్దులు కుడుస్తున్న గోపకుమారులు ఒకసారి అటూ, ఇటూ చూసి తత్తరపడ్డారు. ఆలమందలు అక్కడెక్కడా లేవు.

అందరూ ఒక్కసారిగా లేవబోయారు. వద్దని వారించాడు కృష్ణుడు. "మీరందరూ ఆటపాటలతో ఆరగిస్తూ ఉండండి నేనలా వెళ్ళి ఆలమందల సంగతి చూసి వస్తాను" అన్నాడు. అలాగే అన్నారు వాళ్ళు. దబ్బున వచ్చేయమన్నారు.

కృష్ణుడు మందలకోసం ముందుకు సాగుతున్నాడు. "ఇదిగో ఇక్కడ మేత మేసాయి. ఇక్కడ నీళ్ళు త్రాగాయి. ఇక్కడ కొంచెం సేపు ఆగాయి. ఇటువైపునుండి ఇలా వెళ్ళినట్లున్నాయి." అని గుర్తులు పెట్టుకొంటూ వెళుతున్నాడు. ఎంత వెళ్ళినా ఆలమందలు కనబడలేదు. 'ఏమిటిది?' అని ఆలోచనలో పడ్డాడు. వెనుదిరిగి గోపకుమారుల దగ్గరకు వచ్చాడు. వారూ అక్కడలేరు. 'వీరూ లేరా? ఏమిటిదంతా?' ఒక్కక్షణం పరిశీలించాడు. పరిస్థితి అతడికి బోధపడింది.

ఇది బ్రహ్మదేవుడిపని! అఘాసుర వధను చూచి, అతడు చేసిన అఘాయిత్యమిది! బాలకృష్ణుడట, ఈ కుర్రవాడు నాతో నిమిత్తం లేకుండానే ఇన్ని లీలలను చేసేస్తున్నాడు అని ఈర్ష్యపడ్డాడు బ్రహ్మ! కృష్ణుడికి తన తడాకా చూపించాలనుకొన్నాడు. ఆలమందలనూ,

గోపకుమారులనూ ఒక్క ఉదుటున మాయంచేసి, ఒక గుహలోపల బంధించాడు. 'ఇప్పుడేం చేస్తాడీ కృష్ణుడు?' అని వేచి చూస్తున్నాడు బ్రహ్మ.

కృష్ణుడు చిరునవ్వు నవ్వాడు. ఆ చిరునవ్వు నవ్వుతూ తానే ఆలమందలుగా రూపొందాడు. తానే గోపకుమారులుగానూ రూపొందాడు. ఇలా అన్నీ తానై ఎప్పటిలా ఇళ్ళకు నడిచి వెళ్ళిపోతున్నాడు. ఆశ్చర్యం! అవే ఆలమందలు! ఆ మచ్చలు, ఆకొమ్ములు, ఆవైఖరులు అచ్చం అలాగే ఉన్నాయి. ఇదివరకు ఎలా ఉంటే, ఇప్పుడూ అలాగే ఉన్నాయి.

ఆలమందలూ, గోపకుమారులూ ఇళ్ళకు చేరుకొన్నారు. వారికి స్వాగతం పలుకుతూ ఇళ్ళలోని అందరూ పరవశిస్తున్నారు. కృష్ణుణ్ణి చూస్తే ఎలా పరవశిస్తారు. అచ్చం అలా పరవశిస్తున్నారు. పిల్లలను ముద్దు చేస్తున్నారు. ముద్ద తినిపిస్తున్నారు. మందలను చేరినవేళ మధురానుభూతిలో తేలిపోతున్నారు.

కథ ఇలా సాగడం ప్రారంభించి దాదాపుగా ఒక సంవత్సరం అవుతోంది. గమనిస్తున్న బలరామునికి కథ క్రొత్త క్రొత్తగా కనిపిస్తున్నది. తమ్ముణ్ణి అడిగాడు. బలరాముడు. 'ఏమిటి క్రొత్తదనమని. ఉన్నది చెప్పాడు శ్రీకృష్ణుడు. మనమున్నది అందుకేగా!' అన్నాడు.

బ్రహ్మదేవునికి అనుమానం వచ్చింది. భూమిమీద ఏం జరుగుతోందా అని! దిగివచ్చి చూశాడు. ఆశ్చర్యపోయాడు. కథ ఎప్పటిలా సాగిపోతుంది. ఎక్కడా ఏలోటూ లేదు. మందలు మందలుగానే ఉన్నాయి. గోపకుమారులు గోపకుమారులుగానే ఉన్నారు. అన్నట్టూ, వీరంతా ఎక్కడనుండి వచ్చారు? నేను వీళ్ళను దాచి పెట్టానుకదా! అనుకొన్నాడు.

వెళ్ళి దాచిపెట్టిన చోటున చూచుకొన్నాడు. దాచిపెట్టినవి దాచిపెట్టినట్లుగానే ఉన్నాయి. మరీ ఆశ్చర్యపడ్డాడు. సృష్టి చేయవలసింది బ్రహ్మ. అంటే నేనే! నేనేమీ చేయలేదు. మరి ఈ సృష్టి ఎలా జరిగింది? బ్రహ్మ లేకుండా కూడా సృష్టి జరుగుతుందా?

ఒకసారి తనలోకానికి వెళ్ళిరావాలనిపించింది బ్రహ్మకు. అనుకొన్నదే తడవుగా అక్కడికి చేరుకొన్నాడు. ఆశ్చర్యం! గుమ్మం దగ్గర ఉన్నవాళ్ళు అతన్ని ఆపేశారు. "నన్నాపుతారేమిట్రా? నేను

బ్రహ్మను! అన్నాడు బ్రహ్మ. పిచ్చి మాటలు మాట్లాడకయ్యా! లోపల మా అయ్యగారు లక్షణంగా ఉన్నారు. వేషం వేసుకొచ్చినంత మాత్రంచేత అయ్యగారివయిపోతావా? ఫో, ఫో" అన్నారు వాళ్ళు.

బ్రహ్మ బిత్తరపోతున్నాడు. ఇదంతా పైనుండి చూస్తున్న సరస్వతి క్రిందకు దిగి వచ్చింది. "ఎవరితను, పంపివేయండి, ఏమిటీ పిచ్చివేషాలు" అని విసుక్కొంది.

సరస్వతీ! నేను బ్రహ్మను, అన్నాడు బ్రహ్మ. 'ఎవరదీ?' అంటూ లోపలినుండి మరొక బ్రహ్మ బయటికి వచ్చాడు. బయట బ్రహ్మ దద్దరిల్లాడు. లోపలి బ్రహ్మతో కలసి సరస్వతి లోపలకెళ్ళిపోయింది. బయట బ్రహ్మ బెంబేలు పడిపోయాడు. ఏంచేయాలో తోచలేదు అతనికిక!

మళ్ళీ క్రిందకు దిగి వచ్చాడు. సాగిపోతున్న ఆలమందలనూ, గోపకుమారులనూ పరిశీలనగా చూశాడు. ఆ నూతన సృష్టిగా వర్ధిల్లుతున్నది నారాయణుడని గమనించుకొన్నాడు. బ్రహ్మలోకంలో బ్రహ్మగా తనకు కనిపించినది కూడా నారాయణుడేనని తెలిసికొన్నాడు. "తనకు బుద్ధి చెప్పేటందుకే జరుగుతున్నది ఈ కథ" అని గమనించుకోసాగాడు.

బ్రహ్మ ఇలా గమనించుకొనే లోపున నారాయణుడు తన సృష్టిని తనలోనికి ఉపసంహరించుకొని, మామూలు బాలకృష్ణుడై, అరచేతిలో పెరుగన్నపు ముద్దతో మిత్రులందరినీ పేరుపేరునా పిలుస్తున్నాడు. ఆలమందలకోసం ఎదురుతెన్నులు చూస్తున్నాడు.

బ్రహ్మకు జ్ఞానోదయమైంది. ఆ బాలకృష్ణుని పాదాలపైన సాష్టాంగపడ్డాడు. తండ్రీ! ఒళ్ళు మరిచాను. అహంకరించాను. నన్ను క్షమించు! నీ విచ్చిన పదవిని అందుకొని, నీపైన ఈర్ష్యపడి, నిన్నే అవమానించాలని చూచిన అల్పుణ్ణి నేను. నన్ను కరుణించు తండ్రీ! నన్ను కరుణించు!

నిన్ను కేవలం గోపకుమారుడిగా భ్రమపడ్డాను. నీ మహిమలను చూచి మత్సరపడ్డాను. నన్ను కన్నతండ్రీ! నన్ను క్షమించు!

ఇప్పుడు నా కనిపిస్తున్నది. నీతో ఇంత సఖ్యతననుభవిస్తున్న ఈ గోపకుమారుల ముందు నా బ్రహ్మపదవి ఎంత? అని ఇప్పుడు నాకనిపిస్తున్నది!

ఏలా బ్రహ్మపదంబు? వేదములకున్ వీక్షింపఁగారాని ని
న్నీలోకంబున నీ వనాంతరమునం దీ మందలోఁ గృష్ణ యం
చాలాపాది సమస్త భావములు నీ యందే సమర్పించు నీ
వ్రేలం దొక్కని పాదరేణువులు పై వేష్టించినం జాలదే?

ఈ బ్రహ్మ పదవి ఎందుకు తండ్రీ! కృష్ణా! కృష్ణా! అని నిన్ను నోరార పిలుస్తూ, చేతులు కలిపి నీతో నడుస్తూ ఉన్న ఈ గోపకుమారుల పాదధూళి ఇంత శిరస్సున జల్లుకొంటే చాలదా! నీ భక్తుల పాదధూళి ముందు ఈ నా బ్రహ్మ పదవి ఎంత?

బ్రహ్మ బాలకృష్ణుని పాదాలకు అలా కరచుకొని ఉండిపోయాడు. శ్రీకృష్ణుడు అతన్ని లేవనెత్తి ఒడలు నిమిరి సాగనంపాడు.

గోపకుమారులూ, ఆలమందలూ అన్నీ యథాతథంగా ప్రత్యక్షమయ్యాయి. వనభోజనాలు మాములుగా సాగుతున్నాయి. జరిగిన కథ కృష్ణుడికి తప్ప ఎవరికీ తెలియదు. గోపకుమారులందరూ కృష్ణుణ్ణి చూస్తూ- 'నేస్తమా! రావోయీ! నీ కొరకే చూస్తున్నామోయి! నీవు లేకుండా ఎలా తినగలమోయి? రా, రా, రావోయి!' అంటూ ఆదరంగా పిలుస్తున్నారు.

కృష్ణుడా! ఇంకెప్పుడూ కూడా మమ్మల్ని ఇలా మధ్యలో విడిచిపెట్టి వెళ్ళొద్దు! ఉంటే అందరం ఉందాం. వెళితే అందరం వెళదాం. మేమొకచోట, నీవొకచోట అనే స్థితి కలుగకూడదు, అంటూ ఆర్తి చెందుతున్నారు వాళ్ళు.

అందరూ కలసి మధ్యలో నిలిచిన భోజనాలను ఇక పూర్తి చేస్తున్నారు. మొత్తంమీద ఇంత కథ జరిగితే వారి వనభోజనాలు పూర్తికాలేదు.

ఆటపాటలతో ఇక ఇళ్ళవైపుకు బయలుదేరారందరూ! బృందావనగాథ మలుపు తిరుగుతోంది. రాక్షసులు కాకపోకలతో బాటుగా, దేవతల రాకపోకలు కూడా ఇప్పుడు ప్రారంభమయినాయి. కృష్ణుడు భూమివాసులనేకాదు ఇటు రాక్షసులనూ, అటు దేవతలనూ

కూడ కలిపి కరుణిస్తున్నాడన్నమాట! ఉన్నది భూలోకంలోనైనా మూడు లోకాలను ఇక్కడినుండే పాలిస్తున్నాడాయన!

బృందావనం సకలలోకవాసులకూ ఎల్లకాలం మేలుకొలుపునందించగల ఒకానొక దివ్యమైన బిందువుగా రూపొందుతూ ఉన్నది. బృందావన విహారి అందరి మనస్సులలో నిండుతూ, సృష్టికథను పండుగగా నడిపిస్తున్నాడు. భూమి జనులకలలను పండిస్తున్నాడు. మనస్సున్నది అతడు నిండడం కోసమే! మనమున్నది అతడివెంట ఉండటం కోసమే, అన్నట్లు సాగుతున్నారు అందరూ కూడా!











